పంజాబుఅల్లరి

చెన్నపురి, 1922

Record no. 491

Pañjābuallari

Cennapuri, 1922

Record no. 491

Bibliographic Record Target

పంజాబుఅల్లరి : దేశీయమహాసభ వారిచే నిర్మింపబడ్డ పంజాబు సబ్కమిటీనివేదితము.- చెన్నపురి : వుప్పలూరి లక్ష్మీనారాయణశాస్త్రి, 1922.

91 p. : ills. ;21 cm.

Record no. 491

Pañjābuallari : dēśīyamahāsabha vāricē nirmimpabaḍḍa Pañjābu sabkamiṭīnivēditamu.- Cennapuri : Vuppalūri Lakṣmīnārāyaṇaśāstri, 1922.

91 p. : ills. ;21 cm.

Record no. 491

పంజాబు అల్లరి.

దేశీయమహాసభ వారిచే నిర్మింపబడ్డ
పంజాబు సబ్ కమిటీనివేదితము.




ఆంధ్రప్రజాసంఘము కార్యదర్శియగు
వుప్పులూరి లక్ష్మీనారాయణశాస్త్రి, బి. ఏ., యం. ఆర్. ఏ. యెస్,
గారిచే ప్రకటితము.

చెన్నపురి:
వావిళ్ల ముద్రణాలయమున,
ముద్రితము.
1922

Printed by

V. RAMASWAMY SASTRULU & SONS

at the 'Vavilla' Press, Madras:—1922.



లాహోరున కొరడాదెబ్బలు కొట్టుట.

పంజాబు విచారణసంఘము.

1919—20

1. శ్రీ పండిత మదనమోహనమాళవ్యగారు, అధ్యక్షులు.
2. శ్రీ పండిత మోతీలాల్ నెహ్రూగారు.
3. శ్రీ మోహనదాస్ కరంచంద్ గాంధిగారు.
4. శ్రీ చిత్తరంజనదాసుగారు, కలకత్తా.
5. శ్రీ అబ్బాస్ తయాబ్జీగారు, బరోడా.
6. శ్రీ యం. ఆర్. జయేకర్ గారు, బొంబాయి.
7. శ్రీ కే. సంతానంగారు, బారిష్టరు, లాహూర్. (కార్యదర్శి)

శ్రీయుత పండిత మోతీలాల్ నెహ్రూగార్కి.—

అయ్యా,

పంజాబు విచారణసంఘమువారిచే దాఖల్ కాబడ్డ సాక్ష్యమును పరిశోధించి తీర్మానముల నిర్ణయించుటకు మమ్ముల 1919 సం॥ నవంబరు నెల తే 14 దీని నియమించినారు. మేము యీ తేదిని పని ప్రారంభించి నారము. 1700 సాక్షుల వాఙ్మూలములను శోధించినారము. ఎవరివాఙ్మూలమునుగాని నిశ్చయమని తోచినకాని అంగీకరించలేదు. సాక్షులు వారివారి చోట్లలో గొప్పవారై యుంటున్నారు. స్త్రీలవిషయమున కావింపబడ్డ దుర్మార్గచర్యలు నమ్మదగినవైనను మాయభిప్రాయమున రుజువు చాలదని తోచినందున యిందు చేర్చలేదు. సైనికప్రభుత్వము అములునకు తేబడ్డ ప్రదేశములలో విచారణ జరపినాము. ఈప్రదేశము లన్నిటిని చూచి

నాము. సభలు సమకూర్చి ప్రజల సాక్ష్యమిమ్మని కోరినాము. వాఙ్మూలముల వారికి వినిపించి లోపమున్న తెలియచేయుమని కోరినాము. ఇందుకు వ్యతిరేక మెచ్చటను జరుగలేదు. హంటరుసంఘమునకు పూర్వమే సాక్ష్యముల చాలవఱకు పుచ్చుకొనియున్నాము. సైనికప్రభుత్వమువల్ల నిర్మింపబడ్డ విచారణలోనియంశముల చదివిచూచినాము. యుద్ధమునకు మనుష్యుల చేర్చునప్పుడు ఏర్పడ్డ యిబ్బందులకు న్యాయస్థానములలో కావింపబడ్డ తీర్పులనుకూడా చూచినాము. మాకు ఎన్నియోవిధముల సహాయముచేసిన ప్రముఖులకు వందనములు చేయుచున్నాము.

ఇట్లు,

యం. కే. గంధి,
సి. ఆర్. దాస్,
అబ్బాస్ తయ్యాబ్జీ,
యం. ఆర్. జయేకర్,
సంఘసభ్యులు.

బెనారస్,
20-2-20.

మొదటి ప్రకరణము.

పంజాబు దేశ చరిత్ర.

భరతఖండములోని యన్నిప్రదేశములలోను పంజాబు మిక్కిలి ప్రాముఖ్యత వహించియున్నదని చెప్పవచ్చును. ఇచ్చటనే పూర్వము వేదముల కాలమున ఆర్యులు వసించుచుండిరి. ఇచ్చటనే మనఋషులు ఋగ్వేదమంత్రముల గానముచేసిరి. విద్యకొఱకై ఎచ్చటెచ్చటనుండియో వచ్చి విద్య గడించుచుండిన విశ్వవిద్యాలయమగు తక్షశిల యిచ్చటనేయున్నది. కురుపాండవవీరులు పోరాడిన సంగ్రామస్థల మిదియేను. ఈజిప్టురాజగు ఓసిరిస్ మొదట అడుగుపెట్టినచోటు యిదియేను. ఇచ్చోటనే ఆసీరియా రాణి సెమిరామస్ గొప్పసేనతోవచ్చి అపజయ మొందెను. సిధియన్లు, టార్టార్లు, పర్షియన్లు భరతఖండము నాక్రమించవచ్చి పంజాబుప్రజలలో బాహుప్రతాపమును చూపినచోటిదేను. ఇచ్చటనే అలెగ్జాండర్ చక్రవర్తి జయమొందినను పురుషోత్తమరాజుతో పోరాడలేక నిరాశతో వెళ్ళవలసినవాడాయెను. పంజాబుదేశము 5 నదులచే ప్రకాశించుచున్నది. ఉత్తరమున హిమవత్పర్వతము, కాశ్మీరము, దక్షిణమున సింధునది, తూర్పున యమునానది, పడమట సింధునది కలదు. పంజాబువైశాల్యము 135,773 చదరపుమైళ్లు. అందులో దాదాపు 100 వేల చదరపుమైళ్ళ ప్రదేశము, ఆంగ్లేయప్రభుత్వముక్రిందయున్నది; తక్కిన ప్రదేశము స్వదేశరాజుల పరిపాలనక్రిందయున్నది. ఇందు హిందువులు, మహమ్మదీయులు, సిక్కులు గలరు. పాంచాలదేశము సిక్కుల జన్మస్థానము. వీరిజనసంఖ్య 35 లక్షలు. కృషియే యిందలిప్రజలకు ముఖ్యజీవనాధారముగా నుండెనుగాని యిప్పుడిప్పుడు కర్మాగారము లేర్పడి వాణిజ్యము వృద్ధియగుచున్నది. బ్రిటిష్సైన్యమునకు పంజాబే ముఖ్యఆధారము. కడచినయుద్ధమునకు అన్నియితరరాష్ట్రములకన్న పంజాబునుండియే యెక్కువసైనికులు వెళ్ళిరి. పరాక్రమవంతులైన తెగలలో సిక్కులు అగ్రస్థా

నము వహించియున్నారు. రసపుత్రులును, యాదవులు (జాట్స్) వీరి వెనుకస్థానమున యుంటున్నారు. దక్షిణపశ్చిమభాగములం దుండెడివారు రసపుత్రులు, యాదవులు, మహమ్మదీయులు. ఉత్తరపూర్వభాగములందుం డెడివారు హిందువులు. మధ్యభాగమున యుండువారు విశేషముగ సిక్కులు. యుద్ధసమయమున పంజాబుచేసిన సహాయమునుగూర్చి లెప్టినెంటు గవర్నరు ఓడ్వాయర్ 1919 ఏప్రిల్ తే 7 దిని యీతీరున ప్రసంగించియున్నాడు. "యుద్ధారంభమున సైన్యమున 100 వేలమంది మాత్రమే యుండిరి. మొదటి 2 సంవత్సరములలో 124 వేలమందిని సైన్యమున చేర్పగలిగితిమి. మరుసటిసంవత్సరమున 127 వేలమందిని చేర్చినాము. గతించినసంవత్సరమున (1918) సైన్యమునందు కుల్లు 2½ లక్షమందియుండిరి. ఆకాలమున యుద్ధ మతితీవ్రముగ యున్నందున మనసార్వభౌముడు ఒకసందేశమును పంపియుండెను. అటుపై నేను పంజాబునుండి 200 వేల సైనికులు కావలెనని కోరితినికాని, నాకోరిక గొప్పదని చాలామంది తలంచిరి. అయినను 1918 సం॥ ఏప్రెలుమొదలు మేలోగా కోతకాలమగుటచే విశేషసైన్యము చేర్పలేకపోతిని. అయితే 21 వేలమందినిమాత్రము చేర్పగలిగితిని. జూన్ మొదలు సెప్టంబరువరకు 78 వేలమందికంటె నెక్కువగా సైన్యమున చేరిరి. అక్టోబరుమాసమున విషజ్వరము పీడించుచున్నందున 14 వేల 426 మంది మాత్రమే చేరిరి. నవంబరుమాసమున మరింతయుత్సాహముతో పని ప్రారంభించుసరికి యుద్ధము సమాప్తమయ్యెను. ఈసంవత్సరమున 8 మాసములలో 121 వేలమంది చేరిరి. అవసర ముండియున్నచో నే ననుకున్న 200 వేలమందిని చేర్చియేయుందును. యుద్ధము జరుగుచుండిన నాల్గుసంవత్సరములలో మనరాష్ట్రమునుండి 360 వేలమంది సైన్యమున చేరిరి. ఈసంఖ్య హిందుదేశమంతటనుండి చేరినసైనికులసంఖ్యలో సగముకన్న హెచ్చుగ నున్నది..."

పంజాబురాష్ట్రపరిపాలనము ఒకలెప్టినంట్ గవర్నరువల్ల జరుగుచున్నది. కొందరు ఎన్నుకోబడ్డ సభ్యులు, కొందరు సర్కారువారిచే నియమింపబడ్డ సభ్యులుగల శాసనసభ యొక టందుగలదు. పంజాబునకు

ముఖ్యపట్టణము 250 వేలుప్రజలుగల లాహోర్. ఈరాష్ట్రము 28 జిల్లాలుగా విభజింపబడి, 5 గురు కమీషనర్ల అధికారముక్రింద యుంటున్నది.

రెండవప్రకరణము.

ఓడ్వాయర్ ప్రభుత్వము.

1919 సంవత్సరము ఏప్రెలు 6-తేదిని భారతదేశమంతటను హారితాళము జరిగియుండెను. 10-తేదిని అమృతసరమున సభకు సమావేశమైనట్టెన్ని నిరాయుధులైనట్టెన్ని ప్రజలను డైయర్ సేనాని నిష్కారణముగ కాల్చియుండెను. ఈమధ్య 7-తేదిని ఓడ్వాయరు సామ్రాజ్యశాసన సభలో ఈతీరున ప్రసంగించెను. "...సమయ మెఱుగక పంజాబునుగూర్చి స్తోత్రముచేయుచుందునని కొందరభిప్రాయపడుచున్నారు. సంకుచితభావముతో నేనట్లు చేయుటలేదు. 15 సంవత్సరములు నేను దేశమున సంచరించుచుండి ముఖ్యపట్టణములు, అందలిప్రజలు వారిగుణాతిశయములు, శీతోష్ణస్థితులు, ప్రభుత్వపద్ధతులు మొదలగువాని చక్కగా పరిశీలించినాను. కాని, రాజాంతఃపురమునుండి కృషీవలుని కుటీరమువఱకును పంజాబున కనబడు సుగుణములు ఎచ్చటజూచినను మఱొక్కచోట నాకు కనబడదు. పంజాబీయుడు ఏతెగవాడైనను విశ్వాసమున యితని సరిపోవువాడు మఱొక్కచోట కనబడడు. రాజభక్తికలవాడైనను దాసుడు కాడు. ధైర్యవంతుడైనను డాంబికముండదు. సాహసవంతుడైనను వెఱ్ఱిపోకలు పోవువాడు కాడు. అభివృద్ధి కోరువాడయ్యును మిథ్యాదర్శముల నాశింపడు. ఈగుణాతిశయముబట్టియే యన్నిరాష్ట్రములలోను పంజాబగ్రస్థానమును వహించియున్నది. దీనికితోడు మనస్థైర్యమున్నయెడల పంజాబు పురోవృద్ధికి ముందంజవేయగలదు..."

ఈదేశము త్వరలో వదలు నుద్దేశముతో తనఆఖరుమాటగ ఈయంశములను చెప్పియుండెను. కాని యిదేయుపన్యాసమున మరల యీక్రిందితీరున చెప్పెను.—

"...ఈరాష్ట్రాధికారులు యుద్ధసమయమునసహితము శాంతిభంగమునకు ఎడమియ్యనపుడు యుద్ధానంతరమున అల్లరులకు ఎడమిత్తురా? తీవ్రాందోళనమున పాల్గొనిన అమృతసరము లాహోరులోని కొందరిపైయిండియాసంరక్షణచట్ట మనుఅస్త్రము యిప్పటికే ప్రయోగింపబడినది. శత్రువుల సంహరించినట్టిన్ని యంతఃకలహముల నణగద్రొక్కినట్టిన్ని బ్రిటిషు ప్రభుత్వమునకు యీ యాందోళనకర్తలు లక్ష్యములేకపోయినను వీరు అజ్ఞానులు, అనుభవము లేనివారిని దుర్మార్గమున త్రిప్పకుండునట్లు చేయుటకు గానిట్లు చేయబడినది. కాన నేను చెప్పునదేమన, యీరాష్ట్ర రాజకీయవ్యవహారములలో ప్రవేశము కల్పించుకొనువారందరును సభల నిర్వహించుటయందును యుపన్యాసములు గావించుటయందును వీని ప్రతిఫల మనుభవించుటయందును వారికివారే జబాబుదారిగా నుండవలయును కావున మెలకువగా ప్రవర్తింతురుగాక! దీనికి తప్ప, సభల నిలుపుదల చేయుటగాని ప్రజల వాగ్బంధనము జేయుటయందుకాని ప్రభుత్వమువారి కిష్టములేదు. అయితే సభలుచేయువారు మంచియుద్దేశ్యము గలవారైనను అట్టిసభలయందు తీవ్రముగా మాట్లాడువారిని అడ్డగించుటకు తగినధైర్యము వీరికి లేదు. కొందరు వాక్చాతురులు పరుషపుమాటలు సర్వదా నుపయోగించుటచే గౌరవనీయులు ఇట్టిసభలకు వెళ్ళుటకు ననుమానించుచున్నారు. అందుచే న్యాయబద్ధమగు పరిస్థితులకు నవకాశము లేకయున్నది. ఈకారణమువల్లనే పత్రికాసంపాదకులను యుపన్యాసకులను యిప్పుడు హెచ్చరించవలసివచ్చినది. నూతనరాజ్యాంగసంస్కరణములు అమలులో పెట్టుటకు తగినసన్నివేశ మిది కానేరదు. ఈసన్నివేశమునకు అవకాశమివ్వని ఆందోళనకర్తలను దేశద్రోహులుగా పరిగణింపవలసియున్నది. అదృష్టవశమున వీరు కొద్దిసంఖ్యాకులగుటచే వీరియభిప్రాయములు రాష్ట్రాభిప్రాయమని తలచుటకు వీలులేదు..."

పిదప రౌలట్ చట్టమునుగూర్చి ప్రశంసించుచు పోలీసువారికి నిరంకుశాధికారము యివ్వలేదని యసత్యవాక్యముల పలికెను. ఈచట్టము చూచిన ప్రతిమనుజుడు వీరికి నిరంకుశాధికారమొసంగుచున్నదని తల

చక మానడు. ఇందువల్లనే యీచట్టమును ప్రజలంద రాక్షేపించుచున్నారు. ఓడ్వయర్ యింతటితో దృప్తిజెందక ఏప్రెల్ 6 దిని దేశీయులందరు భక్తిపురస్సరముగ కావించిన హరితాళమునుగూర్చి పరిహాసించుచు యిట్లు చెప్పెను. "......ఈమధ్య లాహోరులోను అమృతసరములోను రౌలట్టుచట్టమును ఖండించుచు జరిగినసభలు సంకీర్తనలు కేవలము పిచ్చిగాయున్నవి. కాని వీనివల్ల యజ్ఞానులగు ప్రజల నెంతవఱకు మోసపుచ్చవచ్చునో స్పష్టమగుచున్నది. ఇట్లు వారిని తప్పుత్రోవల త్రిప్పువారిపై విశేషబాధ్యత యుంటున్నది. వారికి నేను ప్రెసిడెంటు లింకన్ గారివాక్యమును జ్ఞప్తికి తెచ్చుచున్నాను. 'నీవు మిక్కిలి తెలివిగలవాడవై అధర్మమునకు లోబడినయెడల యందరిని కొంతకాలముగాని, కొంతమందిని ఎల్లకాలము మోసపుచ్చవచ్చునేకాని అందరిని సర్వకాలములయందు మోసపుచ్చలేవు.'-ఇట్లు అజ్ఞానుల మోసపుచ్చువారికి ప్రాయశ్చిత్తకాలము రాగలదు...."

ఏప్రెల్ 7 దీని జరిగిన హరితాళమునుగూర్చి ఏరాష్ట్రాధికారిగాని హేళనము జేసియుండలేదు. ఓడ్వయర్ తప్ప యితరులందరును ప్రజాభిప్రాయమును జక్కగా దెలిసికొనిరి. కాని, యితనుమాత్రము ప్రాయశ్చిత్తదినము నెదురుచూచుచుండెను. అజ్ఞానులగు ప్రజల నితను ఏతీరున వుద్రేకించెనో యధికారుల తప్పుత్రోవల ద్రొక్కించెనో ముందు వివరించుట మావిధ్యుక్తధర్మమై యున్నది. ప్రాయశ్చిత్తదినమునకు తానెట్టిఅర్థము నిచ్చెనో చెప్పుటకు మాకు చాలా కష్టముగ నున్నది. అల్లరులైనతర్వాత ఏప్రెలు 10 దిని పంజాబులోని వీరులు తనకిచ్చిన సన్మానపత్రమునకు బదులు చెప్పుచు యిట్లనెను. "........ఈరోజున జరిగిన అల్లరులు మనసభకు భంగము కల్పించినందులకు సంతోషించుచున్నాను. ఈరాష్ట్రములోని వీరులలో ప్రముఖులిందరు రాజభక్తిసూచించుచు ఇచ్చట సమావేశమైనందుకు గర్వపడుచున్నాను. ఇట్టి యల్లరులసమయమున యధికారుల కష్టముల తా మెఱిగియేయున్నారు. శాంతిని భంగపరుచువారి నడచుటకు యుపాయముల కనిపెట్టవలెనుకదా? ఈమధ్య అల్లరుల

నడచుటకు కావింపబడ్డట్టిన్ని యల్లరులు లేనియెడల యుపయోగమునకు
నవకాశము లేనట్టిన్ని చట్టమును ఎట్లు విపరీతార్థములు చేసి ప్రజలకు
దురభిప్రాయము గలుగజేయుచూ ఆందోళనము గొందరు సల్పుచున్నారో
మీరెఱిగియేయున్నారు. ఈయాందోళనము నిష్కారణమైనదని చట్ట
మును చదివిన మీకు తెలిసియేయున్నది. ముల్తానున జరిగినయంశముల
బట్టి ఈ యాందోళనకారకుల యుద్దేశము యిట్టిదని మీరు తెలుసుకో
వచ్చును. రౌలట్టుచట్టమునకై యాందోళనమను పేరుతో యుద్ధమునుండి
యిచ్చటికివచ్చిన మహమ్మదీయ, సిక్కు, గూర్ఖా వీరులను ఎంతయో
యగౌరవపఱచిరి. వీరియందు శౌర్యము యిసుమంతయైన కానరాదు.
సర్వకాల సర్వావస్థలయందు యధికారుల దూషించుటయే వీరిపనిగా
యున్నది. రాజభక్తిగలవారు వీరికృత్యముల కెడమివ్వకూడదు. మీరు
మీమాటపలుకుబడిగలచోట్లలో వీరియసత్యవాదమును వెల్లడించి ప్రజ
లను రాజభక్తిగలవారినిగా చేయుదురని నేను కోరుచున్నాను. ఈయుద్య
మకర్తలు సత్యాగ్రహవ్రతమును నొకదానిని పైకితీసిరి. దానివల్ల శని
వారమున ముల్తానున యేమిజరిగినదియు మీరు విన్నారు. ఆదివారమున
అమృతసరము, లాహూరులలో శాంతియుతులగు ప్రజల నెట్టికష్టముల
పాలుచేసినదియు, బొంబాయిన బహిరంగముగ చట్టధిక్కారము చేసినదియు
మీరెఱుంగుదురు. ఈయుద్యమమును బూర్తిగ దుదముట్టించనియెడల
విప్లవము సంభవించును. ఇప్పటికే లాహూర్ అమృతసరములందు శాంతి
యుతులగు ప్రజలప్రాణములకు విత్తమునకును మోసము కలుగుచున్నది.
గనుక మీలో ఎట్టియభిప్రాయభేదమున్నను యధికారులతో కలసి ఈఆం
దోళనమును తుదముట్టింపవలెను. ఇప్పటిపరిస్థితులు విషమదశయందు
న్నవి కావున తక్షణమే మీరు (అధికారులు) కార్యమునకు గడంగవలెను.
అధికారులు నిరంకుశచట్టముల నములున బెట్టవలెను. దీనివల్ల విప్లవము
సంభవించినయెడల యీయాందోళనపరులే జవాబుదారి యగుచున్నారు.
నేను యీరాష్ట్రము వదలకముందే మీసహాయమున శాంతి నెలకొల్ప
గలనని నమ్ముచున్నాను. యుద్ధసమయమునసహితము పంజాబీలు నేనను

కొన్న యన్నిసహాయములు జేసియున్నారు. ఇప్పుడుకూడ నాకోరిక సఫ
లము కాకపోదు. ఇకనేను సెలవుపుచ్చుకొనెదను. మీశౌర్యసాహసముల
నెన్నడు మఱవజాలను......"ఓడ్వైయర్ యిట్టివాడని తెలియుటకై
యతనియుపన్యాసమును బూర్తిగ యిందు పొందుపరచినాము. యుద్ధ
వీరుల ప్రజలపై పురికొల్పెను. ఇతనిమాటలలో నసత్యము లెన్నియో
గలవు. ముల్తానువిషయమై యితను చెప్పినది సగ్వాబద్ధము. రౌలటు
చట్టములనుగూర్చి యితను సూచించినదంతయు నసత్యమేను. రాజకీ
యాందోళనమున పాల్గొన్నవారిని శిక్షలపాలు చేసెదనని భయపెట్టెను.
ఇక, ఓడ్వైయరుయొక్క పరిపాలనమునంతయు నిందు సంగ్రహించెదము.
అన్నితరగతులవారిని దనశత్రువులుగా నెట్లుచేసికొనెనో విద్యాధికుల పలు
కుబడినుండి ప్రజాసామాన్యుల నెట్లు తొలగింపచూచెనో యిందు స్పష్టపడ
గలదు. ఇతడు లెప్టినెంటుగవర్నరుపదవికి వచ్చుటకు మునుపే పంజాబు
పరిస్థితుల జక్కగ నెఱింగియుండెను. ఇతడు అధికారమునకు వచ్చినవెం
టనే తన్ను గౌరవించిన యొకసభయం దిట్లు చెప్పెను. "......నేనెట్లు
అధికారము సాగించవలసినది, ప్రజల ఆశయముల దృప్తిపరచుట కేమేమి
చేయవలసినది, స్వరాజ్యమును సులభసాధ్యముగ చేయుటకును, అధికార
న్యాయశాఖల విభజించుటకును నేనేమిప్రయత్నముల జేయవలెనో అందు
కుపద్ధతులు నేను పదవికి వచ్చినకొలదిరోజులలోనే నాకు తెలియజేయబడి
నవి. వీనికిదోడు ప్రజలెట్లు వారివిధ్యుక్తధర్మముల నెరవేర్చవలెనో వారే
సూచించియుండిన బాగుగనుండెడిది. రాజ్యాంగమార్పులన్నియు దీని
తర్వాతనే రావలెను......"రాబోవు సంస్కరణములు భ్రమయని
యీమాటలవల్ల సూచించెను. ప్రజాసంరక్షణము ఆంగ్లేయు లప్పటికే
నెలకొల్పిరనియు అటుపైని సంస్కరణముల వాంఛించుటయే ప్రజలధర్మ
మనియు మన మెఱుంగుదుము. ఇదేయుపన్యాసమున దేశభాషాపత్రికల
హెచ్చరించెను. ఈహెచ్చరిక వెంటనే కార్యరూపము దాల్చెను. అనేక
పత్రికలవద్దనుండి ధరావత్తు కోరబడెను. కొన్నిటిధరావత్తుల లాగుకొనెను.
మఱికొన్నిరోజులకు శాసనసభలో వార్తాపత్రికలగూర్చి యిట్లు మాటల

ప్రశంసించెను. "....ఇప్పుడు కావించినవని చాలనియెడల పత్రికాసంపాద
కులను పత్రికాధిపతులను అభియోగంబులపాలు జేయవలసివచ్చును..."
ఆరునెలలు కాగానే ఈరాష్ట్రమున కార్యనిర్వాహకసంఘమొకటి
యుండవలెనని కోరిన శాసనసభ్యుల కీబదులు చెప్పెను. "........ఈయం
శము నాకు మిక్కిలి ఆశ్చర్యము కలిగించుచున్నది. ఈరాష్ట్రప్రజలు
మొదటినుండియు లెప్టినంటుగవర్నరును చక్రవర్తిగా భావించుచున్నారు.
ఇట్టిప్రభుత్వమున బ్రజలన్నివిధముల నితరరాష్ట్రప్రజలకన్న యభివృద్ధి
దశయందున్నారు. గనుక యిప్పు డొక కార్యనిర్వాహకసంఘమును కో
రుట యెంతయు యసంభవము." దీనితో దృష్టిజెందక తన్ను గౌరవింప
వచ్చినవారిని యీవాక్యము జెప్పి దూషించెను. "అధికారపద్ధతులనుగుఱిం
చి తెలివిహీనులు చర్చింపనిండు." ఇంతకు అయిదుమాసములతర్వాత పం
జాబీయులకందరికి తననిరంకుశప్రభుత్వమును చక్కగా రుచిచూపించెను.
తనకెంతనిరంకుశాధికారము కావలెననికోరెనో క్రిందిమాటలవల్ల దెలియ
గలదు. రాజద్రోహులను సామాన్యచట్టప్రకారము విచారణకు దెచ్చిన
యెడల వృధా కాలయాపన మగును కావున క్రొత్తపద్ధతిని యితను సూచిం
చెను. ఆపద్ధతిప్రకారము "(1) రాజకీయవ్యవహారములలో పాల్గొనువారికి
మేజస్ట్రీటు ఇక్కడ విచారించ నక్కరలేదు. (2) విచారణమీద అపీలుండ
కూడదు. (3) నేరస్తులు ధరావత్తు సులభముగా నిచ్చునట్లు చేయవలెను.
(4) గ్రామోద్యోగులనుగాని గ్రామస్థులనుగాని వారు విప్లవకారులకు చో
టిచ్చినయెడల వెంటనే వారిని శిక్షించవలెను." నిష్కారణముగ దేశరక్ష
ణచట్టమును తిలకు, పాలుగార్లపై చలాయించి వారు తనరాష్ట్రము
లోనికి రాకూడదని శాసించెను. కారణములేకనే దేశభక్తు లనేకులను
ప్రవాసమందుంచెను. సుప్రసిద్ధదేశీయపత్రికల రాష్ట్రములోనికి రాక
చేసెను. దేశభాషాపత్రికల కనేకకష్టముల కల్పించెను. ఇట్లు ప్రజలనోళ్లు
కట్టి వారెంతో తృప్తిగాయున్నారని పైకి చెప్పుచుండెను. చట్టముల నిట్లు
అమలున పెట్టుటయేగాక నాయకులను బిల్పించి వారిని పరిభవించి బెది
రింప నారంభించెను. ప్రజానాయకుడగు లాలా దునీచందు యీవిషయ

మున తనయనుభవమునుగూర్చి సాక్ష్యమిచ్చెను.—"ఇండియనుసంఘము
నకు నేను కార్యదర్శిగా యుండుటచే బహిరంగసభల సమావేశపరచవలసి
యుండెను. ప్రభుత్వకార్యదర్శియు లాహూరుకమీషనరును నన్ను పిలి
పించి సభల జరుపుటకు యెన్నియో యాటంకములను కల్పించుచుండిరి.
సభలకు యెవరికి ఆహ్వానములు పంపవలెనో ఎవరికి పంపకూడదో అను
విషయములగూర్చి సలహాలిచ్చుచుండిరి. బహుశా ఓడ్వాయరుగారి యుత్త
రువుమీదనే యిది జరిగియుండవలెను. ఇంతియేగాక లాహోరున
జరిగిన రాష్ట్రీయసభకు వచ్చిన చట్టనిర్మాణసభ్యులను ప్రభుత్వకార్య
దర్శి పిలిపించి మఱల యేసభకు వారు వెళ్లనట్లు వారిని బెదరిం
చెను......"

1917 సం॥ న సామ్రాజ్యశాసనసభ్యులు 19 మంది ఒకసంస్కరణ
ప్రణాళికను బ్రకటించియుండిరి. దీని నాలోచించుటకై ఒకసభ కూడి
యుండెను. ఆసభను సమావేశపరచినవారిలో 4రు పంజాబీయులు. వీరిని
ఓడ్వాయరు పిలిపించి చీవాట్లుపెట్టెను. దీనితర్వాత కాంగ్రెస్ ముసిలిం
లీగు ప్రణాళికను పంజాబువారు యనాదరణ చేయునట్లు చేసి హిందూమ
హమ్మదీయసమ్మేళనమునకు భంగము కలిగించెను. మఱియు శ్రీతిలకు,
బిసెంటుగార్ల స్వరాజ్యయాందోళనమునకు విప్లవకారులకు సంబంధము
కల్పించెను. కాని వీరియాందోళనము సక్రమమైనదనియు, యాంగ్లేయుల
సామ్రాజ్యములో మనదేశ ముండవలెననియు నందరికి తెలిసియేయు
న్నది. విప్లవకారుల ప్రయత్నములలో దీని కేలాటిసంబంధము లేదు.
విప్లవకారుల విషయమున మిక్కిలి క్రూరతజూపెను. నిరపరాధులగు ననే
కుల బాధపెట్టెను. పంజాబు పడమట దిక్కులేనివారిండ్లలో దోపిళ్ళు జరిగి
నవుడు నిరసనభావమున యూరకుండెను. అమీద యీదోపిళ్ళవల్ల ప్రజలు
సైన్యమున చేరుటకు వెనుతీయగా అప్పుడు యీ విషయమున శ్రద్ధపుచ్చు
కొనెను. 1917 సంవత్సర సెప్టెంబరునెల 13 దిని గా॥ షాఫీగారు చట్టనిర్మాణ
సభయందు పంజాబుపరిపాలన బీహారు ఒరిస్సాలపరిపాలనవలె నుండవలె
నని ఒకతీర్మానమును తెచ్చెను. ఇందుకు మరెవ్వరు వ్యతిరేకాభిప్రాయ

మును చూపలేదు. ఓడ్వయర్ ఈతీర్మానము బలపఱచుట కుపక్రమించి మనవిద్యార్థులను సంస్కరణల వాంఛించువారిని యనవసరముగ దూషించెను. ఈమాటల శ్రీమాళవ్యగారు వినలేక యసంతుష్టిని కనబరచిన మీదట వైసిరాయి (రాజప్రతినిధి) ఓడ్వయరును సభవారికి క్షమాపణ కోరునట్లు చేసెను. ఈయుపన్యాసమునుండి కొన్నియంశముల యీక్రింద పొందుపఱచుచున్నాము. "......నేనున్నట్టి పంజాబుపరిస్థితుల బట్టిజూడ నేలాటిసంస్కరణములకు తగినసన్నివేశమే లేదని దృఢముగా జెప్పగలను. సంస్కరణలగోరువారు మాటలలో దృప్తిజెందక పంజాబునుండిచేరిన సైన్యమును జూచి తృప్తిజెందక వారివారిరాష్ట్రములలో సహితము సైనికులచేర్చిన బాగుగనుండును.........ఎటుచూచినను సంస్కరణప్రణాళికలు యుపన్యాసములు కనబడుచున్నవి. కాని దీనినిచేయువారు భ్రమవదలి కర్షకులకష్టముల తీర్చుటకు ప్రయత్నించినచో యెంతయో బాగుగనుండెడిది......" ప్రపంచమున నెవరైనను క్షమాపణ కోరినమీదట నాతప్పు మఱలచేయరు. కాని ఓడ్వయ రీక్షమాపణకావించిన నెలలోనే మఱింత తీవ్రముగా విద్యార్థుల తూలనాడెను. "......కడచినమాసమున జరిగిన సామ్రాజ్యశాసనసభలో యుద్ధమునకై పంజాబుకావించిన సహాయమునుగూర్చి కొంతచెప్పియుంటిని. ఇందుకు యితరరాష్ట్రీయులకు కొంత యాగ్రహము కలిగెనుకాని పంజాబుచేసిన సహాయము మరేరాష్ట్రము చేయలేదనియు అందువల్ల అధికారులు పంజాబువిషయమున హెచ్చుగౌరవము చూపవలెననియు నేను చెప్పుచున్నాను. ఇంతియెగాక పంజాబునందుండువీరులకు సంస్కరణములవల్ల యేలాటిలాభముండదు కావున వారివిషయమున ప్రత్యేకముగ గౌరవము జూపవలెను." ఈయుపన్యాసమందు తనపూర్వపుతప్పిదమును బలపరచుకొనెను. పంజాబునందు శూరవంశస్థులను ఇతరులనుండి ప్రత్యేకపఱచి యధికారపద్ధతి యెటులున్నను వారి కక్కరలేదని వారిని దూషించెను. విద్యార్థులను జూచిన యాతని కెంతనిరసనభావమో యీయుపన్యాసమునుండి పూర్ణముగా బోధపడగలదు.

విద్యార్థులయెడల యీతనియభిప్రాయము లింకను పూర్ణముగా సంస్కరణప్రణాళికపై నీతడంపిన సారాంశము బోధపడును. "ఈ కోరికలన్నియు జన్మహక్కులుగల ప్రజాసామాన్యమునుండి కాక విద్యార్థులగు స్వల్పసంఖ్యాకులనుండిమాత్రమే కోరబడినయెడల వీరెంతశబ్దము చేసినను మనము జ్ఞానహీనులగు ప్రజలను గాపాడవలెను." ఈసందర్భములో బర్కునుడివిన వాక్యములను కనబరచుచున్నాను. "ఒకచిన్నచెట్టుక్రింద చెవులెత్తియఱచు ఐదారు ఇలకోళ్ళను విని యాంగ్లేయమహావృక్షచ్ఛాయను విశ్రమించియున్న వేనవేలు పశుసంతానమును మరవగలమా? కావున శబ్దమునుమాత్రము విని మోసపోవద్దు." ఈవాక్యమున సూచించిన యసూయాభావ మిట్టిదని ప్రత్యేకముగ జెప్పుట యనవసరము. ఇదేయుపన్యాసమున నితను ప్రజలు విద్యార్థుల దొలగద్రోయుచున్నారని కూడ సూచించెను. స్వరాజ్యముపట్ల శ్రీతిలకు, పాలు, జిన్నా, బిసెంటు మొదలగువారు చేయుకృషి యెందుకు పనికిరాదని యితనియభిప్రాయము. మఱియు బ్రాహ్మణ, బ్రాహ్మణేతర వైషమ్యముల పెంచి గొప్పగా చూపించెను. ముస్లింలీగునకు నేలాటిపలుకుబడియు దేశమున లేదనియు అతను తలచెను. పంజాబులోనికి తిలకు, పాలుగార్లు రాకూడదని నిషేధించినను రాజకీయాందోళనము వృద్ధియగుచుండుటను చూచి విచారపడెను. ఈయభిప్రాయ సారాంశమును యీతీరున పూర్తిచేసెను. "..........ఇండియాప్రభుత్వమువారి ప్రణాళికలో ఈవిషయము బాగుగ చర్చించలేదు కావున నేను నొక్కి చెప్పవలసివచ్చినది. విద్యార్థు లన్నిచోట్లను ప్రజలకై పాటుపడుచున్నామని చెప్పుట మామూలైనది. కాని, ఇది యెంత యసత్యమో ఈమధ్యజరిగిన విషయములబట్టి యందరికిని తెలిసియేయున్నది. మతసంబంధమైన అల్లరుల నాపుటకుగాని యుద్ధమునకు సైన్యము ధనము చేర్చుటగాని యీలాటిసమస్యలు పైకి రాగానే విద్యార్థులగు నాందోళనపరులు కనబడరు. వారు చేయుపనులలో మంచి యిసుమంతయైనను లేదు, కీడే కలుగుచున్నది. స్వదేశసంస్థానములలో మతసంబంధమైన యల్లరులులేవని కొందరుచెప్పుచున్నారు. దానికారణము

అచ్చట నాందోళనము సల్పువారు లేకపోవుటయే. ఈమధ్య భూపాలు సంస్థానమున మహమ్మదీయులలో నున్ని, షియా తెగలవారికి జరిగిన పోరాటమునకు బీజము బొంబాయిలోని మహమ్మదీయన్యాయవాదియే. పంజాబున నిట్టియల్లరి జరగకుండుటకు కారణము మండలాధికారులు పలుకుబడిగలవారిసహాయముకోరి వారివల్ల పనులు చక్కబెట్టుకొనుటయే యని నేను తలచెదను. ఇట్టిపలుకుబడిగలవా రాందోళనసల్పువారు కారు..." విద్యార్థికు లెందుకును కొఱగారని యితనియభిప్రాయము.

ఇంక యుద్ధమునకు గావలయునసహాయమును సమకూర్చుటలో ఓడ్వాయర్ చూపిన ప్రతిభనుగూర్చి కొంతచెప్పెదము. యుద్ధ మప్పుడెంతసందిగ్ధమయముగానుండెనో మాకు తెలియును. ఆంగ్లేయ సామ్రాజ్యమున సమానహక్కుల కోరినయెడల అందుకు వలయుత్యాగము చూపవలె ననెడివిషయముకూడ మాకు తెలియును. వీలయినయెడల యుద్ధమునకు ధనము సైన్యము ఎట్టుచేర్చిరో చెప్పక యుండియుందుము కాని పంజాబున హరితాళము లెంతతీవ్రముగ జరిగెనో యచ్చటమాత్రమే యల్లరులేల జరిగెనో, ఈవిషయమును గ్రహించుటకు ఆవిషయము కొంత చెప్పవలసియున్నది. ఏల ననగా రౌలట్టుచట్టములవిషయమై ఎంతదుర్బోధనలు చేసినను ప్రజాసామాన్యమునందు యింతసంచలనము కలుగుట దుర్లభము. సామ్రాజ్యముయెడల మీధర్మము ప్రజాస్వాతంత్ర్య హక్కులను మరవనీయదు. ప్రజలయెడల నధికారులు చూపిన క్రౌర్య మధర్మమగుటచే మేము దీని నిర్ధారణచేయక తప్పదు. ఈరాష్ట్రమున అధికారులు యుద్ధసహాయమునకు అవలంబించినమార్గములు న్యాయవిరుద్ధమైనవనియు మిక్కిలి క్రూరమైనవనియు మావద్ద కావింపబడ్డ వాఙ్మూలములద్వారా నిరూపించగలము. ఈమార్గములన్నియు ఓడ్వాయరుకు తెలిసియే యుండవలయును. ప్రతిమనిషి యుద్ధమున చేరవలెనని శాసించియుండినదానికన్న నెక్కుడుగా ప్రజల నధికారులు బాధించిరి.

1918-సం॥ మే 4 దిని డిల్లీయుద్ధసభానంతరమున ఓడ్వాయరు "2 లక్షలుయుద్ధభటులు కావలెననియు దానికి ప్రజలు ఐచ్ఛికముగ జేరనియెడల

నిర్బంధపద్ధతి నవలంబింపవలసివచ్చుననియు చెప్పెను. అదేసభయందు కర్నల్ పాపాం యంగుసైన్యమున మనుష్యుల చేర్చుటలో నిర్బంధపెట్టుట తప్పదని చెప్పెను......మరల ఓడ్వాయరు బలవంతపెట్టుటనుగూర్చి కొంతచెప్పెదము, "2 లక్షల సైన్యముకొఱకు ఇండియాలో నందరిని బలవంతపెట్టవలసిన యవసరమురాదు. కాని పంజాబు యిదివరలో విశేష సహాయము జేసియున్నను కొందరుమాత్రము తప్పించుకొనిరి. ఇప్పుడందరును చేరవలసినసమయము మాసన్నమైనది కొన్నిచోట్ల ఐచ్ఛికపద్ధతి జయప్రదముగ లేదు. పంజాబుతరపున నేను మాటయిచ్చియుంటినిగనుక యేదో యొకతీరున బలవంతపెట్టవలసి వచ్చుచున్నది. 15గురకు యుద్ధమునకు ఒకరిని చేర్చవలసినట్లును లేనియెడల కొంతసొమ్ము అపరాధముక్రింద యివ్వవలసినదిగను యేర్పాటుచేసిన బాగుగ నుండునని నేను తలచెదను. ఇది యాచరణకు వచ్చుటకు కొంతకాలము పట్టును. సైనికులుమాత్రము తక్షణమే కావలసియున్నది. కాబట్టి మీరెల్లరు తగుసహాయ మొనర్చినయెడల నిర్బంధపద్ధతి పెట్టవలసిన యవసరముండదు......"

సైనికుల నెట్లు చేర్చవలసినదియు తెలియుటకు కలెక్టర్లకు యీక్రిందియుత్తరవును జారీచేసిరి. "ఏయేపట్టణములనుండి యెందరుసైనికులు రాగలరో డిప్టీకమీషనర్లు చెప్పవలెను. ఇట్లు చేయుటయందు ఇన్కంటాక్సుఅధికారులతో కలిసి పనిచేయవలెను. ఇన్కంటాక్సు లెఖలనుబట్టి యెవరెంతసొమ్ముగలవారో తెలియును. ప్రతివాడును తనఇన్కంటాక్సు లెఖప్రకార మేర్పడిన యాదాయములో సుమారు సగమైనను యుద్ధఋణమునకు (War Loan) యివ్వవలెను. అటుపైని డిప్టీకమీషనరు సభలు చేసి ఆయాయూళ్లలో యెంతడబ్బు వసూలగునో దాని నిష్కర్షగా తెలిసికోవలెను. అచ్చటచ్చట వ్యాపారులసంఘములుగా నేర్పరచి తహసీల్దారు సంఘాధ్యక్షులుగానుండి యీయల్పమొత్తమును యూరిలోను నలుగురు యిచ్చునట్లు చేయవలెను.ఎచ్చటెచ్చట యెంతధనము వచ్చినది పత్రికలలో ప్రకటించెదమనియు సన్నదులు యిచ్చెదమనియు బిరుదులు యిచ్చెదమ

నియు చెప్పి పోటీలుపడునట్లు చేయవలెను. ధనమివ్వనివారిని అధికారులు ఆదరించరని తెలుపవలెను......."

ఇందుపై క్రిందియధికారులుసహితము విశేషము కష్టపడుచుండిరి. ఇంతేకాక న్యాయాధికారులుసహితము ధనమొసంగినవారు నేరస్థులైనను విడుదలచేయుటయు ధనమివ్వనివారిని నేరస్థులు కాకపోయినను నేరస్థులుగా భావించుటయు సంభవించెను. కొన్నియుదాహరణము లిందు చూపెదము.

1917 సంవత్సరము 82వ క్రిమినల్ కేసులో న్యాయాధికారి "ఈ నేరస్థుడు యుద్ధఫండుకు చందాయిచ్చినందున వదలిపెట్టబడ్డమైనది." అని తీర్పుచెప్పెను. అదేకోర్టులో 36 నెం॥ కేసులో మేహర్‌సింగు అనువాడు ఇన్కంటాక్సు తగ్గించమని అర్జీపెట్టగా న్యాయాధికారి "యుద్ధమువల్ల యెంతో లాభము వచ్చినను ఒకదమ్మిడీయైనను యుద్ధనిధికి యిచ్చినవాడు కాడు. తనకొమారుడు సైన్యమున చేరుట కష్టమైనను చేర్చలేదు." అని చెప్పి అర్జీని త్రోసివేసెను. లేహియా యనుగ్రామములో తహసీల్దారింటికి కొందరు దొమ్మిగావెళ్లి యతనిజవానును పోలీసుభటుని తన్నిరి. దానిమీద 58 మంది అరెస్టుకాబడి 147 సెక్షన్ క్రింద విచారింపబడిరి. అపీలులో సెషన్సుజడ్జి కొందరిని విడుదలచేయుచు యిట్లుచెప్పెను. "ప్రజలు తమకున్నకష్టముల పైకి తెలియజేయ ప్రయత్నించిరి. ఈజిల్లాయందు యుద్ధఋణమునకు డబ్బుచేర్చుటయందును సైన్యమున మనుష్యులను చేర్చుటయందును అధికారులు చేసినపను లందరికిని తెలిసేయున్నది. ఈపనులక్రమములనియు నిరంకుశము లైనవనియు న్యాయవిరుద్ధములైనవనియు ఒప్పుకొనకతప్పదు. కాని న్యాయస్థానమందు వానిఋజువుచేయుట చాల కష్టము. నేనుమాత్రము నాయనుభవమునుబట్టియు సాక్ష్యమున లేనివంగతిబట్టియు నాలోచించి కొందరిని విడుదలచేయుచున్నాను." వీరిపనులు న్యాయవిరుద్ధమని యీన్యాయాధికారి చెప్పినను యీఅధికారులకు యేలాటిదండన విధింపకపోవుటయేకాక వారికి హెచ్చుపుద్యోగములుకూడా యిప్పించిరి. షాపూర్ జిల్లా తహసీల్దారు చంపబడెను. అందుపై జరిగిన

కేసులో ఆతహసీల్దారు యుద్ధమునకు భటులను బలాత్కారముగా చేర్చినాడనితప్ప మరేవిధమైన ప్రజాపీడనము చేయలేదని న్యాయాధిపతి తీర్మానము చెప్పెను. కాని యాకేసులో నొకటిరెండుసాక్షులు చెప్పిన వాఙ్మూలమును ఆలోచింతము. తహసీల్దార్ గుమాస్తా యిట్లు చెప్పెను. "తహసీల్దారు గ్రామములో ఎందరు యుద్ధమున జేరగలరో వారిసంఖ్యను నిర్ణయము చేయమని గ్రామాధికారులను గోరును. అటుమీద ప్రతిగ్రామమునకు తానువెళ్లి వారిని రమ్మని బలవంతపెట్టును. గ్రామములలో యితనువచ్చుసంగతి తెలిసి ప్రజలు పారిపోవుట కలదు......."

రివిన్యూ అసిస్టెంటు అహమద్ హుస్సేన్ యిట్లు చెప్పెను. "....... స్త్రీలయెదుట పురుషులను దిగంబరులుగా నిలువబెట్టినాడని నేను వింటిని. ముళ్లకంపలమధ్య మనుష్యుల నిలువనటుపోనీక ఖైదీలుగ జేసెను. కారాకాట్ అనుచోట కొందరు స్త్రీలను యవమానపరచినాడని వింటిని. మరొకచోట గొందఱిస్త్రీలను వూరూరు త్రిప్పెంచెననికూడా వింటిని. ఊరు వదలిపెట్టిపోయినవారి భూములను పశువులచే మేపించెననియు వారిగృహముల కొల్లగొట్టించెననియు వింటిని. యుద్ధమునకు మనుష్యులచేర్పుటలో 17 వేల రూప్యాలు లంచముగ సంపాదించెననియు వింటిని......."ఈసాక్ష్యము వినికిడిపై ఆధారపడియుండుటచే కోర్టువారు దోషారోపణ చేయుటకు అవకాశము లేకపోయినను యధికారవర్గమువారు చక్కగ విచారింపవలసియుండెను. కాని వారు అట్లుచేయలేదు.

ఓడ్వయరు ప్రచురించిన లెఖలనుబట్టిచూడ నధికారు లవలంబించినపద్ధతులు కొంత తెలియగలవు. మూల్టాన్‌జిల్లాలో 1917 సం॥ డిసెంబరువరకు 759 మంది మాత్రమే సైన్యమున జేరిరి. 1918వ సం॥ నవంబరువరకు 436 మంది చేరిరి. ఇట్టియభివృద్ధి బలవంత పెట్టుటవల్ల తప్ప మరొక్కతీరున కాలేదు. ఇట్లు చేరినందుచేతనే చాలమంది సైన్యము నుండి యప్పుడప్పుడు పారిపోవుచుండిరి. అంబాలాజిల్లాలో ప్రజలు హిరి విధాయకసంఖ్యను సైన్యమున చేర్చుటకు వీలులేక ధనమునుజేర్చి యుద్ధమునజేరు ప్రతిమనిషికి 500 రూపాయలు మొదలు 1000 రూపాయలు

యిచ్చి చేర్చుచుండిరి. యుద్ధమున జేర్చుటకు మఱొకసాధనము సైన్యమున చేరుటయూ లేక 10[illegible],110 నిక్షేపాల క్రింద జామీనుయిచ్చుటయూ యనుబలవంతముచే కొందరిని జేర్చిరి. యారా యనుగ్రామమునకు ఒకయధికారి వెళ్లి కొందరు బాలురను జేరమని బలవంత పెట్టెను. ఒకబాలునితండ్రి వెళ్లి తనకు ఒకడేకొడుకనియు అందువల్ల వానిని సైన్యమున చేర్చవద్దనియు చెప్పెను. అందుకు అధికారి ఒప్పుకొననందున కొంతయల్లరి జరగెను. దానిమీద కొందరు ప్రజలు దేశసంరక్షణశాసనము క్రింద విచారింపబడి శిక్షింపబడిరి. అపీలులో జిల్లాజడ్జి వీరినందరిని విడుదలచేయుట కిట్లుచెప్పెను. “...... ఈయూరినుండి 20 మంది యుద్ధభటులు చేరినయెడల వీరిని విడుదలచేసెదనని జిల్లామేజస్ట్రేటు చెప్పియుండెను. పాపము! వీరు 20 మందిని చేర్చినను వీరిలోనుండియే 20 మంది కావలెననుమిషచే వీరిని శిక్షించెను. గుజరణ్వాలాలో 1917వ సంవత్సరమున [illegible]88 మంది మాత్రమే సైన్యమున చేరియుండిరి. దీనికి గవర్నరు యసంతుష్టిజెంది ఓబ్రయను అనువానిని మండలాధిపతిగా పంపెను. అందుమీద ఒకసంవత్సరములో 1176[illegible] మంది చేరిరి. ఈసంఖ్య యెట్లైనదో మాయెదుట కన్నులారచూచినవారు సాక్ష్యమిచ్చిరి. అందునుండి యొకరిద్దరి వాఙ్మూలముల నిందుదాహరించుచున్నాము. సర్దార్ ఖాన్ అనునతడు యిట్లుచెప్పెను. “తహసీల్దార్ మాయూరికి వైశాఖమాసమున ఒకరోజువచ్చెను. నాటిరాత్రి మరుసటిరోజు గ్రామస్థులందరు మైదానమున చేరవలెనని చాటించెను. కోతలకాలమైనందునను, ప్రజల బలవంతముగ సైన్యమును చేర్చెదరను భయముచేతను అనేకులు రాలేదు. తహసీల్దారు కోపించి 60,70 మందికి రూ. 1600 జరీమానా విధించెను. ఇంతేగాక యచ్చటనుండి 18 మైళ్లదూరముననుండు గుజరణ్వాలాకు వీరిని రమ్మని యాజ్ఞాపించెను. వీరచ్చట పోయినప్పుడు వీరినందరిని వరుసగా నిలువబెట్టి 7 గురిని యేర్పరచి వారు సైన్యమున చేరవలెనని బలవంతపెట్టి మిగిలినవారిని తన్ని చీవాట్లుపెట్టి యింకను మనుష్యులను తీసికొనిరమ్మని చెప్పి సాగనంపెను.” వైలాపూరులో వకీలుగానుండిన సర్దార్ శాంతిసింగు యిట్లుచెప్పెను. “......యుద్ధఋణమునకై య

ధికారులు యీజిల్లాలో ప్రజలను విశేషముగ కష్టపెట్టిరి. ప్రజలలో కొందరు బిరుదములాశించి ప్రజలకు వ్యతిరేకముగా పాటుబడిరి. చదరమునకు రూ 33 చొప్పున వసూలుచేసిరి. ఒకరినికూడా వదలిపెట్టలేదు. దివాలాతీసినవారు సహితము యివ్వవలసినట్లాయెను. ఇజారాదార్లు యుద్ధమునకు మనుష్యుల చేర్చనియెడల వారియిజారాలు రద్దుపరచుచుండిరి. పోలీసువారనేకుల పట్టుకొని మేజస్ట్రేట్లవద్దకు పంపుచుండిరి. వారిని జామీనుమీద వదలక ఖైదీలుచేసి సైన్యమున చేరినగాని వదలమని నిర్బంధపెట్టుచుండిరి.” ఈవిధమున ఓడ్వాయరు పంజాబుదేశమంతటను కలవరము కలిగించి పంజాబీలందరికిని ఐకమత్యము కల్పించెను. అందుచే ఏప్రెల్ నెలలో పంజాబంతయు ఏకమగుటవల్ల ఓడ్వాయర్ రోషావేశపరవశుడై ఏప్రెల్ 7 దీని ఇదివరలో సూచించిన యుపన్యాసము కావించెను. ప్రజలయాశయముల తుదముట్టించి వారియుత్సాహమును యణగద్రొక్క ప్రయత్నించెను. దేశాభ్యుదయముకై ప్రజలుకావించు ప్రతియుపన్యాసమునందును రాజద్రోహమున్నదనితలచి తన్నుతానేమఱచి ప్రజల విశ్వాసమునకు పాత్రులైయుండినట్టి సత్యపాలు, కిచ్లూ, గాంధిగార్లపై తననిరంకుశాధికారమును చూపెను. దీనివల్ల ప్రజలు మఱింత రోషావేశపరవశు లగుదురని వానికి తెలిసియే యుండవలెను. ప్రజలను యల్లరులకు పురికొల్పి యటుమీద వారిని బాగుగా మర్దించవలెనని చేసినట్లు మాకు తోచుచున్నది. మావద్ద కావింపబడ్డ సాక్ష్యమును పట్టిచూడ యతడు పంజాబీయులను విశేషముగ బాధించి యుండుటచే యాబాధలవలన ప్రజలప్పటికి తమయాత్మనిగ్రహమును కొంతవఱకు గోల్పోయిరని మాకు తోచుచున్నది. అట్టియావేశమునకు యవసరమున్నంతకంటె హెచ్చుగ ప్రాయశ్చిత్తము వడసిరి. వారువడ్డ కర్మానుభవము నుండి పవిత్రులై బయల్పడి మఱల యాత్మనిగ్రహశక్తి సంపాదించి ఓడ్వాయర్ మెప్పు వడసిరి.

రౌలట్ చట్టములు.

పంజాబు ప్రజలు యధికారులచే నెట్లు కష్టపెట్టబడిరో ముందు ప్రకరణమున జెప్పినాను. ఇట్టికష్టములమధ్య సామాన్య ప్రజలు విద్యాధికుల మాట వినుట కష్టమాయెను. ఈతరుణమున రౌలట్ చట్టములు పైకి తీయబడెను. ఈబిల్లులు పైకి తెచ్చునప్పటికి విప్లవకారులకృత్యములకు నెడము లేకయుండెను. అప్పటికి కొన్ని సంవత్సరములకుముందే పంజాబు బెంగాలునతప్ప మఱెచ్చటను విప్లవకారులు గనబడలేదు. బెంగాలున రాష్ట్రవిభజన జరిగినప్పుడు మాత్రమే విప్లవకారులసంఖ్య యధికముగా నుండెను. పంజాబునందు యధికారుల మొండగములే యీవిప్లవకారులసంఖ్యను వృద్ధిజేసెను. అధికారులు వీరిని దేశసంరక్షణచట్టము మొదలగు వివిధశాసనములచే నణగద్రొక్కిరి. యుద్ధము జరుగుచున్నప్పుడు దేశసంరక్షణశాసనమునకు అవసరమున్నను యుద్ధానంతరము యీశాసనమును తీసివేయుదురని ప్రజలు ఆతురతతో నెదురుచూచుచుండిరి. యుద్ధకాలమున సహితము యీశాసనమును దేశసంరక్షణార్థముతప్ప యుపయోగపఱచమని యధికారులు చెప్పియుండినను దేశాభ్యుదయమునకు పాటుబడుచుండిన ప్రజానాయకు లనేకులపై నీశాసనము ప్రయోగింపబడెను. ప్రజలు అధికారులయెడ భక్తివిశ్వాసముల సంపూర్ణముగ గోల్పోయిరి. యుద్ధమునందు హిందూదేశ మపారముగ సహాయ మొనర్చియుండుటచేతను ఆగస్టున పార్లమెంటున హిందూదేశ రాజ్యాంగమున సంస్కరణములు కావింపబడునని చెప్పబడుటచేతను ప్రజలు నిరంకుశశాసనములు పోయి పోలీసువారి దౌర్జన్యమునుండి తప్పించుకొని సుఖముగ నుండగలమని యాశతోనుండిరి. ఇట్టితరుణమున హఠాత్తుగా యీరౌలట్టుబిల్లులు పైకి వచ్చినవి. భారతీయులస్థితి యీసమయమున నెట్లున్నదియు గాంధిగారి యాక్రందిజాబువలన తెలియగలదు"......అయ్యో! రౌలట్ చట్టవిషయమున సత్యాగ్రహవ్రతాచరణపద్ధతి నిందు తెలియజేయుచున్నాను. హిందూదేశచరిత్రలో యీయాచరణము అసాధారణమైనదని చెప్పగ

లను కాని, యిది తొందరపడి కావించిన పని కానేరదు. అధికారుల దృక్పథమును తెలిసికొంటిని. రౌలట్ సంఘనివేదికను చక్కగా జదివినాను. అయితే కమిటివారి సిద్ధాంతమునకు వ్యతిరేకమయిన యభిప్రాయము నాకు స్ఫురించినది. రహస్యముగ నేరములు చేయువారిసంఖ్య మిక్కిలి కొద్దియనియు దేశములో ఎచ్చటనో మారుమూలములలో అట్టివారు కలరనియు నివేదికయందే స్పష్టమైనది. ఐనను యీచట్టములను దేశమంతటను వ్యాపింపచేయుట చాలా యన్యాయము. ఇకను నాబిల్లులు యేతీరున ప్రవేశపెట్టబడినవో చూడుడు. ప్రథమమున రాజప్రతినిధి కొన్ని వాగ్దానములను జేసెను. మనలో ననేకులకు రాజప్రతినిధిమాటలపై నమ్మకము పూర్తిగా పోయినది. ఆయనమాటల కర్థము సివిల్ సర్వీస్ యుద్యోగులయొక్కయు ఆంగ్లవర్తకులయొక్కయు ఆశయములు భారతీయుల వర్తక రాజకీయయాశయములకంటె హెచ్చుగా జూడవలెనన్నచో భారతీయు డెవడును ఆయనతో నేకీభవించడు. సంస్కరణము లైనను సరే కాకపోయినను సరే ముఖ్యముగ కావలసినదేమన సివిల్ ఉద్యోగులు భారతీయులనౌకర్లమని గ్రహించుటయు యాంగ్లవర్తకులు తామిచ్చటికి భారతవాణిజ్యమును తుదముట్టించుటకుగాక దానివృద్ధిపరచుటకే పాటుపడవలెననియు, అట్లు వారు తెలిసికొన్నయెడల రౌలట్టుచట్టమునకు యవకాశముండదు. లౌండన్ (న్యాయశాఖమెంబరు) ప్రజాభిప్రాయము నుల్లంఘించెను. అట్లు చేయుటవల్ల మిక్కిలి పొరబాటుపడెను. అధికారవర్గమెంతపాడయినదో యీచట్టములు తెలియజేయుచున్నవి. దీనిమార్పించుటకు అసాధారణమైనపద్ధతి నవలంబించవలసియున్నది. ఉద్రేకపూరితులగు యువకులు రహస్యపు క్రూరకృత్యములు జేసెదరు. అట్టివారికీచట్టములు మఱింత ప్రోత్సాహము కలిగించును. ఈసత్యాగ్రహ మాచరించువారికి యధికారులపై ద్వేషములేదు. ఈమార్గ మవలంబించినయెడల వారికిని యెదిటివారికిని మేలు కలుగగలదు. ఈపద్ధతియొక్కబలము వీరికి తెలిసినయెడల యేలాటియుపాయము రాచాలదు. ఇంతటి యసాధారణ [illegible] నవలంబించవలసినంత యవసర మున్నదా లేదా యని

యీవ్రత మాచరించ నిశ్చయించుకొన్నవారు బాగుగ యాలోచించి యవసరమైనదని నిష్కర్ష చేసికొనిరి. ఇక జరగనున్నదానికి భగవదనుగ్రహ మెట్లున్నది నేను చెప్పలేను.”

ఇట్లు
యం. కే. గాంధి.

సత్యాగ్రహవ్రత మిం దుదాహరించుచున్నాను:—“ఈరౌలట్ బిల్లులు న్యాయవిరుద్ధములనియు మానవుని జన్మహక్కులకు భంగకరములనియు హృదయపూర్వకముగ నమ్మి ఈబిల్లులు ఆచరణకు వచ్చినయెడల మరల యవి రద్దగువరకును మేము యీచట్టములకుగాని ఇక నేర్పరుపబోవు ఒకసంఘము తీర్మానించు యితరచట్టములకుగాని బద్ధులము కాము. మఱియు నీయాందోళనమునందు సత్యము నేపాటించెదము. ఒకరియాస్తికిగాని యొక ప్రాణికిగాని యేలాటియుపాయము కలుగజేయము......”ఇకను చట్టముకానున్న యీబిల్లులలోని యంశములను చర్చించెదము. దేశములోని యరాజకమునకు కారణము తెలిసికొనుటకును దీనిమాన్పించుటకు మార్గము సూచించుటకును రౌలట్ గారి యాధిపత్యముక్రింద యొకసంఘము నేర్పరచిరి. ఈసంఘవిచారణ రహస్యముగ జరిగినది. వీరి తీర్మానము ననుసరించియే యీబిల్లులు పైకి తేబడినవి. ఈసంఘమువారి ప్రణాళికను జక్కగ జదివినారము. సంఘము చెప్పిన సలహా కాలానుగుణ్యముగ లేనందున వారిభావము బోధకాకున్నయది. దేశసంరక్షణశాసనము లేనిది యరాజికము నడుగంట చేయుచాలమని వారు సూచించిరి. ఈవాదమున రెండులోపములు కనబడుచున్నవి. విప్లవయాందోళనము నిరంకుశశాసనములవల్లనే పోవుననియు, ఈశాసనములవల్లనే వానినెల్లప్పుడు అడ్డుపెట్టవచ్చుననియు వారు చెప్పుట యొకలోపము. ఈనివేదిక ప్రకటించినపుడు విప్లవకారులు యీదేశమున యున్నారని చెప్పుట రెండవలోపము. ఈమొదటి యభిప్రాయమువల్ల యధికారులకు రాజకీయపరిజ్ఞానము బొత్తుగా లేదని తేలుచున్నది. రెండవది నిజమైనయెడల నధికారుల తెలివితక్కువను చాటుచున్నది. ఇందులో నిజమేమన, యధికారుల

ప్రజాభిప్రాయమును దిగద్రొక్కి తమయిష్టానుసారముగ ప్రవర్తించుటయే. ఈవిషయము శ్రీనివాసశాస్త్రిగారి యుపన్యాసమున జక్కగా వివరింపబడియున్నది. “........విప్లవకారులకు సంస్కరణములతో పనిలేదు కావున సంస్కరణల తెరువుపోక యధికారులు నిరంకుశపాలనము జరుపుటయే మంచిదని చెప్పుచున్నారు. కాని యీవాదమున రాజకీయపరిజ్ఞానము శూన్యమని తోచుచున్నది. దేశస్థితిని యాలోచించినయెడల సామాన్యప్రజలు తృప్తిజెంది యున్నయెడల విప్లవకారులసంఖ్య క్రమేణ క్షీణించును......” సక్రమాందోళనసల్పువారు యీశాసనముగూర్చి భయపడవలసినది లేదనువిషయమును గూర్చి శాస్త్రిగారిట్లు చెప్పిరి. “......క్రూరశాసనములను పెట్టినప్పటినుండి దుర్మార్గులమీదనే ప్రయోగింపబడదు. కొంతయల్లరి కాగానే యధికారులతల తిరుగు ననుయంశము నాకు బాగుగ తెలియును. భారతీయులలో సత్ప్రవర్తనగల గొప్పవారి చేతులు పోలీసువారిబారినుండి తప్పించుకోలేనిసంగతి నాకు తెలియును. నిరంకుశపద్ధతి నవలంబించినయెడల నిర్దోషినహితము నెమ్మదిగయుండలేడు. నన్ను నయితము నిర్దోషి యని భావించరు. రాజకీయవ్యవహారములయం దేలాటిప్రసక్తి పుచ్చుకొనక యింటిలో జపముచేసికొంచూ పన్నుల సకాలమున చెల్లించుచు ప్రతియధికారిని యాశ్రయించువారినిమాత్రమే నిర్దోషిగా భావింతురు. రాజకీయవ్యవహారములలో నేలాటిసంబంధము కలిగించుచున్నను, ఏసభలో నాల్గుమాటలు చెప్పినను ప్రజాహితైకయుద్యమమునకు డబ్బు సమకూర్చినను వానిం దోషిగా భావింతురు. నాస్వానుభవమునుబట్టినె యిటువంటియధికారము నధికారుల కివ్వకూడదని నిశ్చయముగ చెప్పగలను. ఇట్టిశాసనములలో నట్టిసంస్కరణముల నములునపెట్టినను నెందరిని శాసనసభ్యులుగ జేసినను వారందరు మీకు లోబడినవారగుదురేకాని నిజముగా బ్రజాభిప్రాయమును వెల్లడించువారు కానేరరు. దుర్మార్గుల శిక్షించవలెననెడికోరిక మనకందరికి కలదు. కాని వారల నెట్లు శిక్షించవలెననునంశమును దీర్ఘముగ నాలోచించవలెను. ఘోరసంగ్రామసమయమునసహితము కొన్నిచట్టము

లకు బద్ధులై యుండవలసియున్నది. నేరములచేయువారిని తటాలున పట్టుకొని దండించరాదు. న్యాయప్రకారము కొన్నిపద్ధతుల ననుసరించి క్రమపద్ధతిన శిక్షించవలెను. అట్లు కానియెడల నిర్దోషులుసహితము నెమ్మదిలేక భయభ్రాంతులై యుండవలసివచ్చును. కొంతమంది దోషులు తప్పించుకొనినను సరియేగాని నిర్దోషులు వారిజన్మహక్కుల విడనాడి, రాజకీయాందోళనమున పాల్గొనకచేయుట గొప్పపొరబాటు. ఈశాసనము యొక్క యుద్దేశము రాజకీయాందోళనమును నక్రమపద్ధతుల త్రిప్పుటయేకాని దాని తుదముట్టించుట కాదని విల్సింటుగారు చెప్పిరి. విల్సింటుగారి కెంతనుద్దేశమున్నను ఫలిత మెట్లుండునో చెప్పలేము. శాసనచరిత్రలు చూచినయెడల సదభిప్రాయము లెన్నియో మంటగలుపుటను కనుగొనగలము. పేదరికమును బోగొట్టుటకు శాసింపబడ్డ శాసనములు దానినే వృద్ధిజేసెను.... ....ఇప్పుడు మనకగపడుశాసనములు రాజకీయాందోళనమును నన్మార్గముల త్రిప్పుటకు చేయబడినను యాందోళనమునే పూర్తిగ తుదముట్టించుటకు యత్నించుననని విల్సింటుగారితో చెప్పుచున్నాను. దీని నములులోనికి తెచ్చు నధికారులందరును విల్సింట్‌వలె సదభిప్రాయులై యుండుట దుర్లభము....” ప్రజలేకగ్రీవముగ యీశాసన మక్కరలేదని దేశమంతటను నల్లరిపెట్టినవిషయమునుగూర్చి శాస్త్రిగారిట్లు పలికిరి. “......ఈశాసనముల నామోదించు భారతీయు డెవడైన గలడా ? ప్రజలలో నేకవ్యక్తివాడైనను మిమ్ములతో నేకీభవించుటలేదు. నియామకసభ్యులు సహితము నధికారవర్గమునుండి చీలిరి. జమీందారీ సభ్యులు తమవ్యతిరేకభావమును తెలిపిరి. న్యాయవాదిసభ్యులందరును ఇట్టిశాసన ముండకూడదని తీవ్రముగచర్చించిరి. వాణిజ్యసభ్యులుకూడా యీశాసన మక్కరలేదనిరి. ఇట్లన్నను లౌండస్ యీతీరున చెప్పెను. ‘మాకు యీశాసనము మంచిదనితోచుచున్నది కావున నాచరణకు తెచ్చియేతీరుదుము. ఇందుకు మీరుసహాయము చేసినయెడల బాగుగనుండెడిది. మీరు సహాయము చేయకున్నను మావిధ్యుక్తధర్మమును నెరవేర్చవలసియున్నది....’ న్యాయశాఖయొక్క సభ్యుని ధైర్యమునకు

నంతయు నంతసించెదను. ‘మాకు నేడు బాధ్యత గలదు. మీకు నేడేలాటిబాధ్యతగాని లేదు.’ అనువాక్యము సత్యము. ఈచట్టముల నములులోనికి తెచ్చుటలో నిజముగా మన కేలాటిబాధ్యతగాని లేదు. ఈవిషయమును ప్రతివారును గ్రహించెదరుగాక!” శాస్త్రిగారు తనయుపన్యాసము నీతీరున తుదముట్టించెను. “న్యాయశాస్త్రిసభ్యుడు మేమాందోళన సల్పెదమని బెదరించుచున్నామని చెప్పెనుకాని ఈరో జచ్చట మాటలాడినసభ్యులలో నొక్కరైనను అటుల బెదరించి యుండలేదని నేను దృఢముగా జెప్పగలను. మాలో నెవ్వరికిగాని ముఖ్యముగా మితవాదులలో నెవరికిగాని ప్రజలలోనికి ప్రవేశించువారలను పురికొల్పునట్టి సామర్థ్యము లేదు. అది కానిపని. ఇప్పటికే ప్రజలలో విశేషముగ నశాంతిప్రబలియున్నది. ఇప్పటివరకును ఆయశాంతిని కల్గజేయుటలో మే మేలాటిపాలు పుచ్చుకొని యుండలేదు. కాని మీమాట లిచ్చట నిష్ఫలములయిన యెడల బిల్లులు చట్టములై యములులోనికిఁ దేబడినయెడల మాలో నెవ్వరుగాని యీయాందోళనలో చేరనియెడల నాతడు తనవిధ్యుక్తధర్మమును నెరవేర్చనివాడగును.”

అధికారేతరసభ్యులందరును నొక్కటై యీబిల్లును నములులోనికిఁ దేగూడదని తీవ్రముగ వాదించినను బిల్లు చట్టమగునట్లు తీర్మానింపబడెను. 22 అనధికారసభ్యులు బిల్లునకు వ్యతిరేకముగా సమ్మతులనిచ్చిరి. బిల్లుపక్షమున సమ్మతుల నిచ్చినవారు 35 గురు. వీరందరును యధికారులేను. ఒక్కశంకరునాయరుతప్ప మిగిలినవారందరును విదేశీయులేను. వీరుమాత్ర మధికారపదవియం దుండియుండుటచే వేరుగ చేయుటకు వీలులేకపోయెను. కడసారి బిల్లు మార్చి 18 తేదినాడు చట్టముగా తీర్మానింపబడెను. ఇందుపై మదనమోహనమాళవ్యగారు, జిన్నాగారు మజురులహక్కుగారు తమసభ్యత్వమునకు రాజీనామాల నిచ్చిరి. బి. యన్. శర్మగారును రాజీనామా నిచ్చెనుగాని ఒకదివసములో మరల దాని నుపసంహరించుకొనెను.

ఇక నీచట్టమునందుగల యంశములను పరిశీలించెదము. మొట్టమొదట నీచట్టము సర్వదా యుండవలసినట్లు తేబడెను కాని మూడు సంవత్సరములు మాత్రముండిన చాలు ననుసవరణ నంగీకరింపబడెను. అయినను అసలుచట్టమునకు గల యాక్షేపణ యేమాత్రమును తగ్గలేదు.

ఈచట్టము యైదుభాగములుగా విభజింపఁబడి 43 సెక్షనులనుగలిగి యున్నవి. దీనియుపోద్ఘాతము యిట్లున్నది. "అరాజకము నగుద్రో కుట్రకు యిప్పుడుండు క్రిమినలు న్యాయశాస్త్రము చాలనందున నవసరాధికారము నేర్పాటుచేయుట యావశ్యకమని తోచినందున ఈచట్టము బ్రిటిషు ఇండియా యావత్తునకును వర్తించును. మొదటిభాగము ప్రకారము గవర్నరు జనరలు యిండియాలో నేభాగమునందైనను యరాజక ద్రోహములు సాగుచున్నవనియు, షెడ్యూలులో నుదహరించిననేరములు జరుచున్నవని తోచినయెడల యాయాభాగములలో యీ చట్టమును నములులోనికి తేవచ్చును. ఈచట్టమును కావలయునని కోరువారు గవర్నరు జనరలువంటి పెద్దయుద్యోగి యవసర మున్నదనినగాని చట్టము అమలులోనికి రామగాన భయపడవలసిన యవసరము లే"దనెదరుకాని ప్రథమమున బుద్ధిలోల్పువాడు ఒక పోలీసుబంట్రోతు ఎక్కడనో కొంత యల్లరి జరుగగానే రాజకీయద్రోహము జరుగుచున్నదనియు, క్రొత్త చట్టము నములులోనికి పెట్టవలసిన యవసర మున్నదనియు తనపై యధికారికి రిపోర్టుచేయును. అందుపై యా పై యధికారి కొంత విచారించినట్లు నటించి యవసరమున్నదనియే తీర్మానించి గవర్నరు జనరల్ గారికి యధికార మిమ్మని రిపోర్టు పంపును. పై వారికి నిజస్థితి యేమాత్రమును తెలియదు. అధికారు లేమిచెప్పెదరో దానికి సరియనుట వారిమామూలు. ఈవిషయము పంజాబు దేశములో జరిగినకృత్యములను బట్టిచూచిన తేటతెల్లమగును. ఇక షెడ్యూలులో నివ్వబడిన నేరము లెవియో చూతము. రాజద్రోహ మనున దొకటి. ప్రాణోపద్రవమగు నాయుధములతో నల్లరిచేయుట మఱొకటి. అపాయకరమగు నాయుధములతో గాయములు కలుగజేయుట డబ్బిమ్మని గాయములు కల్గఁ

జేయుట మొదలగునవి. గనుక యధికారకృత్యము నెద్దేని తీవ్రముగా ఖండించినంగాని, మతకలహములు జరిగినగాని, హిందూమహమ్మదీయులు పోట్లాడుకొనినగాని, దొంగలు దొమ్మిజేసినగాని ఇవన్నియు విప్లవద్రోహములుగ భావింపబడి యీచట్టము నములులోనికి దెచ్చుట కవకాశముఁ గల్గును. ఇక విచారణ నెట్లగునో చూతము. న్యాయశాస్త్రి సభ్యుడే విచారణనుగుఱించి యిట్లు చెప్పెను. "ఈవిచారణలలో మేజస్ట్రేటు మొదట విచారణచేయ నవసరములేదు. ఒకతూరి న్యాయాధిపతి విచారించిన చాలును. అపీలుకూడా లేదు. ఇంతియెకాక విచారణసహితము రహస్యముగా జరుగవచ్చును." కోర్టుకూడా హైకోర్టుండు స్థానమునందుఁగాక వే రెచ్చటనైనను కూర్చొనవచ్చును. ఈచట్టమందు 7 వ సెక్షను ప్రకారము క్రిమినల్ ప్రొసీజరుకోడ్డులో నుండు యంశములు యీవిచారణలకు పనికిరావు. 8 వ సెక్షను ప్రకారము మరణదండన విధింపబడు నేరములుసహితము మేజస్ట్రేట్లవద్ద వారంట్లకేసులలో జరుగు విచారణపద్ధతినే యవలంబింపవలయును. నేరస్తుడు ఒకవాయిదాకన్న వాయిదా కోరగూడదు. అదికూడా 14 రోజుల కతిక్రమింపగూడదు. 18 వ సెక్షను ప్రకారము ఎవిడెన్సు ఆక్టులోని ముఖ్యములగు రెండంశములను రద్దుచేయబడినది. ఎవిడెన్సు ఆక్టుప్రకారము చనిపోయినవాని సాక్ష్యము తీసికోవలెనన్న నది తనధననష్టమును తెచ్చునదిగాను యంతకుపూర్వమే క్రాసుపరీక్షయై యుండవలెను. దీనిబట్టి సంపూర్ణముగ న్యాయము ధ్వంసమగును. క్రాసుపరీక్షగాని సాక్షియొక్క వాఙ్మూలమునలన యెట్టినిరపరాధికిగాని ప్రాణాపాయము గలుగగలదు. 17వ సెక్షను ప్రకారము యీకోర్టుల తీర్పులమీద యేలాటియపీలును లేదు. ఖాయమైనట్టి ముగ్గురు న్యాయాధిపతులు యీవిచారణలు సల్పుదురు కావున యపీ లవసరములేదని వీరి వాదన. కాని యెంతగొప్ప న్యాయాధిపతియైనను హైకోర్టులో సంబంధము లేనప్పుడును సాధారణచట్టముల ననుసరించినప్పుడున్ను ఎట్టిన్యాయము చేయలేదు. రౌలటుచట్టములోని 2 వ భాగము యిక ముందు జరుగనున్న నేరములగూర్చి వ్రాయబడ్డది కావున అది మఱింత విశేషముగ

ఖండించబడినది. రాజప్రతినిధిగారికి విప్లవోద్యమము లున్నట్లు తెలిసినయెడల ఈరెండుభాగములను అములున బెట్టుటకు నధికారమివ్వఁబడినది. 22-వ సెక్షన్ ప్రకారము రాష్ట్రప్రభుత్వమువారికి ఎవరైనను విప్లవోద్యమము నల్పుచున్నాడని తోచినయెడల తగుమైనసాక్ష్య మున్నంతయు హైకోర్టున్యాయాధిపత్యమునకు తగినట్టి వారియెదుటబెట్టి వారియభిప్రాయము తీసుకోవలెను. అటుపైని, రాష్ట్రప్రభుత్వమువారు సదరు మనిషివద్దనుండి షెడ్యూలులోని యపవాదముల చేయకుండుటకును, యధికారులకు తెలుపనిది నివాసస్థలము మార్చకుండుటకును కొన్నిప్రదేశముల నుండి బైటికి వెళ్ళకుండుటకు ప్రజాశాంతిని భంగము చేయకుండుటకును దగ్గరనుండు పోలీసుస్టేషన్‌లో యప్పుడప్పుడు రిపోర్టు చేసికొనుటకును ధరావత్తు పుచ్చుకోవచ్చును. 24-వసెక్షన్ ప్రకారము తమయాజ్ఞను యనువర్తించుటకు అన్నియుపాయములను యధికారు లుపయోగించవచ్చును. ఎంతమర్యాదస్థుడైనను పోలీసువారిదయ నెదురుచూచుచుండవలయును. అనుమానమున నెవరినైనను వారు పట్టుకోవచ్చును. ఇదియే రోగమునకు ఔషధమైనయెడల రోగమును మాన్పుటకు మారు రోగమును వృద్ధిజేయును. రాష్ట్రప్రభుత్వమును యీవిషయములో దిద్దుటకుగాను మరొక యధికారవర్గము ఏర్పడినది. ఈయధికారవర్గమువారు రహస్యముగ విచారణ నల్పవలెను. అట్లునల్పి నేరస్థుని పిలిపించి వాడేదైన చెప్పుకోవలసియున్ననందు కవకాశ మిచ్చెదరు. 26 వ సెక్షన్ ప్రకారము నేరస్థుడు వకీలును పెట్టుకోకూడదు. అధికారులుకూడా వకీలు పెట్టుకోకూడదు. నేరారోపణము విషయములు యేవియైన బయల్పరచకూడదని తోచినయెడల యావిషయముల నేరస్థునికి జెప్పకనే విచారణ ప్రారంభించవచ్చును. ఈనేరస్థుడు తనకేమైన సాక్ష్యమున్నదని చెప్పినయెడల ఆసాక్ష్యమును న్యాయాధిపతి యిష్టపడిననే తీసికోవచ్చును. ఇది చాల కింకసు యీసెక్షన్ ప్రకారము విచారణచేయుటలో ఎవిడెన్సుఆక్టు ననుసరించవలసినది లేదు. ఇట్టిపరిస్థితులయందు న్యాయాధిపతి యెంతసత్ప్రవర్తకుడైనను న్యాయము చేయజాలడని దృఢముగ జెప్పగలము. 27 వ సెక్షన్ ప్రకారము అధికారులు యీ

తీర్పును పాటించవలసినదిలేదు. మరిన్ని ధరావతు పుచ్చుకొన్నకాలమును మరొకసంవత్సరము పెంచవచ్చును. ఈవిచారణచేయు ముగ్గురిలో యిద్దరు జడ్జీయధికారము కన్న హెచ్చుఅధికారమున యుండువారుగా నుండవలెను. మరొకడు ఇండియాప్రభుత్వపు వుద్యోగిగా నుండకూడదు. రెండవభాగము మొదటిభాగముకంటె తీవ్రముగా యుంటుండగా మూడవభాగము మరీ తీవ్రముగా యున్నది. షెడ్యూల్ నేరములు శాంతికి భంగకరముగా నేప్రదేశమునందైన జరుగుచున్నయెడల రాష్ట్రప్రభుత్వమువారు 22-వ సెక్షన్ ప్రకారము నేరస్థులుగా పరిగణింపబడువారిని న్యాయమూర్తివద్దకు పంపుటయేగాక యీభాగము 34 వ సెక్షన్ ప్రకారము వారంటులేకనే యనుమానముమీద నెవరినైనను పట్టుకొని కారాగారమునందుగాక మరెచ్చటనైనను నిర్బంధించవచ్చును. ఏస్థలమునైనను సోదా వేయవచ్చును. ఇట్లు పట్టుబడువారిని ఏదో కొంతవిచారణమీద దోషనిరూపణము కాకపోయినను రెండుసంవత్సరములవఱకు నిర్బంధమున యుంచవచ్చును. ఈచట్టము ఒకరిద్దరికిగాక చాలమంది పట్టుబడినప్పుడువయోగించబడును. కావున న్యాయము జరుగకపోవునేగాక యన్యాయమునకు అవకాశమగును. నాల్గవభాగ మిప్పటికే దేశసంరక్షణశాసనము క్రింద నిర్బంధింపబడినవారికి నన్వయించును. వారున్ను బెంగాల్ రెగ్యులేషన్ క్రింద నిర్బంధింపబడినవారును, ఇంగ్రెసుయింట ఇండియా ఆర్డినెన్సు క్రిందివారును ఈచట్టములోనికి వచ్చెదరు. ఐదవభాగమునందు ఈచట్టపు పద్ధతులను అముల్ నుండి తొలగించినను తొలగింపకముందు ప్రారంభించిన విచారణలుమాత్రము జరుగవలయును. మఱియు దేశమునందు యీచట్టములులో లేనిచోటునసహితము నేరస్థుని అరెస్టు చేయవచ్చును. 42 వ సెక్షన్ ప్రకారము యీశాసనము ననుసరించి చేసినయుత్తరువుల నేకోర్టుగాని యాక్షేపించగూడదు. దీని ననుసరించి యధికారులు సదభిప్రాయముతో పనిచేసినయెడల వారు జవాబ్దారీ కానేరరు. ఈశాసనమునుగూర్చియే దేశమందంతటను తీవ్రమైన యాందోళనము జరిగినది. ప్రజానాయకులు ప్రజలకు దుర్బోధనలు చేయుచున్నారని అధికారులు చెప్ప

చున్నారు. అపీలు లేదు, వాదము లేదు, వకీలు లేదు (నై అపీలు, నై దలీలు, నై వకీల్) యని ప్రజలపక్షమున నీశాసనమును వర్ణించిరి. మా యభిప్రాయమున నిందతిశయోక్తి యేమియు లేదు. ఆత్మగౌరవము యించుమంతయైనను గలవాడు సంఘమును బంధించు నీశాసనమును సహింపజాలడు. ప్రజలందరు రేకగ్రీవముగ వలదన్నను విననందున యధికారులు మహాపరాధము జేసినవారైరి. రాజప్రతినిధిగారి కిదివరకే యవసరమైనప్పుడు ప్రయోగించుటకు కావలయునస్త్రము లుంటున్నవి. అట్లుండియు సంస్కరణములు కానున్నప్పుడు ఇట్టి నిర్బంధశాసనముల యములులోనికి తెచ్చుటకన్న వేరొండు పొరబాటుండదు.

నాల్గవ ప్రకరణము.

సత్యాగ్రహవ్రతము.

ఈశాసనము నుల్లంఘించుటకే శ్రీగాంధిగారు సత్యాగ్రహవ్రతమును ప్రచారమునకుఁ దెచ్చిరి. సత్యాగ్రహమన నెట్టిదో దాని నెట్లాచరింపవలెనో తెలియుటకు వారిమాటలనే యీక్రింద నుదహరించుచున్నాను. "కడచిన 30 సంవత్సరములనుండియు నేను సత్యాగ్రహవ్రతము నభ్యసించుచు నితరులకు బోధించుచున్నాను. సత్యాగ్రహ మనుపదమునకు సాత్వికనిరోధముతోకూడిన శాసనతిరస్కారము (passive Resistance) అనుపదమునకు విశేషభేదము కలదు. 8 సంవత్సరములక్రిందటనే దక్షిణఆఫ్రికాలో యీగొప్పవ్రతమును భారతీయు లాచరించియున్నారు. సత్యాగ్రహమన సత్యబలమనియు, ప్రేమబలమనియు, ఆత్మబలమనియు కూడ నేను వాడుచుంటిని. సత్యమును స్థాపించుటకు యితరుల నెంతమాత్రము నొప్పించకూడదనియు తన్ను తానే నొప్పించుకోవలెననియు నేను ప్రథమముననే తెలిసికొంటిని. సత్యాగ్రహమునకును సాత్వికనిరోధమునకును చారతమ్యత కలదు. రెండవదానికి దేహబలము నుప

యోగించుఅవసరము రావచ్చునుగాని మొదటిదానికిట్టి యవసరముండదు. డానియల్ అనువాడు మీడ్లయొక్కయు, పరిషియన్లయొక్కయు చట్టముల ధిఃకరించి పడరానిపాట్లు పడినపుడు అతను నిజమైన సత్యాగ్రహవ్రతము నాచరించెను. సాక్రిటీసు అనుతత్వజ్ఞుఁడు సత్యబోధనము నాపివేయనని చెప్పి తనప్రాణమును సహితము గోలుపోయెను. ప్రహ్లాదుడు న్యాయవిరుద్ధమగు తనతండ్రియాజ్ఞల నుల్లంఘించి అందుకై కష్టములపడెను. మీరాభాయి తనధర్మము నిర్వర్తించుటలో భర్తకు కోపము వచ్చినను లొంగక విశేషబాధలకు లోనాయెను. సాక్రటీసు, ప్రహ్లాదుడు, మీరాభాయి, నిజమైన సత్యాగ్రహావలంబకులని భావించుచున్నాను. ఈ సత్యాగ్రహవ్రతము క్రొత్తది కాదు. మనకుటుంబవ్యవహారముల నెట్లు నిర్వర్తించుచున్నామో దానినే రాజకీయపరిస్థితులందుపయోగించఁ బ్రయత్నించుచున్నాను. కుటుంబకలహములను ప్రేమచే సమరసపెట్టుచున్నాము. నష్టపడినవాడు సాధారణముగ తనవ్యక్తి ధర్మములకొరకు నితరుల బాధించక తానే బాధపడుచున్నాడు. ప్రేమ యనుధర్మమే కుటుంబముల పాలించుచున్నది. మనుష్యజాతులు సహితము యీధర్మమును పాలించినంగాని నాగరికతఁ జెందినవా రనిపించుకోరు. ప్రేమధర్మ మన సత్యధర్మమే. సత్యము లేనిచోట ప్రేమయుండదు. సత్యము లేనిచోట కేవలము స్వార్థమైన దేశభక్తియో, యువకునికి యౌవనస్త్రీపై మోహమో, తలిదండ్రులకు బిడ్డలపై పిచ్చియనురాగమో యుండునేకాని నిజమైనప్రేమ యుండజాలదు. సత్యాగ్రహము ఆత్మశక్తి యనియే చెప్పనగును. వైరి యెట్టివాడైనను దీని ప్రయోగించవచ్చును. ఎదుటివాడు ఎదురు తిరిగినప్పుడు యీవ్రతాచరణశక్తిపూర్తిగఁ దెలియగలదు. సత్యాగ్రహమున కెందును అపజయము లేదు. దీని నవలంబించి మృతిజెందిన యెడల విమోచనమగును. కారాగారమును జేరినయెడల స్వేచ్ఛకుఁ ద్రోవఁ జూపినట్లగును. ప్రతిపక్షి సత్యమును దెలిసికొనుటకు తనభౌతికశరీర మడ్డమని సత్యాగ్రహి తలచినచో సంతోషముతో నాశరీరమును ఆహుతిగా సమర్పించును. దేహము నశించినను ఆత్మ నశించదని నమ్మినందున

సత్యాగ్రహి యీస్థూలశరీరముతో విజయము చెందవలెనని తొందర పడడు. ప్రతిపక్షి సత్యమును గ్రహించునట్లు చేయు ప్రయత్నమునందు చచ్చుటయందే సత్యాగ్రహియొక్క జయముంటున్నది. ఆత్మవికాసమునకు దేహ మొకపరికరమే. కావున చావునకు భయపడరాదు. సత్యాగ్రహి యితరుల నెంతమాత్రము హింసింపక తర్కముచేతగాని త్యాగముచేతగాని వారినడవడి మార్చ ప్రయత్నించును. కావున ఈవ్రత ముభయులకు శ్రేయోదాయకము. సత్యాగ్రహము మనజనసామాన్య మవలంబించలేరని కొందరు చెప్పుదురుగాని బాలుడుసహితము దీని నవలంబించగలడు. తాను గ్రహించినసత్యమును యితరులకు వ్యాపింపజేయవలెననెడి యంశమును ప్రతివారును ఒప్పుకొని యున్నారు. కావున పశుబలము నుపయోగించి యితరులను సత్యమార్గమునకు త్రిప్పుటకన్న ప్రాణము పోవునంతటి త్యాగమునుజేసి జయమొందుటయే మేలని యందరును ఒప్పుకొనకతప్పదు. రాజకీయవిషయములందు ప్రజలధర్మము ఎద్దియన నన్యాయచట్టములకు బద్ధులు కాకయుండుటయే. అన్యాయమనియే సూచించినపుడు అధికారులు వినినయెడల ఆచట్టములకు బద్ధులుగాక శాసనోల్లంఘమునకు విధింపబడుశిక్షకు పాత్రులు కావలెను. కావుననే సత్యాగ్రహమన్న శాసనోల్లంఘనమనియే ప్రజాసామాన్యము తలంచుచున్నది. సామాన్యపుదొంగలు రహస్యముగ శాసనోల్లంఘనముఁగావించి శిక్షలేక తప్పించుకొనుటకు ప్రయత్నింతురు. సత్యాగ్రహి చట్టములకు బద్ధుడైనయెడల భయమువల్లగాక చట్టములయందు న్యాయమున్నదని తలచి యట్లు ప్రవర్తించుచున్నాడు. ఎప్పుడైనను న్యాయవిరుద్ధమైన చట్టములు కావించినపుడు సత్యాగ్రహి కది యట్లు తోచినయెడల తాను వాని నుల్లంఘించును. ఈఅంశము బాలురకుసహితము బోధకాగలదు. ఖండాంతరమందు కార్మికు లనేకులు యీవ్రత మవలంబించి ధర్మమును నెలకొల్పిరి.

"రౌలట్టుచట్టములను ప్రచురించినప్పుడు మానవస్వాతంత్ర్యమునకు అవి భంగకారిగా యున్నవికావున వానిని పూర్ణముగా నిరోధించవలెనని

నే నుద్దేశించితిని. భారతీయులందరును వారియసమ్మతిని తెలిపిరి. ఎంత నిరంకుశ ప్రభుత్వమైనను ప్రజలందరికిని యసహ్యాకరమైన చట్టముల చేయరాదు. ప్రజ లీవిషయమున జరపు నాందోళనము నిరర్థకము కాకయుండుటకును, హానికరమగుమార్గము పడకుండుటకును క్రొత్తమార్గ మవలంబించతలచితిని. కాబట్టి సత్యాగ్రహము అందున ముఖ్యముగ శాసనతిరస్కార మనుసాధనమును దేశమునకు చూపుచున్నాను. అది పరిశుద్ధమైనట్టియు యాధ్యాత్మికమైనట్టియు మార్గము కావున ఏప్రిల్ 6-వ తేదినాడు హరితాళము లేర్పరచి భజనోపవాసనత్కాలక్షేపముల నిర్ణయించితిని. భరతఖండమునంతటను యీవ్రతము విశేష ప్రచారము చేయకనే యల్లుకొనెను. ఎచ్చటను యల్లరులు జరగలేదు. ఈయభిప్రాయమును వెల్లడిపరచుటకై 24 దిని చెన్నపట్టమునుండి యీక్రిందిసందేశమును నేను పంపుటకన్న మరేదియు చేయలేదు.

"సత్యాగ్రహము మతసంబంధమైన వ్రతమని భావించవలెను. ఇది ప్రాయశ్చిత్తమునకును ఆత్మపారిశుద్ధమునకును ప్రచారమునకుఁ దేబడినది. ఆత్మనిగ్రహమువల్లనే కష్టముల పోగొట్టుకొనుటకును, సంస్కరణముల పడయుటకును యవకాశము కలుగును. అందుచేతనే, రాజప్రతినిధి యీచట్టమునకు సమ్మతి నిచ్చినతర్వాత నాదివారమునా డుపవాసదినముగాఁ గడపవలెను. నాడు సంకీర్తనములతో కాలముఁ బుచ్చవలెను. ఈవిషయమునఁ బ్రజాభిప్రాయము బహిరంగముగ వెల్లడి కావలెను కావున నీక్రిందియంశముల సూచించుచున్నాను. 1. అందరును 24 ఘంటలసేపు నాహారమునుఁ బుచ్చుకొనరాదు. రోగులు బాలురు దీని నాచరించవలసినవిధిలేదు. దీనివల్ల సర్కారు అధికారుల మనస్సుల నొప్పించుచున్నామని తలచరాదు. శాసనతిరస్కారమున కనర్హుడగుటకు ప్రతివాడును దీని నారోజు చేయవలెను. 2. అందరు నారోజు వారిసామాన్యవృత్తుల మానవలెను. బజారు లన్నిటిని మూయవలెను. ఆదివారము సెలవుదొరకనియెడల ముందుగ వ్రాసి సెలవు పుచ్చుకోవలెను. రాజకీయోద్యోగులు సహితము నీపనుల చేయవలెనని నేను చెప్పుచున్నాను. 3. దేశమంతటను

అనగా పల్లెటూళ్ళయందునహితము బహిరంగసభలు గావించి యీచట్టమును రద్దుచేయుమని తీర్మానముల కావించవలెను. ఈనాసలహా అందరు ఒప్పుకొను నెడల వారు సత్యాగ్రహసంఘములతో కలసి యీకార్యక్రమము జయప్రదమగునట్లు చేయవలెను..........."

శ్రీ గాంధిగారు పదేశించిన యీసత్యాగ్రహవ్రతము నవలంబించుట అంతసులభమైన పనికాదని మాయభిప్రాయము. ఇది లోకానుభవమునకు కొంత విరుద్ధమని తోచుచున్నది. ఏదియెటున్నను యీసిద్ధాంతము ప్రజలకు కొంతమేలు కావించినమాట యొప్పుకొనకతప్పదు. ఈ విషయము ప్రజలకు తెలియకున్నచో పంజాబున నెన్నియో దుండగములు జరిగియుండునని మానిశ్చయాభిప్రాయమై యున్నది. సత్యాగ్రహమువల్లనే యితరరాష్ట్రములందు అల్లరులు జరగలేదని మాయభిప్రాయము. పంజాబునందుమాత్రము సత్యాగ్రహబలముకన్న నధికారుల నిరంకుశపశుబల మెక్కువగా నుపయోగింపబడెను. ఓడ్వ్వయరు సత్యాగ్రహవ్రతమువల్ల కలిగిన మేలును కనిపెట్టి ప్రజలతో నేకీభవించి యున్నయెడల పంజాబుచరిత్ర మఱొక్కతీరున యుండియుండెడిది. సత్యాగ్రహవ్రతమును జక్కగా నవలంబించినయెడల పశుబలపూరితమగు ప్రభుత్వము జరగనేరదు. జనుల కయిష్టమైన శాసనముల నములున పెట్టుట కసాధ్యము కాకపోయినను అట్లుచేయుట మిక్కిలి కష్టమైనపని. పాలితులసమ్మతిప్రకారము శాసనముల జేయవలసిన రాజ్యములలో సత్యాగ్రహ మెన్నటికిని నేరము కానేరదు. ఇక పంజాబు అల్లరికి సత్యాగ్రహ మెంతమట్టుకు కారణమో సూచించెదము. సత్యాగ్రహవ్రతావలంబకులు యితరులను యేమాత్రము హింసింపరని యిదివరకే చెప్పినాము. శాసనోల్లంఘనవిషయమునమాత్రము అల్లరులు జరుగునని చెప్పుటకు కొంతయవకాశము కలదు. అందువల్లనే శాసనోల్లంఘనము చేయువారు మిక్కిలి మెలకువగా వర్తించవలెను. శాసనతిరస్కరణ కావింపమని చెప్పుట సులభమైన పనిగాని దానివల్ల సంభవించుకష్టములకు పాత్రులు కామని చెప్పుట యంతసులభముగాదు. అందుచేతనే గాంధి యీయుద్యమమును ఆపవ

లసివచ్చెను. ఇట్లాపుట మంచిదని మాయభిప్రాయము. పంజాబునందు శాసనోల్లంఘనము కావింపబడలేదు. హరితాళము శాసనతిరస్కారము కాదు. ఏలాటినిర్బంధములేక నీయుద్యమము జరిగియున్నయెడల సత్యాగ్రహవ్రతములో ఒకభాగమై యుండును. మఱియు మనదేశమున యుగములనుండి జరుగుచుండిన యొకయలవాటై యిదియున్నది. పంజాబులోని యల్లరులకు సత్యాగ్రహముకాని హరతాళముగాని కారణములుకావు. ఇక కారణము లెవ్వియో ముందు సూచించెదము.

అయిదవ ప్రకరణము.

పంజాబుసైనికప్రభుత్వము (మార్షల్ లా). 1-వ భాగము.

ముందుప్రకరణములో ఓడ్వ్వయర్ ప్రభుత్వ మిట్టిదని వర్ణించినాము:—రౌలట్టుచట్టములను గూర్చియు, సత్యాగ్రహప్రచారమును గూర్చియు ఏప్రిలు ౬ ది హరతాళమునుగూర్చియు విస్తరించియున్నాము. పంజాబీయులు అధికారులపై గౌరవమే లేకయుండిరి. యుద్ధానంతరమున కష్టములన్నియు నమసిపోవు ననుయాశతో యున్న ప్రజలకోరికలు విఫలమాయెను. ఖిలాఫత్తువిషయమున మహమ్మదీయులకు విశేషయతృప్తి పుట్టినది. ఏప్రిలుమాసమున జరిగినయంశముల దెలిసికొనుటకై యీక్రింది సంగతులను జ్ఞప్తియం దుంచుకోవలెను. ఏప్రిలు ౬ దిని పంజాబంతటను హరతాళము శాంతముగ జరిగియుండెను. ఆరోజున హిందువులును మహమ్మదీయులును ప్రజలును నాయకులును ఒకయభిప్రాయము గలవారై యుండిరి. ప్రతిచోటను రౌలట్టుచట్టమును రద్దుచేయుమని తీర్మానములు కావింపఁబడెను. ఈయాందోళనము అందునను ముఖ్యముగ హిందుమహమ్మదీయులమైత్రి బ్రిటిష్‌పరిపాలనము అంతరించుటకు మార్గమని ఓడ్వ్వయర్ పొరబాటుగ భావించెను. లాహూరునందు నాయకులు శాంతియుక్తముగ నడిపిన ఆందోళనమును రాజవిద్రోహమని తలచిరి. నాయకులపై తేబడిన యభియోగములయందు వీరిచర్య నీతీరున వర్ణించిరి.

"....రౌలట్ బిల్లులు సామ్రాజ్యశాసనసభయందు మార్చి 18 దిని శాసనములు కావింపబడెను. అటుమీద పంజాబు వెలుపల కొందరితో వీరుచేరి దేశమున విప్లవము కలిగించుటకును రాజద్వేషము కల్పించుటకును, సార్వజనీకవ్యాపారస్తంభనమును ప్రకటించుటకును తీవ్రమైన సభల గావింప ప్రారంభించిరి. ఈదురాలోచనసంఘముల వృద్ధిపరచుటకై దేశమంతటను మార్చి 30 దిని యేకహారతాళమును వెల్లడిజేసి ప్రభుత్వమును స్తంభింప ప్రయత్నము చేసిరి. ... ."తర్వాత మరికొన్ని సభల వర్ణించి వానినన్నిటిని యల్లరిసమూహములుగా భావించిరి. "...ఏప్రిలు 9 దిని, అధికారులయెడ ద్వేషభావము పుట్టించుటకుగాను శ్రీరామనవమియుత్సవసమయమున శ్రీరాంభోజ్‌దత్తు, లాలాదునీచందు, ధర్మదాససూరి, గోకులచందు మొదలైనవారు సర్కారునకు విరుద్ధముగ హిందూమహమ్మదీయమైత్రిని ప్రోత్సాహపరచిరి. ఏప్రిలు 10 దిని శాంతిభంగము కాకుండుటకై ఈకుట్రలో చేరినవాడగు శ్రీగాంధిని పంజాబులోనికి రాకూడదనియు కిచ్‌లూ, సత్యపాల్‌గార్లను పంజాబును వదిలి వెళ్లవలెననియు యాజ్ఞాపించిరి. ఈయాజ్ఞరుమిషతో ఈకుట్రలోని వారు మనరాజుపై దాడికి వెడలిరి." దీనిబట్టిచూడ నధికారులు హారతాళమును హిందుమహమ్మదీయసమ్మేళనమును రాజద్రోహముగా దలచినట్లు స్పష్టమగుచున్నది. ఓడ్వయర్ సహితము యిట్లే తలచినట్లు జలందరులో బారిష్టరైన భగవత్‌రాంగారి సాక్ష్యములోని యీక్రిందిమాటలవల్ల తెలియకలదు. "...పంజాబుశాసనసభముగిసినపిదప ఓడ్వయరునుచూచి నాను. జలందరుహారతాళమునుగూర్చి యతను నన్నడిగెను. సంపూర్ణమైన హారతాళమనియు శాంతి కేలాటిభంగము కలుగలేదనియు నేను అతనితో చెప్పితిని. ఇందుకు కారణము అతను కోరగా, గాంధిగారి యాత్మశక్తియే దీనికి ముఖ్యకారణమని చెప్పితిని. అందుమీద తనపిడికిలిచూపుచు గంధిగారియాత్మశక్తికన్న బలిష్ఠమైనశక్తి మరొకటున్నదని చెప్పెను." ఈవిధముగ రాజకీయపరిజ్ఞానమును పూర్తిగ ప్రజలలో లేకుండజేయుటకు అతను నిశ్చయించెను. ప్రజలకు పిచ్చియెత్తుటకు ఏపని

నైనను చేయ సాహసించెను. ఈపని యెంతవఱకు నెరవేర్పగలిగెనో ఇక చూతము.

సైనికప్రభుత్వము (మార్షల్ లా). 2-వ భాగము.

1. అమృతసరము.

మొట్టమొదట అమృతసరపరిస్థితుల నాలోచింతము. పంజాబున లాహోరునకు వెనుక నిదియే గొప్పపట్టణము. దీనిజనసంఖ్య 1 లక్ష 60 వేలు. మఱియు నిందు సిక్కుల పవిత్రమైన దేవాలయ ముండుటంబట్టియు పంజాబునంతటికి వర్తకకేంద్రస్థల మగుటనుబట్టియు యీపట్టణమునకు జనులు విస్తారముగ వచ్చుచుందురు.

ఏప్రిల్‌మధ్యలో హిందువుల క్రొత్తసంవత్సర ప్రారంభ మగుటచే నప్పు డిచ్చట యెక్కువపశువులసంత యుండును. ఇందుకుగాను ప్రజలు విశేషముగ వత్తురు. పంజాబున క్రొత్తసంవత్సరము వైశాఖమున ప్రారంభమగును. క్రొత్తసంవత్సరమునకు ముందే రామనవమియుత్సవము జరుగును. అమృతసరమున హిందువులు, మహమ్మదీయులు, సిక్కులుఅందరు కలసి పూర్తి హారతాళమును ఏప్రిల్6 దిని జరపిరి. ఈ సందర్భమున ఏలాటియల్లరి జరగలేదు. ఏప్రిల్ 9 ది నాటిరాత్రి రామనవమి సాధారణముగ హిందువుల యుత్సవమైనను యీమారు మహమ్మదీయులు హిందువులతో కలసి వారిమైత్రిని వెల్లడించిరి. ఈసంయోగమునకు కిచ్‌లూ, సత్యపాలు అనునాయకులు కారణభూతులు. కిచ్‌లూగారు యింగ్లాండున బారిష్టరుపరీక్ష యిచ్చివచ్చి న్యాయవాదిగా నుండి విశేషద్రవ్య మార్జించుచుండెను. ఇతనికి వయస్సు 35 చాలాకాలముగ నితను హిందూమహమ్మదీయసఖ్యతకు పాటుపడుచుండెను. సత్యపాలుగారు డాక్టర్‌పరీక్ష నిచ్చినవాడు. యుద్ధసమయమున సైన్యమున డాక్టరుహోదా వహించియుండెను. వీరిరువురు యీపట్టణమందు రౌలట్ చట్టపు నాందోళనము సలిపినవారలలో ముఖ్యులు. అందుచే వీరు ప్రజానురాగమునకు పాత్రులై యుండిరి. సత్యపాలుగారు సభలలో నుపన్యాసములుకావించకూడదనియు, పట్టణసరిహద్దులదాటకూడదనియు మార్చి 29 ది

(హరతాళమునకు ముందురోజున) యాజ్ఞాపింపబడెను. తే30ది మహాసభకు షుమారు 35 వేల ప్రజలు వచ్చియుండిరి. ఈమహాసభయం దుపన్యసించిన వారందరు శాంతినిగూర్చియే యుపన్యసించిరి. కిచ్‌లూగా రిట్లు మాట్లాడిరి. "మనము ఎప్పటికైనను జాతీయాంశములకొఱకు స్వార్థమునుత్యజించవలెను. గాంధిగారిసందేశమును మీరు విన్నారు. దేశీయులందరును నిరోధమునకు సంసిద్ధులు కావలెను. ఇట్లనుటచే నీపవిత్రమైన పట్టణమున రక్తప్రవాహము కావలెనని నాయభిప్రాయము కాదు. మననిరోధము సాత్వికపద్ధతిలో యడే జరగవలెను. మీరు కారాగారములు చేరవలసి వచ్చినను అధికారుల యాగ్రహమునకు పాత్రులైనను మీమనోనిశ్చయము వదలవద్దు. ఎట్టిసమయ మందైనను శాంతిని వదలవద్దు. పోలీసు వాడగుపడినపుడుగాని మనము దేశద్రోహులని భావించువారిని గలసినను మనము మాటలచే నహితము వారిమనస్సుల నొప్పించకూడదు." ఈసభ యింత జయప్రదముగ జరిగినందుకు ఓడ్వాయర్ సహింపలేక, ఏప్రిల్ తే 3 దీని కిచ్‌లూగారికి యీక్రిందియుత్తరవు నిచ్చెను.—

1. అమృతసరపట్టణ సరిహద్దుల దాటకూడదు. 2. పత్రికలకేమియు వ్రాయకూడదు. ౩. సభలు చేర్చకూడదు. ఇతరులు సభలు చేర్చినచో వీరు పోయి మాట్లాడకూడదు.

ఇట్టియుత్తరువులను పండితకోట్‌మాల్, దీనానాథ్, అనుభవానందగార్లకు కూడా యిచ్చిరి. ప్రజలు యిందుమీద నేలాటియల్లరులు కావించలేదు. ఏప్రిలు 6 దిని మరల పూర్తిహరతాళము జరిగెను. రౌలట్‌చట్టమును రద్దుచేయమని తీర్మానము కావింపబడెను. సభాధ్యక్షుడు యీక్రిందిమాటలతో సభను ముగించెను. "కడచిన యాదివారమునాటికన్న యిది జయప్రదముగ జరిగినది. ప్రజల యభిప్రాయమును సంకోచములేక వెల్లడించినారము. ప్రజలందరు ఓర్పువహించవలెను. ఓర్పుతో దుఃఖ మనుభవించినయెడల నసత్య మడుగంటి సత్యము జయించునని శ్రీ గాంధిగారు చెప్పియున్నారు. శాంతికి యెంతమాత్రము భంగము జరిగినయెడల మనసభ యుపయోగము పైకిరాదు కావున మీరందరు నెమ్మ

దిగా ఏసంబరములేక వారివారియిండ్లకు వెళ్లవలెను." అటులనే ప్రజలు నెమ్మదిగ వారివారిచోట్లకు చేరిరి. ఏప్రెలు 9 దిని శ్రీరామనవమి కావున నాడు మహమ్మదీయులు హిందువులు కలసి యొకగొప్పయుత్సవము గావించిరి. కిచ్‌లూ, సత్యపాలుగార్లగృహముల దాటి వెళ్లునపుడు వారి కభివందనపూర్వకముగ ప్రజలు కేకలువేసిరి. అమృతసరము డిప్టికమీషనరు యింటిదగ్గర రాజభక్తి కనబరచు కీర్తనలపాడిరి. ఈయుత్సవమున నేలాటియల్లరి జరగలేదు. ప్రజలలోని యింతటియుత్సాహమును మెచ్చుకొనుటకు మారుగా ఓడ్వాయర్ కోపోద్దీపితుడాయెను. తనయుత్తరవులపై ప్రజలు అణగక మఱింత విజృంభించినందుకు అతడు మఱింతకోపము చెంది ఈయుత్సవసమయముననే కిచ్‌లూ, సత్యపాలుగార్లను దేశభ్రష్టులుగ చేయుటకు యుత్తరవులు చేసెను. ఈసంగతి యారోజు రాత్రి ప్రజలకు తెలిసెను. మరునా డుదయము డిప్యూటికమీషనరు తనవద్దకు వీరిని బిలిపించి యుత్తరువులచూపి వారి నెచ్చటికో పంపివేసెను. ఈవార్త ప్రజలందరికి వెంటనే తెలిసినమీదట విషాదపడి యామీదప్రజలు పోగై డిప్యూటికమీషనరుగారింటికివెళ్లి నాయకుల వదలమని కోరుట కుద్దేశించిరి. వీరు వెళ్లుట కుద్యమించగానే యనేకులు వీరి నచ్చటచ్చట కలుసుకొనినందున వీరిసంఖ్య విశేషమైనది. ఈగొప్పజనసమూహము రైలువారధిదగ్గఱకు వెళ్ళగానే సిపాయిలు వీరి నడ్డగించిరి. తాము డిప్యూటికమీషనర్వద్దకు నొకప్రార్థన చేయుటకు వెళ్లుచున్నామని చెప్పుచు వారిని నెట్టుకొని వెళ్లుటకు బ్రయత్నించిరి. అంతపై వీరిలో కొందరిని సిపాయిలు కాల్చిరి. ప్రజలలో గాయము తగిలిన కొందరిని తీసికొని యూరిలోపలికి పోగానే యందరికిని పట్టరానికోపమువచ్చి వెఱ్ఱెత్తినట్లు చేతికి దొరకినకఱ్ఱలు మొదలగు పరికరములతో మఱల బయలుదేరిరి. వంతెనలను సిపాయిలు కాపాడుచుండిరి. ఈసంగతి యూరిలోనివకీళ్లకు తెలిసి తాము సహాయము చేసెదమని పోలీసు అధికారితోచెప్పి వారిసెలవుతో ప్రజలు వెళ్లినదిక్కునకు వెళ్లిరి. వారియుపదేశమువలన గుంపున కొందరు యిండ్లకు వెళ్లిరి. మొదట కాల్చబడిన వంతెనవద్దమాత్రము గుంపు విశే

షముగా నుండెను. ప్రజానాయకులు యధికారుల కాల్పవలదనియు ప్రజల వెళ్లమనియు బోధించుచుండిరి. ఇంతలో ప్రజలలో కొందరు సిపాయీలపై రాళ్లను రువ్విరి. అందుమీద సిపాయిలు మరల కాల్చిరి. 20 మంది యచ్చటనే చచ్చిరి. అనేకులకు గాయములు తగిలెను. ప్రజలను మందలించుచుండిన సలేరియా మహమ్మద్ మకబ్బూల్ గార్లకు దెబ్బతగులుట తప్పెను. మక్బూల్గారు ఆసుపత్రికి వెళ్లి దెబ్బతగిలినవారిని తీసికొని వచ్చుటకుఁ బ్రయత్నించిరి. ఆసుపత్రిలోనివారు వచ్చినప్పటికి ప్రజలే యిందుకు యేర్పాట్లు చేసికొందురని చెప్పి వారిని పంపివేసెను. ఆసుపత్రిలోని ఈస్డన్ దొరసాని గాయములు తగిలినవారిని చూచి నవ్వి హిందు మహమ్మదీయు లుభయులకు తగినశాంతి జరిగిన దనెను. గుంపులోనికొందరు ఆమెను పట్టుకొనుటకు యాసుపత్రిలోనికి ప్రవేశించిరి కాని యామె కనబడలేదు. ప్రజలంత కోపావేశులై యాంగ్లేయు లెవరు కనబడినను మర్దించెదమని తలచి న్యాషనల్ బాంకును కొల్లగొట్టిరి. దీనియధికారులగు యిద్దరు దొరలనుఁ జంపిరి. రైలుస్టేషన్‌వైపు వెళ్లిన గుంపులోనివారు రైలుగార్డును చంపిరి. అటుమీద అలయన్సుబాంకులోనికి వెళ్లి తాంసన్ అనువాని చంపి బాంకిలోని సామానులతో వానిని దహించిరి. తర్వాత రోలండును చంపి టవున్‌హాలు, పోస్టాఫీసు, మిషన్‌హాలు, రైలుస్టేషనులో కొంతభాగముఁ దగలపెట్టిరి. చార్టర్డ్ బ్యాంకిని కొల్లగొట్ట ప్రయత్నించిరిగాని అచ్చటి మననౌకర్లు ప్రజలకు హితముజెప్పిపంపివేసిరి. షర్వుడ్ అనునామె బైసికల్‌మీద వెళ్లుచుండగా కొట్టిచంపుటకు ప్రయత్నింపగా యామెశిష్యునితండ్రి యామెను రక్షించెను. ఈగుంపులో యనేకదుర్మార్గులు చేరియున్నందున యిట్టిదురంతములు జరిగినవి. ఈ బ్యాంకులో పోయిన సొత్తులలో కొన్ని పోలీసువారివద్దనే మరల దొరికినవి. ఈ దురంతములన్నియు నాడు 5 గంటలకు సమాప్తిజెందెను.

ప్రజానాయకుల దేశభ్రష్టులఁజేసి ప్రజల నుద్రేకించిరి. ఇందుకుతోడు అప్పటిదనుక మిక్కిలి శాంతముగనుండిన ప్రజాసమూహముపై రైలువంతెనవద్ద తుపాకుల కాల్చిరి. సిపాయీలు గుంపు నడ్డపెట్టక డిప్యూ

టీకమీషనర్ యింటితట్టు పోనిచ్చినచో ఏమిజరిగియుండునో చెప్పుటకు వీలు కనబడదు. కాని, ప్రజలు విశేషము పోగై యుండుటచేతను వారు దృఢనిశ్చయులైనందుచేతను సిపాయీలు యడ్డగించుటచే వారిపై తప్పేమియు లేదు. కాని, హంటర్‌విచారణసంఘము సాక్ష్యమును బట్టిచూచినను మావద్ద నిచ్చిన సాక్ష్యమును చూచినను కాల్చుటకు ఏలాటి యవసర ముండియుండలేదు. అధికారులు కాల్చుటకు ముందు చేయవలసిన పనులు చేయలేదు. కాల్చుటకన్న మరేయుపాయమును వెదుకలేదు. ఇదివరలో చెప్పిన మహమ్మద్ మకబ్బూలుగారు రెండవమారు కాల్చినసంగతి నిగూర్చి యిట్లు సాక్ష్యమిచ్చెను. "నేను,సలేరియా డిప్యూటికమీషనర్‌ను కాల్చవద్దని ప్రార్థించుచుంటిమి కాని ఒకటి రెండు రాళ్లు ప్రజలు రువ్వగనే సిపాయిలు కాల్చుటకు ప్రారంభించిరి. గుండ్లు నాకిరువైపుల వెళ్లుచుండెను. ప్రజలు నలుదిక్కుల పరుగెత్తిరి. నేను సిపాయివద్దకు వెళ్ళి గాయములు తగిలినవారికి సహాయముచేయుటకు పరికరము లున్నవా యని యడిగితిని. దగ్గరయున్నట్టి ఆసుపత్రికి పిదప వెళ్లుటకు ప్రయత్నించితినిగాని సిపాయిలు నన్ను వదలలేదు. పిదప కొంతసేపటికి నన్ను వదలిరి. అధికారులు కొంతసహనము చూపియుండినయెడల కాల్చుట కవసరమే లేకయుండెడిది. కాల్చుటకు మొదలిడగానే గుంపు నాల్గుదిక్కుల పరుగెత్తుచుండినను కాల్చుట మానలేదు. అందుచేతనే ప్రజలవీపులపై గుండ్లదెబ్బలు తగిలెను. గాయములు తగిలినవారిని కాపాడుటకు పరికరములేక కాల్చుట కేవలము అమానుషకృత్యము.... ...." నాయకులను దేశభ్రష్టులుగా చేయుట యన్యాయమైనను ప్రజలు కావించినకృత్యములు గర్హనీయము లనియే చెప్పవలెను. కారణ మేదియులేక యాంగ్లేయు లనేకులఁ జంపిరి. కట్టడములను కూల్చుట పిచ్చిపని. ఇవన్నియు ఘోరకృత్యములని భావించెదము. ఇట్టికృత్యముల జరుపనీయక పోలీసువా రాపగలరా? టవున్‌హాలు ప్రక్కననే పోలీసుస్టేషనుండెను. కాల్చబడ్డ భవనములు దీనివెంబడి యుండెను. పోలీసువారు విశేషముగ స్టేషన్‌వద్దయున్న తమప్రాణముపోయినను వీరు వెళ్లి ప్రజల నాపుట వారివిధియైనను వారేమియు చేసినారు కారు.

అధికారుల కేమితోచినది కాదు. లాహోరునుండి మోటారున కిచ్నర్ సాయంతనము 4 ఘంటలకు వచ్చిరి. రాత్రి 11 ఘంటలకు స్పెషల్ బండిలో మెక్డొనల్డ్ గారితో నొకపటాళము వచ్చెను. ఈపటాళము రాగానే దాని నూరిలోనికి బంపెను. సివిల్ మాజిస్ట్రేటును ఎందుకు పిలిపించలేదని హంటర్ ప్రశ్నింపగా సైనిక ప్రవర్తనమగుటచే అవసరము లేదనెను. తే 11 దిని మరల కిచన్ లాహూరు చేరెను. అమృతసరము సైనికోద్యోగియగు ఇర్వింగ్ యాజమాన్యము క్రింద నుంచెను. ఈసంగతి ఓడ్వయరుకు తెలుపగా నామోదించెను. అల్లర్లు పూర్ణముగ నాగిపోయినను అంతతో దృప్తిజెందక అధికారులు డయర్ అనుసేనానిని పంపి పట్టణమంతయు అతనియాధిపత్యము క్రింద సైనిక ప్రభుత్వము నెలకొల్పిరి. డయరు రాగానే యూరిలో ప్రవేశించి 10, 12 మందిని పట్టుకొనెను.

ప్రజలు యేమిచేయుచుండిరో చూతము. 10 ది రాత్రి ఏలాంటియల్లరి జరగలేదు. 11 ది యుదయమున చనిపోయినవారిని స్మశానమునకు తీసికొనివెళ్లుట కుద్యుక్తులైరి. సైనికోద్యోగులు వుత్సవములు జరగకూడదనియు ఒక్కొకశవముతో నలుగురికన్న హెచ్చుమంది వెళ్లకూడదనియు శాసించిరి. ప్రజలు అందరికిని కలసి గొప్పయూరేగింపు చేయవలెనని పట్టుపట్టినందున అందు కొప్పుకొని 2 ఘంటలలో అన్నిపనులు ముగించుకొని యిండ్లు చేరవలెనని చెప్పిరి. ప్రజలట్లేచేసిరి. 12 దిని *హంసరాజ్ అనునతడు ఒకసభచేసెను. మరల 13 దీని సభజరుగుననియు యాసభకు కన్యాలాల్ యధ్యక్షుడనియుః బ్రకటించెను. కన్యాలాలున కీసంగతే తెలియదని మాయెదుట సాక్ష్యమిచ్చెను. ఇతను గొప్పవాడగుటచేతను వృద్ధుడగుటచేతను వీరిమాటను నమ్మి ప్రజలు పోగగుటకు యితనిపేరు హంసరాజ్ చెప్పెనని మాయభిప్రాయము. అప్పు డమృతసర మెట్లున్నది తెలియుటకుగాను గిర్ధర్‌లాల్ సాక్ష్యమును క్రింద కొంత కనబరచెదము. "...కాన్పూరునుండి కలకత్తామైలులో 12 ఘంటలకు అమృతసరము చేరినాను. రైల్‌స్టేషన్ వదలక ముందే పట్టణమంతయు సైన్యముతో నిండి

* ఇతను పిమ్మట సర్కారుతో చేరి వారితరఫున సాక్ష్యమిచ్చెను.

యున్న సంగతిచూచితిని. కూలీలు కనబడలేదు. విక్రమసింగ్ నాకగపడి వెనుకకు వెళ్లమని చెప్పెను. ఎంతో కష్టముతో యూరిలోనికి వెళ్లితిని. త్రోవలో వంతెనవద్ద సిపాయీలు నాసామానుల శోధించి పైకి పంపిరి. ఊరిలో ప్రవేశించగనే ఎచ్చటను నీళ్లు లేకయుండుటయు ఎలెక్ట్రిక్ దీపములు లేకయుండుటయు నాకగపడెను. పోలీసువారెచ్చట నగుపడలేదు. ఎటుచూచిన సైనికభటులే యుండిరి......."ఏప్రిల్ 13 తేది యుదయము డయరుసేనాని ఈప్రకటన కావించెను. "ఊరిలో నెచ్చటగాని 4 గురికన్న అధికముగ చేరకూడదు. అట్లుచేరినయెడల సైనికభటులు వలసినచో వారిని వెళ్లగొట్టుదురు" ఈప్రకటన డయరు ముందువెళ్లుచుండగా వెనుక నొకపంజాబి ఉర్దూభాషలో అరచుచుండెను. రెండుమూడుగంటలసేపు యూరంతయు నీతీరున తిరిగినానని డయరు చెప్పెను. ఇతను పోయినత్రోవలు మేము జాగ్రతగా చూచినాము. ఊరిలోని సగముభాగమునకన్న నెక్కుడుప్రదేశమునకుగాని ప్రజలు విస్తారముండుచోట్లకుగాని యితను వెళ్లలేదు. ప్రజలనేకులకు ఈసంగతి తెలియదు. మఱియు నారోజు సంవత్సరాది యగుటచే సంతకై చుట్టుప్రక్కలనుండి యనేకులు వచ్చియుండిరి. వారికీప్రకటన తెలియుట కవకాశములేదు.

ఈప్రకటన జరుగుచున్నప్పుడు అమృతసరము మరికొన్నివీధులందు ఒకబాలుడు డోలువాయించుచు సాయంత్రము 4 ఘంటలకు జలియన్‌వాలాబాగున నొకసభకూడుననియు నాసభకు కన్యాలాల్ అధ్యక్షులనియు చాటించుచుండెను. మావద్ద యిచ్చిన సాక్ష్యమునుపట్టిచూడ యీప్రకటన డయర్ ప్రకటనకు పూర్వమే యైనట్లు తేలుచున్నది. ఈవిషయమును గూర్చి కన్యాలాల్ యిట్లు చెప్పిరి:—"జలియన్‌వాలాబాగున నే నుపన్యసించెదనని నాకు తెలియకనే యెవరో ప్రకటించిరి. నేను ప్రజలకు సద్బోధ చేయదలచినానని వారూహించిరి." పగలు 12½ గంటలకు జలియన్‌వాలాబాగున సాయంత్రము 4½ ఘంటలకు సభ జరుగునని డయరుకు తెలిసెను. ముందు తెలిసియు సభ కూడకుండుటకు తగిన ప్రయత్నమేల చేయలేదని హంటరు విచారణలో ప్రశ్నింపగా సైన్యమును సిద్ధము చేయవలసి

యుండెననియు సభ కూడదని యదివరకే చాటించినాననియు అందువల్ల ప్రజలు సభకు రారని నమ్మినాననియు బదులు చెప్పెను. 4 గంటలకు సభ కూడినసంగతి డయరుకు తెలిసెను. తత్క్షణమే యతను గూర్ఖా, సిక్కు సైనికులతోను రెండుపిరంగీలతోను నెమ్మదిగా జలియన్‌వాలాబాగునకు వెళ్ళెను. తొందరగా నేలవెళ్ళలేదని హంట రడిగినందుకు యెండకాయు చున్నందున నెమ్మదిగా వెళ్లినానని చెప్పెను. 5 గంటలకు యితను సైన్యముతో సభయొద్దకు వచ్చెను.

జలియన్‌వాలాబాగుయొక్క పెద్దకాళీస్థలము. దీనిచుట్టు యిండ్లుండెను. ఈకాళీస్థలమున 3 చెట్లు, ఒకసమాధి, ఒకబావి యుండెను. దీని లోపలికి త్రోవ ఒకవైపుననే యుండెను. అదృష్టవశమున నీత్రోవలో పిరంగీలను తీసికొని వెళ్లుటకు వీలులేకయుండెను. మరి రెండుమూడువైపులలో ఒక్కమనిషి రాను పోను త్రోవయుండెను. గనుక డయరు యీ తోటలోనికి ప్రవేశించినపుడు ప్రజలు బైటికివెళ్లుటకు మార్గమే లేకపోయెను. డయరు లోపలికి ప్రవేశించునప్పుడు ఒకయెత్తుప్రదేశమున హంస రాజుగారు నిలువబడి భయపడవలదని ప్రజల హెచ్చరించెను. ఈసభ్యుల నెత్తిన యొకయాకాశవిమానము తిరుగుచుండెను. డయరుగారు రాగానే 15 గురిని కుడిప్రక్కకు 25 గురిని ఎడమప్రక్కకు పంపెను. అటుమీద జరిగిన విషయమును అతనిమాటలతోనే వివరించెదము. ఈమాటలు హంటరుసంఘము విచారణలో అతనిచ్చిన వాఙ్మూలమున నున్నవి.

ప్రశ్న:—తోటలోనికి ప్రవేశించగనే నీవేమిచేసితివి?

డయరు ఉత్తరం:—కాల్చుటకు ప్రారంభించితిని.

ప్ర:—తత్క్షణమే ప్రారంభించితివా?

ఉ:—తత్క్షణమేను: 30 సెకండ్ల కాలమైనను ఆలోచించలేదు.

ప్ర:—సభలోని ప్రజ లేమి చేయుచుండిరి?

ఉ.—వారు సభకావించుచుండిరి. నే నున్నచోటికి 50, 60 గజములదూరములో ఎవరో మధ్యనిలుచుకొని యుపన్యాసము చేయుచున్నట్లుండెను.

ప్ర:—నీప్రకటన యందరు వినుటకు వీలులేనట్లు నీవే యొప్పుకొంటివి కదా. గనుక సభ్యులను వెళ్లమని చెప్పుటకు ముందే ఏలకాల్చినావు?

ఉ:—నాయాజ్ఞలను మీఱి నడిచిరని మాత్రమే నేను తలచినానుకావున కాల్చుటయే మేలని తలచితిని.

ప్ర:—నీవు కాల్చుటకు ముందు వారేమైనా చేసినారా?

ఉ:—వారేమియు చేయలేదు. కొందరుమాత్రము పరుగెత్తిరి.

ప్ర:—సైనిక ప్రభుత్వ మప్పటికి ప్రారంభించలేదు కావున డిప్యూటీకమీషనరుతో నాలోచించవలెనని నీకు తోచలేదా?

ఉ:—ఎవరితోను యాలోచించవలసినట్లు నాకు తోచలేదు. సైన్యసంబంధమైన విషయముకావున వెంటనే కాల్చనిచో నేను సైనిక ధర్మము నెరవేర్చనివాడ నగుదునని తలచితిని.

ప్ర:—నీవు కాల్చినది సభను ఆపుటకా?

ఉ:—కాదు. వారందరు వెళ్ళిపోవువఱకు కాల్చితిని.

ప్ర:—కాల్చుటకు మొదలిడగనే ప్రజలు పరుగెత్తిరా?

ఉ:—తత్క్షణమే పరుగిడ మొదలుపెట్టిరి.

ప్ర:—వారు పరుగెత్తుటకు ప్రారంభించినమీదకూడా కాల్చితివా?

ఉ:—అవును కాల్చితిని.

ప్ర:—గుంపులోనివారు పరుగెత్తుచున్నను నీవేల యాపకయుంటివి?

ఉ:—వారందరచ్చటనుండి పైకి వెళ్లిపోవువరకు కాల్చుటయే నాధర్మమని తలచితిని. కొంతకాల్చి వదలుటకన్న కాల్చకుండుటయే మేలు.

మఱికొన్నిప్రశ్నలకు గుంపును వెళ్లకొట్టుటలో తన కనుభవము లేదనియు కాల్చకనే గుంపును వెళ్లగొట్టఁగలిగియుందునేమో యనియు అయినను కాల్చనచెందుకన గుంపులోనివారుఁ దన్నుఁజూచి నవ్వుదురనియు నందుచే కాల్చినాననియు బదులు చెప్పెను. గుంపులోనివారు తమపై దూకుదురని తలచినట్లును, వీరికృత్యము పంజాబంతటను ప్రసరించియున్న

కుట్రలోనిభాగముగా తలచినట్లును మరియొక ప్రశ్నకు బదులు చెప్పెను. ఫిరంగిబండ్లను తోటలోపలికి తీసుకొనివెళ్లుట కవకాశమున్నచో వాని గుంపుమీద ప్రయోగించియుండునని చెప్పెను. గాయములు తగిలినవారి కేలసహాయము చేయలేదని యడుగగా అది తనపనికాదని చెప్పెను. అప్పుడప్పుడు గుంపు హెచ్చున్నచోట్లయందే యేలకాల్చితివి యన్నందుకు సభచేసినందుకు శిక్షించతలచి యట్లుచేసితి ననెను. ఇక కొన్ని వాఙ్మూలములను పరిశీలింతము. గిర్దర్‌లాల్ గారు తోటపైనున్న యింటినుండి చూచుచుండెను. అతనిట్లు చెప్పెను. "...నూర్లకొలది ప్రజలు చచ్చుటను కండ్లార నేను చూచితిని. తోటద్వారమువద్దనే విశేషముగా కాల్చిరి. కావున బైటికి వెళ్ళతలచినవా రనేకులు చచ్చిరి. వెనుకనుండినగుంపు నెట్టుటవల్ల ననేకులు కాళ్లక్రింద పడి చచ్చిరి. గుండ్లబారిని తప్పించుకొనుటకు నేలమీద పరుండినవారినికూడా కాల్చిరి......ఏతట్టు చూచినను రక్తప్రవాహమే......గాయములు తగిలినవారిచికిత్సకు యేర్పాటులు చేయలేదు. నేను పిదప నాచోటికివెళ్ళి దెబ్బలు తగిలినవారికి నావల్ల కాదగినసహాయమును చేసితిని. చచ్చినవారిలో పసిబిడ్డ లెందరో యుండిరి. దెబ్బలుతగిలినవారియొక్కయు చచ్చినవారియొక్కయు బంధువులునహితము రాత్రి 8 గంటలతర్వాత యిల్లువదలి యాచోటికి రాకూడదని ప్రకటింపబడెను. దెబ్బలు తగిలినవారిలో కొందరు శక్తితెచ్చుకొని లేచి కొంతదూరము పరుగిడి వీధులలో పడి చచ్చిరి. అమృతసరము వారి సంవత్సరాదిపండుగ యిట్లు జరిగినది." ఈరోజు యిచ్చట యెందరు చచ్చిరో తర్వాత నాల్గునెలలవరకు కనుక్కొనుటకు యధికారులు ప్రయత్నించలేదు. 290 మంది చచ్చిరని ఆగస్టున థాంసన్ చెప్పెను. తర్వాత కొన్నినాళ్లకు సేనాసమితివారు విచారించి 500 మందికన్నతక్కువ సంఖ్యవారు చావలేదని చెప్పినదాని యధికారులు ఒప్పుకొనిరి. నిజముగ నెందరు చచ్చిరో ఎవరును చెప్పలేరు. గిర్దర్‌లాల్ చెప్పినట్లు సుమారు 1000 మంది చచ్చిరని మేము నమ్ముచున్నాము. మావద్ద యిచ్చిన సాక్ష్యముప్రకారము డయరుతోటద్వారముల వెలుపలకూడా సైన్యమును పెట్టి బైటికి వచ్చువారినికూడ కాల్పించెనని తెలియుచున్నది. గనుక 20 వేలమందిలో 1000 మంది తప్పక చచ్చియుందురని నిశ్చయముగా చెప్పగలము. ఇంకను హెచ్చుమంది చావనందుకు కారణము డయరు తెచ్చిన తుపాకిమందు అయిపోవుటయే. రార్కీగారు చెప్పినట్లు ఈనాడుజరిగిన ఘోరకృత్యమును వర్ణించుట యసాధ్యమైనపని. హంటరుసంఘసాక్ష్యము, కూసాక్ష్యముఁ బూర్తిగఁ జదివినగాని విషయము తెలియదు.


తే10 దీని అల్లరులు జరిగినతర్వాత అధికారులు కుట్రలు సలిపి అమృతసరప్రజలను నేకారణముచేనైనను బాధించవలె ననెడిసంగతి ఈ క్రిందిసాక్ష్యమువల్ల తేలుచున్నది. లాలా ధోలందాస్ అధికారుల చూడపోగా సైమూర్ అనునతడు హతమైన ఒకయూరోపియన్ ప్రాణికి 1000 నల్లవారిప్రాణములు బలియివ్వవలెననెను. మహమ్మద్‌సద్దకుగారు అధికారుల జూడవెళ్లెను. వీరు యిట్లు చెప్పుచున్నారు"......అధికారులమాటలవల్ల నాకు తెలిసినదేమన చంపబడ్డ ఐరోపీయన్లకు బలియివ్వవలెను. అవసరమైన యెడల పట్టణమునే ముట్టడించెదమనిరి." డాక్టరు బాలముకుందుగారు తనతో కర్నల్‌స్మిత్ యీలాగు చెప్పెననెను. "డయరుసేనాని యీయూరికి వచ్చినయర్ధగంటలో యూరినంతయు నేలమట్టము చేయును; నాగతి యేమని నే నడిగినందుకు వూరు వదలివెళ్లుము లేదా ఆసుపత్రిలోనికి రమ్ము అనెను."

జలియన్‌వాలాలో జరిగినవధ గ్లెన్‌కోవధవంటి క్రూరమైనదని ఆండ్రూస్ చెప్పెను. కొందరుప్రజలు డయరుప్రకటన వినియు చక్కగ నర్థముచేసికోలేదని మాయభిప్రాయము. ప్రజలు సైనికోద్యోగి యట్టిఘోరకృత్యముల సల్పుట కేలాటియవసరము కలిగించలేదు. ఇది కావలెనని చేసిన యమానుషకృత్యము. భారతఖండమున నాంగ్లప్రభుత్వ మీపాపమునుండి విముక్తిజెందవలెనన్న తక్షణమే డయరును అధికారమునుండి తొలగించి తగినశిక్ష విధించవలెను.

ఓడ్వాయరు యీకృత్యములు సల్పుటకు తమసమ్మతిని తెలిపెనని డయరు హంటర్‌సంఘముయెదుట చెప్పియుండెను. ఇట్టి యమానుష

కృత్యములకు రాష్ట్రాధిపతి తనసమ్మతిని తెలుపుట మిక్కిలి శోచనీయము. సైనికప్రభుత్వమునసహితము కొన్నికట్టుబాట్లుండవలెను. ఈకట్టుబాట్ల నన్నిటిని డయరు మంటగలిపెను. ప్రజలు కావించినకృత్యముల మేము మంచివని చెప్పుటలేదు. అయినను, కొందరిదుండగములకుగాను నిరపరాధులగు వేలకొలది ప్రజలను జంపుట మిక్కిలి యన్యాయము. ఏప్రిల్ తే14 దీని చచ్చినవారినందరిని దహనముచేయుట కధికారులు యనుజ్ఞ యిచ్చినందున నేలాటియల్లరిలేక యిది జరగెను. ఊరంతయు నెమ్మదిగ యుండినట్లు డయరే చెప్పినాడు. సాయంతరము 2 ఘంటలకు యూరిలోనిమునిసిపల్ కౌన్సిలర్లను పెద్దవారిని పోలీసువారు పిలిపించిరి. ప్రజలకు శాంతి కావలెనా లేక కల్లోలము కావలెనా ? రెంటికిని సంసిద్ధులమై యున్నాము. పట్టణము సైనికోద్యోగుల అధీనమున యున్నది. వారియాజ్ఞలకు మీరు బద్ధులు కావలెను అని కమీషనర్ చెప్పెను. తర్వాత 5 గంటలకు డయరు మఱికొందరు సైనికోద్యోగులతో నచ్చటికి వచ్చెను. అమీద వారితో ఉర్దూభాషలో యిట్లు చెప్పెను. "నేను సైన్యమువాడని మీకు తెలియును. శాంతికావలెనన్న బజారులన్నిటిని తెరవవలెను. లేనియెడల మరల కాల్చెదను. యుద్ధము ఫ్రాన్సున జరిగినను అమృతసరమున జరిగినను నాకు రెండును ఒకటే. మీకు అశాంతి కావలెనన్నచో నేనట్లేప్రవర్తింతును. లేనియెడల తక్షణమే యంగళ్లను తెఱవవలెను. బెంగాలున, జర్మనీలో చదివివచ్చినవారు రాజద్రోహమును పెంచుచున్నారు. ఏదియెట్లున్నను నాయుత్తరవు మీరకుండ యుండవలెను. మీలో కుట్రలు చేయువారిని దుర్మార్గులను నాకు జూపినయెడల వెంటనే వారినిఁ గాల్చెదను. నాయాజ్ఞలను మీఱక నంగళ్ళను తెఱచెదరా లేక యల్లరి కావలెనా; చెప్పుండి."

పిదప ఇర్వింగ్ కావించిన యుపన్యాసములోని కొన్నియంశముల నిం దుదాహరించుచున్నాము. "ఇంగ్లీషువారిని చంపుటలో మీరు గొప్ప పొరబాటు గావించియున్నారు. మీరు మీసంతతివారు ప్రతీకారము చేయవలసియున్నది." ఏప్రిల్ 15 దీని అన్ని యంగళ్లు తెరవబడెను. పట్టణము నెమ్మదిగాయున్నను అధికారు లింతటితో తృప్తిచెందక యీపట్ట



జలియన్వాలాతోటలో దెబ్బలుతగిలిన మంగళసింగ్.

శమున సైనిక ప్రభుత్వమును నెలకొల్పిరి. ఈసైనిక ప్రభుత్వము జూన్ 9 వ వరకు అములున నుండెను. ఈకాలమం దెట్టియక్రమములు జరిగెనో వాని కొన్నిటి నిందు జెప్పెదము:—

1. షెర్‌వుడ్ దొరసానిని తన్నినవీధి ప్రజల కొరడాదెబ్బలు కొట్టుటకై ఏర్పాటు చేయబడెను. ఈవీథిలోన వచ్చువారందరు పొట్టమీద ప్రాకవలెనని శాసించిరి.

2. ప్రతిమనుష్యుఁడు ఇంగ్లీషువాని నెచ్చట జూచినను సలాముపెట్టి వెళ్ళవలెను.

3. ఎట్టి స్వల్పనేరములకైనను ప్రజల బహిరంగముగ కొరడా దెబ్బలు కొట్టిరి.

4. ఊరిలోని న్యాయవాదులందరును స్పెషల్‌పోలీసుకాన్‌స్టేబులుగా నియమింపబడి వారిచే నన్నికూలీపనుల చేయించిరి.

5. పెద్దమనుష్యు లనేకుల నిష్కారణముగ పట్టుకొని వారి నన్ని నానాకష్టముల పాలు చేసిరి.

6. నేరములను విచారించుటకై స్పెషల్‌కోర్టు నియమింపబడి అందెంత యన్యాయము జరిగినను అపీలులేక చేయబడెను.

పొట్టమీద ప్రాకవలసిన యుత్తరవునుగూర్చి కొంతచెప్పెదము. ఇది పెద్దవీథి. ఈవీధిన యనేక చిన్నవీథులుండెను. యీవీథిలోనివారుగాని సందులలోనివారుగాని గడపదాటవలెనన్న పొట్టపై ప్రాకవలసినదే. 150 గజములదూర మందరును ప్రాకవలసినదేను. ఈయాజ్ఞ 8 రోజు లములున యుండెను. ఈయుత్తరవుచేయుటకు కారణము డయ రిట్లు చెప్పెను. "మనము పవిత్రముగ తలచు స్త్రీని భంగపరచినచోటుకావున ఈవీధికి రెండువైపుల కావుదలయుంచి స్వదేశీయు లెవరును అచ్చటికి రాకూడదని శాసించితిని. ఎవరైన నచ్చటికి వెళ్లవలెనన్న పొట్టమీద ప్రాకియే వెళ్లవలెను. వివేకమున్నవాఁ డెవడును యీవీధికి వెళ్లునని నేను తలచలేదు" షర్‌వుడ్ దొరసానిని తన్నినది 10 దిని, ఈయుత్తరవు 19 దిని చేయబడెను. షర్‌వుడ్‌ను చూచియుండనివారుగూడ ఈయాజ్ఞకు బద్ధులు కావలసివచ్చెను. ఈవు

త్తరవును అములు జరుపుటకు సైనికులు ఉదయం 6 ఘంటలుమొదలు రాత్రి 10 ఘంటలవరకు యుంచబడిరి. ఆవీథిలోనికి వెళ్ళువారి కిది కష్టముకాదా యని హంట రడిగినందుకు రాత్రి 10 ఘంటలమీద వారు వెళ్లవచ్చునని బదులు చెప్పెనుకాని, రాత్రి 10 ఘంటలమీద వీథులలో నెవరైన యున్నయెడల వారిని కాల్చెద మని తాను చేసిన మఱొక యుత్తరవును గ్రుఱ్ఱతను మఱచెను. మర్వుడ్‌ను తన్నినవారు తిరుగువీథి యిది కాదుగదా యని హంట రడిగినందుకు కాదుగాని ఆమెను తన్నిన వారిని ఈవీథిలో కొరడాదెబ్బలు కొట్టించుట కేర్పాటుచేసితి ననెను. అమృతసరములో లాలా ఈశ్వరదాసు ఒక గొప్ప వర్తకకంపెని యధికారి. ఇతను ఏప్రెలు తే 18 ది లాభ్‌చందు యింటికి వెళ్లెను. ప్లోమరు కొందరు భటులతో నచ్చటికి వచ్చి వారిని సలాముచేయమని కోరెను. వీ రట్లుచేసిరి. పైకి వెళ్లవలెనని వారు చెప్పగా పొట్టపై ప్రాకి వెళ్లవలెనని ప్లోమరు చెప్పినందున వీరు విధిలేక నట్లు వెళ్లిరి. ఈయుత్తరవును అములున పెట్టిన మొదటిసందర్భ మిదియే. మేఘమల్ అను బట్టల వర్తకు డీతీరున సాక్ష్యమిచ్చెను. "మాయిల్లు కుచ్చాకూర్చ్ఛ్ వీథిన యున్నది. (ఇది ప్రాకుడువీథిలోనిసందు) మొదటిరోజు సాయంత్రం కొట్టు నుండి యింటికి వచ్చుచుండగా త్రోవలో సైనికభటులు నన్నడ్డగించి నాయింటికి వెళ్లవలెనన్న ప్రాకి వెళ్లవలెనని చెప్పిరి. అచ్చటినుండి వెనుకకు వెళ్లితిని. రాత్రి 9 ఘంటలకు సైనికభటులు లేనపుడు యింటికి వెళ్లినాను. ఇంటిలో నాభార్యకు జ్వరముతగిలియుండెను. ఎచ్చటను నీళ్లుదొరకలేదు. వైద్యులెవ్వరును పొట్టమీద ప్రాకి నాభార్యను చూచుటకు రారు కావున వైద్యము చేయించుటకు వీలులేకపోయెను." రాలియారాం ఇట్లు సాక్ష్యముచెప్పెను. "నేను ప్రాకునపుడు భటులు కాలితోతన్నిరి. 8 రోజులవరకు వీథి యూడ్చువారుకూడా లేరు, పాకివాండ్రు కనబడరు.' గణపతిరాయి గారు దేవుని దర్శించుటకు వెళ్లువారుకూడ యీవీథిలో ప్రాకి వెళ్లవలసి యుండెనని చెప్పెను. లాలా దేవిదాసుగా రిట్లుచెప్పిరి. "ప్రాకక వెనుకకు వెళ్లుటకు ప్రయత్నించినను నన్ను తన్ని నాచే ప్రాకించిరి. మొట్టమొదట

పొట్ట నేలమీద తగలక ప్రాకితిని. నన్ను తన్ని పొట్టమీద ప్రాకించిరి." పుట్టంధుడగు ఖాఁచందునుకూడా యిట్లే చేసిరి. అధికారుల సాక్ష్యప్రకారము 50 మంది మాత్రమే యిట్లు ప్రాకింపబడిరని తెలిసినది. సలాముచేయవలెనను యుత్తరవుప్రకారము యొకతీరునే యందరును సలాములు చేయవలసియుండెను. అట్లు చేయనివారిని కారాగృహమున పెట్టుచుండిరి. హరగోపాలు, B. A. కొందరుస్నేహితులతో వీథినవెళ్లుచుండెను. దయరు యతనిని పిలిచి సలాము పెట్టమనెను. సలాము క్రమముగా పెట్టలేదని మరునాడు రాంభాగుతోటకు రమ్మనెను. హరగోపా లచ్చటికి వెళ్లగా యిదేనేరముచేసినవా రనేకులు కనబడిరి. ఆరోజంతయు నందరిని ఖైదున పెట్టి మరునాడు ఎండలో తోటలోనికి తీసికొనివెళ్లి యొకసైనికోద్యోగి సలాముచేయుటను నేర్పెను. ఆమీద వా రింటికి పంపబడిరి. అనేకులను కొరడాదెబ్బలు కొట్టిరి. బాలు రనేకులకు యీశిక్ష విధింపబడెను. సుందరసింగ్ అనుబాలుని స్తంభమునకు కట్టి 4 దెబ్బలు కొట్టగానే స్మృతి తప్పెను. కొంత నీళ్లుపోయగానే స్మృతివచ్చెను. ఆమీద మరల దెబ్బలు కొట్టిరి. 30 దెబ్బలు కొట్టినమీదట నెత్తురుకారుచుండగా నతనిని వదలిరి. స్పెషల్ కాన్‌స్టేబిల్‌గా నియమింపబడ్డ వకీళ్లు ఎట్టికష్టములకుపాలైరో వివరించెదము. అమృతసరమున ప్రముఖుడైన కన్యాలాలు యిట్లుచెప్పెను. "ఏప్రెల్ 22 దిని అల్లరులు అణగినవి. అప్పుడు సామాన్యపోలీసుభటులు తప్ప మరెవ్వరు యుండనవసరము లేకుండెను. అట్లున్నను యారోజున మమ్ము స్పెషల్ కాన్‌స్టేబుల్‌గా నియమించిరి. ముసలితనమునందు కూలి వానిపనులన్నియు నేను చేయవలసివచ్చెను" మరొకవకీలు యీస్పెషల్ కాన్‌స్టేబుల్ "దినమంతయు పనిచేయవలెననియు రోజుకు 3 మార్లు పోలీసు స్టేషనున హాజరు కావలెననియు యధికారుల యుత్తరవు మీరినయెడల మరణదండన విధింపఁబడుననియు సాక్ష్యము చెప్పెను."

ఈతీరున 93 వకీళ్లను బాధపెట్టిరి.—

లాలా గిరిధరలాల్ పోలీసు అరెస్టులనుగూర్చి యిట్లు చెప్పెను. "ఏప్రెలు 12 దిమొదలు పోలీసువా రిండ్లలో జొరబడి యేకారణము

చెప్పకను వారంటును జూపకను గొప్పవారినిసహితము పట్టుకొనుచుండిరి. వారికి సంకెళ్లు తగిలించి నెలలకొలది విచారణలేక కొట్లలోనుంచిరి ......" కాన్పూరులో బంధువొకనికి జబ్బుగా యున్నందున గిర్ధర్‌లాల్ గారు వెళ్లవలసియుండెను. అందు కధికారు లనుజ్ఞయివ్వక తుదకు 21 దిని వెళ్లమనిరి. రైలువెళ్లుచుండగా యితనియొక్కయు తక్కిన ప్రయాణీకులయొక్కయు సామానులు సోదావేసిరి. అట్లు చేసి యితని నమృతసరమునకు మరల పంపవలెనని చెప్పి పంపివేసిరి. కమీషనరువద్దకు తీసికొనివెళ్ళినప్పుడు అతనిచేతిలో నొకపత్రికయుండెను. దానినిచూచి కమీషనరు మిక్కిలి కోపించి యితనికి సంకెళ్ళు తగిలించి కొట్టునకొట్టించెను. ఆచిన్నగదిలో యిదివరకే 10 మంది యుంచబడిరి. మండువేసవిలో యీగదియందు వారు పడినబాధలు చెప్ప నలవికాదు. 3 రోజులమీద వీరిని సబ్ జైలునకు తీసికొని వెళ్లిరి. వీరి కిచ్చినయాహారము మనుష్యులకు పనికివచ్చినదికాదు. అచ్చట 3 రోజులుంచి తర్వాత లాహోరునకు తీసికొని వెళ్లిరి. త్రోవలో త్రాగుటకు నీళ్లుకూడా యిచ్చినవారు కారు. పిదప వీరిని 4 అడుగులయెత్తుగల బోనులలో యుంచిరి. మరునాడు బొస్టరుజైలునకు తీసికొని వెళ్ళిరి. జూన్ 3 దిని కొందరిని విచారించిరి. గిరిధరలాల్గారిని యే విచారణలేకయే జూన్ 6 దీని విడిచిపెట్టిరి. అని గిర్ధర్‌లాల్ సాక్ష్యము చెప్పెను. మకబూల్‌మహమ్మద్ 10 దీని వారధివద్ద తనప్రాణమును లక్ష్యపెట్టక యల్లరి నాపుటకు ప్రయత్నించినసంగతి తెలిసేయున్నది. పోలీసువారితని పట్టుకొని బలవంతముగ రాబిన్సన్‌రోలండులను చంపినవారు తనకు తెలిసినట్లు చెప్పించిరి. పిదప యితను నిజముచెప్పి కేసున ముద్దాయితరపున సాక్ష్యమిచ్చెను. ఏప్రిలు 20 దిని 62 ఏండ్లు వయసు కలిగినట్టిన్ని డాక్టరయినట్టిన్ని కేదారనాద్‌గారిని పిలిపించి ఈస్టర్‌ను తన్నినవాళ్ళ జెప్పమనెను. తనకు తెలియదని బదులుచెప్పినమీదట ప్లోమరు, సర్దార్‌సింగు మొదలగువారు ఆపేళ్ళ జెప్పనియెడల పట్టుకొనెదమని చెప్పిరి. అంతట యేయుత్తరవు నగపరచకనే అరెస్టుచేసి ఎండలో నడిపించిరి. ఆహారము నీళ్ళు యిప్పించినవారు కారు. దుస్తులమార్చుటకు అవకాశ మివ్వలేదు.

ఈలోపల యెవరో వీరివద్దకు రెండుమూరులువచ్చి కొందఱిపేళ్లు చెప్పినయెడల వదలిపెట్టెదమనిరి. ఇట్లెన్నియో కష్టములుపెట్టి మే 12 దీని ఇతనిని వదలిరి.

మహమ్మద్ అమీన్ ఈస్టర్‌ను తన్నినందుకుగాను యురిశిక్షచెందిన ఆక్రాముకుతండ్రి. ఏప్రిలు 20 దీని యితను, యితనితమ్ముడు, కుమారుడు పట్టుకోబడి పోలీసుస్టేషనుకు తీసికోపోబడిరి. వీరందరును కొట్టున యుంచబడిరి. గామా యనునాతనివద్దకు పోలీసుభటుడు వచ్చి యేదియో రెండు పేళ్లు చెప్పినచో వదలిపెట్టెదననెను. ఇట్లు తప్పుసాక్ష్యములు సిద్ధము చేయుట జూచి వారు భయపడిరి. జైలులో జతలుజతలుగా సంకెళ్లు తగిలించి దొడ్డికి వెళ్లవలసినను సంకెళ్ళు తీయరైరి.

ఆహారమునకు ఒకకుండలో కొంతపులవలును, దానిప్రక్క ఒక కుండలో కొంతనీళ్లు వీరినుంచినగదిలో పెట్టిరి. దీనిప్రక్కన మలమూత్రములకుగాను ఒకతొట్టిని పెట్టిరి. ఈతిండి తిన్నవారు కారు కావున యాకలితో మాడవలసివచ్చినది. మరునా డాహారమును తెప్పించుకొనుటకు యవకాశ మిచ్చిరి. ఈతీరున 22 రోజులు వీరినుంచి మే 12 దీని లాహోరునకు తీసికొనివెళ్ళిరి. దినమంతయు లాహోరున నీళ్లుగాని యన్నముగాని యిచ్చినవారు కారు. ఎండలో జైలునుండి కోర్టుకు నడపించిరి. మే 27 దీని వదలిపెట్టిరి. నెల్లీబెంజిమన్ అనుదొరసాని ఒకడాక్టరు. ఈమె ఈస్టర్‌దొరసానిని తప్పించెను. ఆకేసువిచారణపుడు ఈమెను 2,3 మార్లు స్టేషనుకు పిలుచుకొనివెళ్లి అమీన్ అనునాతడు ఈస్టర్‌ కొట్టినట్లు చెప్పమనిరి. ఆమె యసత్యమాడనని చెప్పగా జెప్పనియెడల ఖైదీని పెట్టెదననియు అట్లు చెప్పినయెడల అధికారులతో జెప్పి పారితోషిక మిప్పించెదననియు ప్లోమరు చెప్పెను. కాని యీమె అట్లు అబద్ధము చెప్పలేదు. గులాంమహమ్మద్ యనునాతడు మసీదులోనుండగా పోలీసు స్టేషనుకు పట్టుకొని వెళ్లిరి. అచ్చట, సత్యపాలు, కిచ్‌లూగార్లు నన్ను బలవంతపెట్టి నాకొట్టు మూయించిరనియు, బాంబులువేసి ఇంగ్లీషువారిని దేశమునుండి వెళ్లగొట్టెదమనియు చెప్పినట్లు చెప్పమనిరి. అందు కితడు

సమ్మతించలేదు. అటుమీద కొందరుభటులు బైటికి తీసుకొనివెళ్ళి మంచముకోడు క్రింద యితనిచేతినిపెట్టి 8 గురు దానిమీద కూర్చొనిరి. ఇతడు కేకలువేయుచూ వారిష్టప్రకారము చెప్పెదననెను. కాని యధికారిదగ్గరకు మరల వెళ్ళినపుడు యసత్యమాడుటకు నోరు రాలేదు. మరల యితని కొట్టునకొట్టి 8 రోజులు యెన్నియో కష్టములుపెట్టి యురితీసెదమని బెదరించి మేజస్ట్రేటుయెదుట యబద్ధము చెప్పించిరి. అంతట విడుదల చేసి రోజును స్టేషనుకు రావలెనని చెప్పిరి. తర్వాత సాక్ష్యమిచ్చుటకు లాహూరుతీసుకొనివెళ్ళిరి. అచ్చట విచారణలో సైనికకోర్టుయెదుట నిజము చెప్పెను. సర్దారు ఆత్మాసింగును ఏప్రెల్ 13 దిని పట్టుకొని మొలకు నౌకగుడ్డను గట్టి వీధిన యీడ్చుకొనిపోయిరి. ఇతని కొట్టునవేసినప్పుడు ఒక పోలీసుసార్జెంటు వచ్చి చేతనున్న బంగారుఉంగరమును జేబీనుండిన బంగారు గడియారమును కాజేసెను. .... లాలారాయ్యిమారాం యనుగొప్పవారిని పోలీసువా రడిగినప్పుడు మర్పును కొట్టినవారు నాకు తెలియదని చెప్పగా గడ్డమును పెఱికి బెత్తముతో కొట్టిరి. నందుచివరనుండి యిటునటు పదిమార్లు వెళ్ళుమని యామీద పంపివేసిరి. గులాంఖాదర్ అనువాడు తప్పుసాక్ష్య మివ్వనని చెప్పగా యితనితలగుడ్డను పారవేసి చేతులను కట్టి చెట్టునకు వ్రేలాడవేసిరి. నాయెదుట పిరాగుజార్ అనువాతని పండపెట్టి యొకకఱ్ఱను వానియాసనమున గ్రుచ్చిరి. అతడెంతయుఱచినను వదలినవారుకారు. ఈపని సబ్ ఇన్స్పెక్టర్ అక్కడనుండగనే జరిగినది. మూడురోజులు బొత్తుగా మాకేలాటియాహారము యిప్పించలేదు. మేము విన్న చిత్రకథలలో యీక్రిందిదానికన్న ఘోరమైనది మఱొకటికనబడదు. దీనిగూర్చి యనేకులు సాక్ష్యమిచ్చియున్నారు. గులాంజిలాని యనునాతడు మసీదున యిమాము. ఇతడు రామనవమీయుత్సవము జరుపుటలో ప్రాముఖ్యతవహించియుండెను. ఇతనిపట్టుకొని ముడ్డివగులునట్లు కఱ్ఱగ్రుచ్చి తటిమివేసిరి. బారిష్టర్ బద్రూం ఆలీఖానుగారిని ఏప్రెలు 19 దీని పట్టుకొని, పడకటింటిలో భార్యయున్నచోటికి వెళ్ళిరి. తర్వాత రెండునెలలు యితని ఖైదినబెట్టిరి. ఇంకను అనేకులను యెన్నియో బాధలు పెట్టిరి.

తప్పుసాక్ష్యములు చెప్పించుటకై ప్రజల హింసించుటకన్న నీ ప్రభుత్వమున క్రూరకార్యము మరొక్కటగుపడదు. జలియన్వాలా హత్యలు యీనెమ్మదిగా జరగువధకంటే మేలని చెప్పవచ్చును. ప్రజలలో నెట్టిగొప్పవాడైనను పోలీసుదౌర్జన్యమునకు పాలుకావచ్చును. ఈవిషయమును సాక్ష్యము పుచ్చుకొనుటలో మేమెంతో జాగ్రత పుచ్చుకొంటిమి. పుచ్చుకొన్న వాఙ్మూలముల నేన్యాయస్థానమునకైనను చూపవచ్చును. అధికారులు లంచములు దీసికొనిరని మావద్ద ననేకులు చెప్పిరి కాని వారిపేళ్ళను ప్రకటించుటకు భయపడినందున వారిసాక్ష్యము నిందు కనబరచలేదు. అధికారులీవిషయమును విచారణ సల్పెదమన్న నిట్టిసాక్ష్యము చెప్పువారికి నభయ మిచ్చినయెడల వారికి సహాయము కావించుటకు సంసిద్ధులమై యున్నాము.

తప్పుసాక్ష్యము చెప్పించుటయేగాక ఈసైనిక ప్రభుత్వపు న్యాయస్థానముల స్థితి నాలోచింతము. ఈన్యాయస్థానములయందు మరణదండనలు విధించు నధికారముతో ముగ్గురు కూర్చుండిరి. వీరు సాక్ష్యములకై ఫీదులను వ్రాయవలసినది లేదు. శిక్షల కపీలు లేదు. ఇవిగాక సమ్మరీ కోర్టులు కొన్నియుంచిరి. ఈకోర్టులలో మేజస్ట్రేటు ఒకడేయుండెను. 1000 రూప్యాలు అపరాధము విధించుటకును రెండుసంవత్సరముల శిక్ష విధించుటకును యితని కధికారముకలదు. ఈశిక్షలకుకూడ అపీలు లేదు. ఈవిచారణల జాబితాను శ్రద్ధగా జూచితిమి. దీనిలో న్యాయమే జరగలేదని మాయభిప్రాయము. చక్రవర్తిగారి ప్రకటన ననుసరించి ఈ కోర్టులలో శిక్షలుజెందినవారిని విడుదలచేసియున్నందుచే యీ విచారణల గూర్చి విశేషముగ చర్చించలేదు. అయినను రౌలట్ చట్టము వలదని చెప్పినందులకు యురిశిక్షయు, ద్వీపాంతరవాసశిక్షయు ఆస్తిని సర్కారువారు లాగికొనుటయు మొదలగు కఠినశిక్షలను హారతాళముల కావించినందుకును విధించిరి. కేవలము అప్రూవరులసాక్ష్యముమీద నాయకులపై గొప్పనేరములు మోపబడెను. అమృతసర అల్లరినిగూర్చి మేము చెప్పిన దేమన, కిచ్లూ, సత్యపాలుగార్లను దేశభ్రష్టుల చేయుటలో

నధికారులు గొప్పపొరబాటు గావించిరి. తుపాకుల ప్రజలపై గాల్చుట యందు తొందరపడిరి. కొంతసాయిలాపాయిలాగా నధికారులు ప్రవర్తించి యున్నయెడల నిట్టిదురంతములు జరిగియుండవు. ప్రజలు కావించిన కొన్ని పనులు గర్హించవలసినవైనను జలియన్‌వాలాబాగున నిరపరాధులగు ప్రజల వధించినది యమానుషకృత్యమని తలచెదము. డయర్ వాఙ్మూలము వల్లనే సైనికప్రభుత్వమున కవసరమే లేదనియు, యవసరముండినను అన్ని రోజులు అమలున యుంచుట అధికారదుర్వినియోగమనియు మాదృఢాభిప్రాయమై యున్నది.

3. లాహోరుపట్టణము.

ఇది పంజాబు ముఖ్యపట్టణము. దీనిజనసంఖ్య 2 లక్షల 50 వేలు. ఇందు మూడవవంతుమాత్రమే హిందువులు. ఇచ్చట బాలురకు కళాశాలలు 10 యున్నవి. రెండు ఇంగ్లీషు దైనిక వార్తాపత్రిక లున్నవి. ఇందు విశ్వవిద్యాలయముకూడా కలదు. విద్యార్థికు లనేకు లుండుటచే రాజకీయప్రచారమునకు హెచ్చుగ ప్రాప్తియుండెను. శ్రీ గాంధిగారు సత్యాగ్రహవ్రత మవలంబించమని చెప్పినపుడు యీపట్టణమువా రొకరును అట్లు చేయలేదు. ఉపవాసముచేసి హరతాళము నల్పమని చెప్పినపుడు మాత్రము నాయకులు గాంధిగారిసందేశమును విరివిగ బ్రకటించిరి. హరతాళము జరగబోవుచున్నదని అధికారులకు తెలియగానే వారు భయపడిరి. ఏప్రిల్ 4 దిని ఉత్తరవుపొందక యుత్సవములు జరపకూడదనియు సభలు కావింపకూడదనియు పోలీసువారు ప్రకటించిరి. 5 దీని డిప్యూటీ కమీషనర్ నాయకులపిలిపించి యీక్రిందియంశముల వారికిబోధించెను.

1. ఈసాయంతనమువఱకు హరతాళమునుగూర్చి చక్కగ ప్రజలకు బోధించవచ్చును. 2. రేపటిరోజున ప్రజల కేమియు చెప్పకూడదు. 3 రేపుసాయంకాలము సభ జరగవచ్చునుగాని విపరీతపుయుపన్యాసములు కావింపకూడదు. ఏప్రిల్ 6 దినాడు లాహోరుపురమంతయు సంపూర్ణహరతాళమును జరపెను. ప్రాతఃకాలముననే ప్రజలు విశేషముగా ఏటికి వెళ్లి స్నానముచేసి యుత్సవములతో మరల పట్టణము ప్రవేశించిరి.

అశాంతి యేమియు జరిగియుండలేదు. ఈగొప్పయుత్సవము మాల్‌వైపు పోవ ప్రయత్నించునరికి పోస్టాపీసువద్ద పోలీసువా రాటంకపఱచిరి. ప్రజానాయకులగు దూనీచందుగారును, గోకుల్‌చంద్‌నారాంగుగారును ప్రజలను నెమ్మదిగా వెనుకకు మరల్చిరి. పంజాబుదేశములో నేలాటిహరతాళము జఱుగదని చాటించిన ఓడ్వ్యయరు లాహోరునందుసహితము సంపూర్ణముగ హరతాళము జరుగుటను ఓర్వలేకపోయెను. దీనికి కారణభూతులగు నాయకులను శిక్షించెదనని యాతడు చెప్పెనట. సాయంకాలమున బ్రహ్మాండమైన మహాసభ బ్రాడ్లాహాలునందున జరిపెను. ఓడ్వ్యయరుయుత్తరవు ననుసరించి సి. ఐ. డి. సూపరింటెండెంటుగారు ప్రత్యేకముగా నీసభకువచ్చి ఉపన్యాసముల నన్నింటిని వ్రాసుకొనుచుండెను. ఈనాడు నాయకులుచేసిన యుపన్యాసములను మేము చదివితిమి. ఆయుపన్యాసములు ప్రజల దృఢనిశ్చయములను వెల్లడించుచున్నను అందున రాజద్రోహ మేమియు లేదు. ఏప్రిల్ 9 తేదినాడు రామనవమి యుత్సవదివసమగుటచే అమృతసరమునందువలెనే యిచ్చటను యుత్సవములు జరిగెను. హిందువులును, మహమ్మదీయులును యేకమై తమయైకమత్యము చాటించిరి. ఈవిధముగా ఏప్రిల్ 10 వ తేదివరకును పట్టణము శాంతముగా నుండెను. సత్యపాలుగారు గాంధిగారిని అమృతసరమునకువచ్చి సత్యాగ్రహవ్రతమును ప్రజలకు బోధచేయమని వేడియుండెను. డిల్లీమీదుగా వచ్చెదనని చెప్పి గాంధిగారు ఏప్రిల్ 8 తేదినాడు బొంబాయిలో రైలెక్కెను. ఓడ్వ్యయర్ రాజప్రతినిధిగారి యుత్తరవునుపొంది గాంధిగారిని పంజాబు సరిహద్దులలోకి రాగానే అరస్టుచేయించి మరలి బొంబయికి పంపివేసెను. ఈవిషాదవార్త 10 తేదినాడు లాహోరునకు చేరగానే ఎవరేమిచెప్పకుండగనే వర్తకులందరును తమయంగళ్లను మూసివేసిరి. సాయంకాలము 4 ఘంటలగునప్పటికి పట్టణమంతను పూర్ణమగు హరతాళము జరిగినట్లుండెను. ప్రజలు కొందరు బయలుదేరి మాలువైపువెళ్ల ప్రారంభించిరి. ఇంతలో ననేకులు నీయుత్సవముతోఁ జేరి మఱింత పెద్ద జనసమూహ మాయెను. వీరు కొంతదూరము వెళ్లి యాగిరి. కొందరుమాత్రము త్రోవ ననుసరించి

వెళ్లుచుండిరి. పోలీసువారు వీరి నడ్డగించి ప్రజలపై తుపాకులను ప్రయోగించిరి. ఇద్దరు ముగ్గురు చనిపోయిరి. మఱికొందరికి దెబ్బలు తగిలెను. అంతటితో వీరు వెనుకకు మరలి గుంపుతో చేరిరి. ఊరివెలుపల బంగాళలోయుండిన రాంభూజీదత్తుచౌదరీగారు యీసంగతిని విని యచ్చటికి తక్షణమే వచ్చి ప్రజలను వెనుకకు మరలమని యెలుగెత్తి చాట మొదలిడెను. ఇంతలోనే కమీషనరు తొందరపడి రాంభూజీగారిని పిలిచి నీవు రెండునిమిషములలో సమూహమును వెనుకకు మరల్చవలయును లేనియెడల నేను కాల్చుటకు యుత్తరవు నిచ్చెదనని చెప్పెను. కాలము చాలదని వీ రెంత చెప్పినను వినక సరిగా రెండునిమిషములుకాగానే ప్రజలను కాల్పించెను. మఱికొందరు ప్రజలు మడిసిరి. గుంపులోనివారందరును వెనుకకు మరలిరిగాని అధికారులయెడ వారికికోపము మఱింతయయ్యెను.

ఈరెండుమార్లును కాల్చుట కవసరమే లేదని మాయభిప్రాయము. కాల్చుటకు ముందు ప్రజలను భయపెట్టుటకు యేలాటిమార్గము లాలోచించలేదు. పంజాబులోని ప్రజాసమూహములు యితరప్రదేశముల వంటివి కావని యధికారులు తలచిరి. కాని యట్టిభేద మున్నట్లు మాకు తోచదు. అధికారులు చచ్చినవారిని, దెబ్బలు తగిలినవారిని రక్షించుటకు బంధుమిత్రాదులనయితము వదలినవారు కారు. అందునిమిత్తమై ఏప్రిలు 10 దినికూడ హరతాళము జఱిగెను. ఈలోగా యధికారులకు ప్రజానాయకులకు సంభాషణ జరిగెను. అధికారులు యేయుత్తరవును రద్దుచేయకనే హరతాళమును మానమని చెప్పిరి. 11 దీని గొప్పసభ సమావేశమాయెను. నాయకులు యెంతచెప్పినను హరతాళమును మానుటకు ప్రజలు సమ్మతించలేదు. మరునాడు మరల సభచేసెదమనియు నాసభచుట్టు సైనికుల రానియ్యవలదనియు ప్రజానాయకులు డిప్యూటీకమీషనరుగారిని యడిగిరి. ఇందుకు పైనర్ ఒప్పుకొనెనని శ్రీరాంభోజ్‌దత్తుచౌదరిగారు చెప్పియున్నారు. అట్లే గొప్పబాదషాహీ మసీదున గొప్పసభ జరిగెను. ప్రజలావేశపూరితులై యుండిరి. నాయకులు శాంతముగనుండమని బోధించిరి. ఏతీర్మాన మంగీకరింపబడకయే సభ ముగిసెను. ప్రజలు నెమ్మదిగ నిం

డ్లకు వెళ్లుచుండగా సైనికభటులు వారినిఁ గాల్చిరి. నిష్కారణముగ నిట్లు కాల్చుటవలన ప్రజలలో నుద్రేకము హెచ్చెను. అధికారు లెంతమాత్రము లొంగరైరి. హరతాళము సంపూర్ణముగ జరగెను. ఏప్రిల్ 16 దీని హరికిషన్‌లాలు, రాంభోజ్‌చౌదరి, దునీచందుగార్లు డిప్యూటీకమీషనర్‌గారింటికి రప్పింపబడి, దేశభ్రష్టులు కావింపబడిరి. నాడే సైనికప్రభుత్వము అధికారులు నెలకొల్పిరి. జాన్సన్ యుత్తరవులప్రకారము సైనికోద్యోగులు అంగళ్ళు తెఱపించిరి. ప్రజ లింతకాలము హరతాళములు కావించుట న్యాయమో కాదా యనువిషయమును చర్చించుట యనవసరముగాని ప్రజ లట్లుచేయుటవల్ల న్యాయశాస్త్రిప్రకారము వారియం దేలాటిదోషమును లేదు. అట్లున్నను వారిపై యధికారులు పశుబలము ప్రయోగించుట మిక్కిలి శోచనీయము. లాహూరులో ప్రజలు ఏలాటియల్లరులు చేసియుండనందున సైనికప్రభుత్వము నెత్తినపెట్టుట కేలాటి కారణము కనబడదు. ఒక సీ.ఐ.డి. పోలీసుఉద్యోగిని ఎవరో కొట్టిరని సైనికప్రభుత్వము నెలకొల్పిరి. ఇంతమాత్రమున కిట్లుచేయుట మిక్కిలి యన్యాయము. లాహోరులోని ప్రజలుగాని నాయకులుగాని యితరచోట్లలో అల్లరుల జరపినవారితో సంబంధము కలిగియున్నట్లు అధికారులుకూడ చెప్పుటలేదు. అందుచే నీయేర్పాటునకు యెట్టియవసరమును లేదు. అల్లరులు జరిగియున్నచోట్లకూడ సైన్యము, డబ్బుచేర్చుటయందు ఓడ్వైయర్ క్రింది నౌకర్లు క్రౌర్యమున నితనిని మించిరి కావున ప్రజ లీప్రభుత్వమును సహింపనైరి. లాహోరుప్రజలుమాత్రము మనస్సున నెంతయావేశమున్నను పైకి క్రియారూపముగ నేమియు చేయలేదు. ఇట్లున్నను వీరు సైనికప్రభుత్వము నెలకొల్పి యందుకావించిన క్రూరకృత్యముల కొన్నిటినివివరింతము:—

ఆఫ్రికాలో దౌర్జన్యమునకు పేరువడసిన జాన్సన్. అనునతడు ఏప్రెల్ 5 మొదలు మేనెల29 వఱకు యీపట్టణమున సైన్యాధిపత్యమున నుండెను. ఇతనిప్రభుత్వము మిక్కిలి నిరంకుశమైనందున ప్రతిమనుష్యుడును విద్యార్థులునైతము సహింపరాని బాధలు పడవలసివచ్చెను. రాత్రి 8 గంటలకు లోపుగా వారివారియిండ్లుచేరి బైటికి యెందుకును రాకూడదని యొకయు

త్తరవుచేసిరి. ఇందువల్ల యూరివారికి కష్టముకాదా యని విచారణసంఘమున నడిగినపుడు యుద్ధసమయమున ప్రజల కిబ్బందిలేకయుండునా యని జార్జి బదులుచెప్పెను. లాహోరుపరిస్థితులబట్టి యుద్ధమున్నట్లు చెప్పుట వల్ల అధికారులు ఏపనికి వెనుదీయరనిబోధపడును. ఈయుత్తరవును తెలియక మీఱినడచినవారిని వీధులలోబెట్టి కొరడాదెబ్బలుకొట్టించిరి. ఈపట్టణమునం దెచ్చటనైన బాంబులు పడినయెడల పడినచోటు 100 గజములవఱకు నిర్మానుష్యముగజేసి ఇండ్లను నేలమట్టము జేసెదనని యొకయుత్తరవు జేసెను. ఊరిలోని 800 బండ్లను యధికారులు వారిస్వాధీనము జేసికొనిరి. దేశీయులమోటారుబండ్ల నన్నిటిని తీసికొని వెళ్ళిరి. సైనికప్రభుత్వము వారినేరముల విచారించుటకై న్యాయస్థానముల జార్జి తానే యేర్పాటుచేసెను. కొన్నికేసుల తానే విచారించెను. అనేకుల కొఱడాదెబ్బలు కొట్టించెను. అతనియభిప్రాయమున నిది సామాన్యశిక్షగా భావించబడెను. చెరసాలలో యుంచినయెడల ప్రజలు భయపడరు గావున నిట్లు చేసితినని చెప్పెను. ఈన్యాయస్థానములయెదుట వకీళ్ళు వాదించక యుండునట్లు యెన్నియో యాటంకముల పెట్టించెను. వారంటులేకనే గొప్పవారినికూడ పట్టుకొని చెరసాలలోపెట్టి యెన్నియోబాధలు పెట్టించెను. ఇతను కావించిన వధ మఱొక టెట్టిదనిన, తనప్రకటనల దాను రాజద్రోహులని తలచినవారింటిపై నతికించి, వాటిపై మట్టిసయితముపడినట్టయిన యింటివారే జవాబుదారి యుండవలెనని చెప్పెను. ఇక విద్యార్థుల నెట్టికష్టములకు పాలు జేసెనో ఈక్రిందిసంభాషణవల్ల తెలియగలదు. విచారణసంఘము వారి తరవున కావింపబడిన సిటల్‌వాడ్ గారి:—

ప్రశ్న:—ప్రకటనలం గరపించుచోట్లలో సనాతనధర్మవిద్యాలయ మొకటియా?

జార్జి:—అవును.

ప్రశ్న:—ప్రకటన కాకితమును యెవరో చింపిరికదా?

జార్జి:—చింపిన ట్లెవరో నాతోచెప్పిరి.

ప్ర:—అటుమీద విద్యార్థులందరిని పట్టుకోమని చెప్పినావా?

జార్జి:—ఆచోటులోని ప్రతిమనుష్యుని పట్టుకోమనిచెప్పితిని.

ప్ర:—యెందరిని అట్లు పట్టుకొనిరి?

జార్జి:—500 మందిని.

ప్ర:—ఈచిన్న నేరమునకు 500 విద్యార్థులను పట్టుకొనిరా?

జార్జి:—విద్యార్థులనేగాక యుపాధ్యాయులనుకూడ పట్టుకొంటిమి.

ప్ర:—అచ్చటనుండి 3 మైళ్లదూరము కోటవఱకు ఎండలో నడిపించితివా?

జార్జి:—అవును.

ప్ర:—అట్లు వారిని యెన్నిరోజులు కోటలో యుంచితివి?

జార్జి:—రెండురోజులు.

ప్ర:—నీవు చేసినపని న్యాయమైనదేనా?

జార్జి:—ఇట్టిపనికి సిద్ధముగ నుంటిని. అవకాశము కలుగగానే చేసితిని.

ప్ర:—ఇప్పుడుకూడ యిది న్యాయమైనదని తలచెదవా?

జార్జి:—ముమ్మాటికి న్యాయమనియే తలచెదను. మఱల యిట్టిఅవకాశము కలిగినయెడల నట్లే చేయుదును.

... ...

ఈవిద్యార్థులు ప్రతిరోజు నాలుగుమారులు అధికారులయెదుట హాజరు కావలసియుండెను, దీనికై ముందు వీరు మండువేసవిని 17 మైళ్ల దూరము రోజు నడవవలసియుండెను. ఈతీరున మూడువారములు జరిగెను. విచారణసంఘమెదుటయీయుత్తరవుకఠినమైనదనియున్యాయమైనదనియు ననెను. ఇట్లుచేయుటవల్ల వేలకొలది విద్యార్థులకు నధికారులయెడ ద్వేషభావము పుట్టినదా యని యడిగినందుకు అప్పటికే విద్యార్థికులందరికి పూర్ణముగ ద్వేషభావ మున్నందుచే ఇక నది వృద్ధికాజాలదనెను. ఈజార్జి కొందరు విద్యార్థులు ఆంగ్లేయస్త్రీలను అవమానపరచిన ట్లూహించెను. ఇందు కేలాటిసాక్ష్యమును కనబడదు. అందుమీద కళాశాలాధికార్ల పిలిపించి విద్యార్థులకు తగినదండన విధింపమని చెప్పెను. తర్వాత వారు విధించినశిక్షలు చాలవనిచెప్పి హెచ్చించవలసినదనియు లేనియెడల కళాశాలలు మూయబడుననియు చెప్పెను. ఈవిషయమునుగురించి దయాళ్

సింగ్ కాలేజిలో ఆంగ్లపండితుడైన సాంతరాంగ్రోవర్గారు యీతీరున సాక్ష్యమిచ్చిరి. "..........హరతాళము కావించినపుడు మావిద్యార్థులు యే దుష్కృత్యములను చేయలేదు. సైనికప్రభుత్వము ప్రారంభించిన కొన్ని రోజులకు రాజద్రోహమును బోధించునట్టి యొకప్రకటన కళాశాలగోడలపై యంటించబడినదనియు దాని నంటించినవారిని కనుగొని యధికారులకు పట్టియ్యవలెననియు అందుకు జవాబు మరునాడియ్యవలెననియు ఒకనోటీసును మాపాఠశాలాధికారికి యందించిరి. పాఠశాలాధికారి యీ సంగతి తనకు తెలియదనియు చెప్పగా 250 రూప్యాలు యపరాధ మివ్వవలెనని కోరినమీదట వా రట్లుచేసిరి. పిదప కొన్నిరోజులకు డిప్యూటి కమీషనరు మరల మాప్రిన్సిపాలును పిలిపించి విద్యార్థులలో తాను అల్లరికావించినవారని తలచినవారిలో ముఖ్యులను దండించవలెనని కోరెను. అంతట కళాశాలాధికారులు సమావేశమై కొందరివిద్యార్థులపట్టీనొకదానిని నామూలకముగ వారికి పంపిరి. ఈపట్టీలోనిసంఖ్య తక్కువ యైనదనియు విధించినదండన చాలదనియు తలచి త్రిప్పగొట్టెను. అందుమీద మఱికొందరిపేళ్ళజేర్చి పంపినాము. దీని డిప్యూటికమీషనర్ ఆమోదించి ప్రిన్సిపాలుకు విధించిన యపరాధమును పంపివేసెను..."

ఈ యధికారిదృక్పథ మిట్టిదని వెల్లడించుటకై అతను ప్రిన్సిపాలుగారికి వ్రాసిన యుత్తరములోని కొంతభాగము నిం దుదాహరించుచున్నాము. "........మీకళాశాలయందు 7 గురు విద్యార్థులను వెళ్లగొట్టి వారి నెచ్చటను చేర్చుకొననట్లు చేయవలెను. 5 గురిని ఒకసంవత్సరము; 14 గురిని 3 మాసములున్ను పాఠశాలకు రాకూడదని దండన విధించవలెను. 14 గురిని క్రిందితరగతిలో చేర్చవలెను, 2 గురికి విద్యార్థివేతనమును తీసివేయవలెను. 224 గురికి యితరమైనశిక్షల విధించవలెను. 245 గురివద్ద నుండి ధరావత్తు పుచ్చుకోవలెను. అట్లుచేయనియెడల మీపాఠశాల మూయబడును........ ...."(ఇం దుదాహరించినసంఖ్యలు పాఠశాలలోనున్నవారిసంఖ్యను ఆలోచించి చెప్పినదేకాని తప్పుచేసినవారు వారని తెలిసికొని చెప్పినది కాదు).

సైనికప్రభుత్వపు న్యాయస్థానములయందు యెట్టిదౌర్జన్యములు జరిగెనో కొంత వివరించెదము. *లాలా హరికృష్ణలాలుకన్న రాజభక్తిగలవాడు మఱొకడు లేడు. వీరిని, యిట్టివారి మఱికొందరిని పట్టుకొని వారిని దేశభ్రష్టులుగజేసి తర్వాత నీన్యాయస్థానములలో వారిని విచారించిరి. వీరు రౌలట్ చట్టమును రద్దుకావించుటకు ఆందోళనము సల్పుచున్నారనియు హరతాళమునందు పాలుపుచ్చుకొనిరనియు నుపన్యాసములు కావించుచున్నారనియు నేరము మోపబడినది. ఈవిచారణలోని సాక్ష్యమును చక్కగ పరిశీలించినాము. పంజాబున యుద్ధము జరుగుచున్నట్లు యే సాక్ష్యము లేకయే న్యాయస్థానమువా రున్నట్లు భావించిరి. ఈవిచారణయందు జరిగినయన్యాయ మెచ్చటను జరిగియుండలేదు. ఈవిచారణ జరిగినందుకు హరికృష్ణలాల్గారికి 1200 రూప తంతెలకును, 12 వేలు విచారణకును ఖర్చైనది. వ్యాపారమున 3 లక్షలు నష్టమైనది. అపీలుకైనఖర్చు మాకు తెలియలేదు.

పిదప సంస్కరణములు ఆచరణకు రాగానే పంజాబున మంత్రిపదవిని వీ రధిష్ఠించి ప్రభుత్వమువారికి సహాయపడుచున్నారు. సుమారు 10 సంవత్సరములు బారిష్టరుగనుండిన శ్రీ. కే. సంతానముగారు సైనికప్రభుత్వపు న్యాయస్థానములో జఱిగిన విచారణలగూర్చి యిట్లు చెప్పిరి.

"....ప్రజలనేకులను పట్టుకొనుచుండిరి. ఏనేరమున పట్టుకొనిరో వారికి తెలియదు. వారిని న్యాయస్థానమునకు తీసికొని రాగానే వారితరపున న్యాయవాది యెవరైనయున్నారా యని ప్రశ్నించి లేదన్నప్పుడు అధికారులే న్యాయవాదిని యిప్పించుచుండిరి. కాని ఈన్యాయవాదికి న్యాయము నిరూపించుట కేలాటియవకాశ మిచ్చినవారు కారు. ఒక్కొకసమయమున న్యాయవాది 5 నిమిషములకన్న హెచ్చుకాలము నేరస్థునిచూచుటకునయితము వీలుండినది కాదు. ఒకరోజున 20, 30 మందిని విచారించుటచేతను, ఒకేన్యాయవాది ఇందరికిగాను వాదించవలసియుండుటచేతను న్యాయవాది

వీరికి ద్వీపాంతరశిక్ష విధింపబడి వీరియాస్తిని సర్కారువారు పుచ్చుకొనునట్లు తీర్మానమైనది.

తనకార్యము సరిగా నిర్వహించుటకు యవకాశమే లేదు. వీరిస్థితి యిట్లుండ న్యాయవాదిని కుదుర్చుకొనుటకు యవకాశమున్న వారిస్థితిగతుల నాలోచించెదము. పట్టుబడ్డవారి నెన్నడు న్యాయస్థానమునకు తెత్తురో ముందు తెలియనందున గొప్పన్యాయవాదులు వచ్చుటకే వీలులేకయుండెను. మఱియు న్యాయవాదులందరును రాజకీయవ్యవహారములలో పాల్గొనుటచే తాము నేరస్థులతరఫున వాదించుటకు వెళ్ళినయెడల వారినికూడ పట్టుకొందు రనుభీతిచే ననేకులు రారైరి. ఇంతేగాక న్యాయవాదులు నేరస్థులతరఫున వాదించుటకు వచ్చినయెడల యధికారులు కోపగించెద రను యభిప్రాయము ప్రబలియుండెను. దీనికి కారణ మేమన, ఇండియాగవర్నమెంటు కార్యనిర్వాహకసభ్యులలో నొకడగు షాఫీగారు రామప్రసాదుగారి తరఫున వాదించెదనని యొప్పుకొని మరల అందుకు వీలుకాదనెను. అధికారులు యితనితో నేమియో చెప్పినట్లు నాకు రూఢిగ తెలిసినది. నేను హరికిషన్‌లాలుగారిపై తేబడ్డకేసున పనిచేయుచుండి కేసును యచ్చటినుండి మఱొకచోటునకు మార్పించుటకై సిమ్లాకు వెళ్ళితిని. అప్పటినుండి పోలీసువారు నన్ను కనిపెట్ట ప్రారంభించిరి. ఇట్టిన్యాయవాదుల కేలాటిగౌరవము చూపలేదు. వారిసామాన్యమైనకోరికల విఫలముచేసిరి. నేరస్థునితరఫున వాఙ్మూలముల వ్రాసికొనుటకుకూడ వీలుండినది కాదు. ఈన్యాయాధిపతులు పోలీసువారిసాక్ష్యముల వాఙ్మూలముల పూర్తిగ వ్రాసికొని, క్రాస్‌పరీక్ష నెంతబాగుగ జరిపినను దాని వ్రాసికొనువారు కారు. హరికిషన్‌లాల్‌గారి కేసులో మర్తబ్ ఆలి షా అను సబ్ యిన్స్పెక్టరు దీర్ఘమగు క్రాసుపరీక్షలో తానుమారైనను రికార్డున రెండుపఙ్క్తులే వ్రాయబడినది. క్రాసుపరీక్షలో ప్రశ్నలకు సరియైనజవాబులు అవసరములేదని న్యాయాధిపతులు హెచ్చరించిరి.......... ఈన్యాయస్థానముల నాయనుభవమును పట్టిచూడ హైకోర్టున నిష్పక్షపాతముగ తీర్పులచెప్పెడి న్యాయాధిపతులిచ్చట న్యాయమును మంటకలిపి న్యాయవాదుల కేలాటిసహాయమును చేయక ప్రాణమునకు మోసము కలిగినప్పుడుకూడ యెంతమాత్ర మౌచిత్యము పాటింపరైరి.........” ఈతీరున లాహోరుపౌరు లేలాటిదు


ష్కృత్యము చేయునప్పుడుకూడ అచ్చటినాయకులు అల్లరి లేకుండుటకు విశ్వప్రయత్నములు చేసినను అధికారులు నిరర్థకమగు సైనికప్రభుత్వమిచ్చట నెలకొల్పి ప్రజల మిక్కిలి కష్టపెట్టిరి. ఈవిషయమున మాకు తెలిసినంతవఱకు లాహోరున సైనికప్రభుత్వమున కవసరమే లేదనియు, మొదట అవసరమున్నను యింతకాలము రద్దుకాకయుండుటకు ఏలాటికారణము లేదనియు, ఈప్రభుత్వము నిరంకుశముగను అమానుషముగ నుండినదనియు, న్యాయస్థానములలో యన్యాయమే జరిగినదనియు మాయభిప్రాయమై యున్నది.

4. కాసూర్

ఇది లాహోర్మండలమున ముఖ్యపట్టణములలో నొకటి. ఇందలి జనసంఖ్య 24 వేలు. ఇచ్చట ఏప్రిల్ 6 దీని హరతాళము జరుగలేదు. గాంధిగారు పట్టుబడ్డసంగతియు, కిచ్‌లూ, సత్యపాలుగార్లు దేశభ్రష్టులైనసంగతియు 11 దీ మధ్యాహ్నము తెలియగానే హరతాళము ప్రారంభమాయెను. నాటిసాయంకాలము గొప్పసభలో న్యాయవాదు లుపన్యాసములు కావించిరి. అధికారు లెంత ప్రయత్నించినను నాయకుల యుపన్యాసములయందు రాజద్రోహము పుట్టించుభావ మేమియు కనుబడలేదు. మరునాడు మఱల సంపూర్ణమైన హరతాళము జరగెను. నాడు అమృతసరమునుండి యిచ్చటికి కొందరు వచ్చి అమృతసరవృత్తాంతములగూర్చి ముచ్చటించిరి. అందుమీద ప్రజలు కొందరు శాంతమునువీడి రైలుస్టేషనుకు వెళ్ళి దీపములున్నగదిని తగులబెట్టిరి. అదృష్టవశమున మంట చల్లారెను. అచ్చటిగుంపు సిగ్నల్ స్టేషనుకు వెళ్ళి యచ్చటికి యప్పుడు వచ్చినరైలున ప్రవేశించి సోడాబుడ్లను పగులగొట్టి బండిలోని యైరోపియన్లమీద పడిరి. తర్వాత బండిలోనున్న ఆంగ్లేయసైనికులు బండిదిగి యిద్దరు పరుగెత్తుటకు ప్రయత్నించిరి. గుంపు వారిమీదపడి వారిని కొట్టి చంపిరి. ఈనిరపరాధులను చంపి అచ్చటినుండి రివిన్యూ ఆఫీసులకు వెళ్ళి ట్టడముల తగులపెట్టిరి. అప్పటికి పోలీసువారు వచ్చి గుంపుపై కాల్చి ందున వారు వెళ్ళిరి. నాటిసాయంకాలమునకు ఏలాటిఅల్లరి లేకయుం

డెను. ఇట్లున్నను ఏప్రిల్ 16 దీని యీచోట సైనికప్రభుత్వము నెలకొల్పిరి.

ఇచ్చట జరిగిన దుర్ణయములకు లెక్కలేదు. వానిలో కొన్నిటిని యిందు తెలిపెదము. 16 దీని ప్రజల పట్టుకొనుటకు ప్రారంభించిరి. బాబా ధనపతిరాయి అను 65 యేండ్లు వయస్సుగల ప్లీడరును పట్టుకొని 46 రోజులు లాహోరున ఖైదిగాయుంచి విచారణలేకయే జూన్ 1 దీని వదలిపెట్టిరి. ఇటులనే 97 గురిని పట్టుకొని నెలలకొలది ఖైదీలుగానుంచి పిదప వదలిపెట్టిరి. మే ఒకటో తేదీని స్త్రీలు బిడ్డలు తప్ప తక్కినవారందరు రైలు స్టేషను వద్దకు హాజరు కావలసినదిగా యుత్తరువు చేయబడెను. నీ రచ్చటికి వెళ్లినతర్వాత ౮ గంటలవరకు అన్నము నీళ్లులేక పడవేసిపెట్టిరి. ఇచ్చట జరిగిన విచారణలయందు 40 మందికి కొరడాదెబ్బలశిక్ష విధించబడెను. చిన్నపిల్లవాండ్రనుకూడ యిట్లె కొట్టించిరి. ఈయూరియందే ఒకమారు కొరడాదెబ్బలు కొట్టుచుండగా చూచుటకు వేశ్యలను తీసికొని వచ్చియుండిరి. క్రొత్తతీరుశిక్షల కనిపెట్టుటలో ఈయూరియధికారు లందరిని మించియుండిరి. నిచ్చెనల వేసి కొందరిని ఎక్క దిగమని యాజ్ఞాపించిరి. కొందరి దేహములపై సున్నముకొట్టించిరి. ఆంగ్లేయులకు సలాముచేయని యెడల కొరడాదెబ్బలు తినవలెను. లేక వారు ముక్కులను నేలమీద రాచవలెను. నేరస్థులవిచారణ పూర్తియగుటకుముందే వారిని యురిందీయుటకు స్తంభములు కట్టించిరి. దేశీయపత్రికలు యిట్లు చేయకూడదని తీవ్రముగ వ్రాసినమీదట రహస్యప్రదేశములకు మార్చిరి. 18 మంగిని యురిదీసిరి. ప్రీవికౌన్సిలు తీర్మాన మగుపడుకు శిక్షల నిలపమని ఎంతవేడినను వైసరాయి యట్లుచేయలేదు కాని మోతీలాల్ నెహ్రూగారు తనడబ్బుపెట్టి సీమకు ఎన్నియో తంతెలిచ్చి మాంటాగ్యూద్వారా నిలుపుదల చేయించెను. ఈయూరియం దధికారము వహించియుండిన కర్నల్ మేక్రే చూపినంతటిదౌర్జన్యము మఱొకరు జరుపలేదు. హంటర్ సంఘ మెదుట సాక్ష్యమిచ్చుచున్నపుడు సెటిల్వాడ్గారి క్రాసుప్రశ్నలకు సరియైనజవాబు లివ్వకను, కొన్నిటికి జవాబు లియ్యననియు కొన్నిటికి గో



కాసూరున రాజద్రోహనేరము క్రింద పట్టుబడిన 11 ఏండ్ల బాలుడు

న్యాయ మాలోచించక యతనియిష్టానుసారము ప్రవర్తించెననియు ఆ పట్టణమంతయు రాజద్రోహులతో నిండియున్నట్లు విన్నాననియు యింకను ననేకములగు విచిత్రపుజవాబుల నిచ్చెను. విద్యార్థులలో కొందరిని కొరడాదెబ్బలు కొట్టించినవిషయములనుగూర్చి యీక్రిందిసంభాషణ జరిగెను:—

సెటిల్ వాడ్:—విద్యార్థులలో పెద్దవారగు 6 గురిని విడదీసి కొట్టించినావా?

మెక్రీ:—అవును.

సెటిల్:—పెద్దవారుగ నుండుటయే వారిదురదృష్టమా?

మెక్రీ:—నిశ్చయముగా నట్లే.

సెటిల్:—వారు పెద్దవారైనంతమాత్రమున వారు దెబ్బలు తినవలసివచ్చెనా?

మెక్రీ:—అవును.

సెటిల్:—అది న్యాయమైనయుత్తరవని నీయభిప్రాయమా?

మెక్రీ:—అప్పటికి యిప్పటికి న్యాయమైనదనియే తలచుచున్నాను.

ఈపట్టణమందు సైనికప్రభుత్వము నెలకొల్పవలసిన యవసరమే లేదనియు యిట్టిప్రభుత్వమును న్యాయవిరుద్ధముగ నములున పెట్టిరనియు మాయభిప్రాయము.

5. పట్టీకేంకరాను.


ఇచ్చటిప్రజలలో కొందరు రైలుస్టేషనున దొమ్మిచేసి తంతితీగలను కోసివేసిరి. ప్రజానాయకులు అల్లరి నాపుదలచేయుటలో సహాయము చేసిను చివరకు సైనికప్రభుత్వము నెలకొల్పబడి ప్రజలు విశేషబాధలు పడవలసివచ్చెను.

6. గుజరన్వాలా.

పంజాబున నిది యొకముఖ్యమండలము. ఈపట్టణమున 30 వేల జనసంఖ్య యుండుటవల్ల రణజిత్ సింగ్ గారి జన్మస్థాన మగుటచేతను ప్రాముఖ్యత వహించియున్నది. మార్చి 30 దీని యిచ్చట హరతాళము జరగ

లేదు. ఏప్రిల్ 4 దీని నాయకులు ఒకసభగావించి గాంధిసందేశప్రకారము హరతాళము జరపవలెనా యక్కఱలేదా యని చర్చగావించి ఏప్రిల్ 6 దీని జరప నిశ్చయించిరి. హరతాళము నాపుటకు అధికారు లెంతప్రయత్నించినను సంపూర్ణమైన హరతాళము జరగెను. పిమ్మట 12 దీవరకు నేమియు జరగలేదు. 12 దీని గాంధిగారు పట్టుబడ్డసంగతియు, సత్యపాల్ కిచ్‌లూగార్ల దేశభ్రష్టుల కావించినసంగతియు తెలిసినమీదట హరతాళము జరప నిశ్చయించుకొనిరి. ఏప్రిల్ 14 దీని సంపూర్ణమైన హరతాళము ప్రారంభమాయెను. ఒకపెయ్యనుజంపి రైలుకమ్ములమీద నెవరో పడవేసిరి. ఈ రోజుకుముందే పందిమాంసము మసీదున పడియున్నందున హిందూ మహమ్మదీయమైత్రికి భంగము కలిగించుటకై యధికారులు యీపనుల జేయించిరని ప్రజ లూహించిరి. వీరిమైత్రి యంతట వృద్ధియాయెను. ఇంతలో ప్రజ లనేకులు గుంపులుగూడి గురుకులమువద్దనున్న రైలువంతెనను దగులబెట్టిరి. దైవవశమున గురుకులయాశ్రమములోనివారు వెళ్ళి మంటను జల్లార్చిరి. ఈగుంపు రైలుస్టేషనవతలివైపునకు వెళ్ళి మరొక వంతెనను దగులబెట్టిరి. అచ్చట పోలీసు సూపరింటెండెంటు వీరిపై కాల్చిన మీదట గుంపులోనివారు చెదరి వెళ్ళిరి. ప్రజలలోని యల్లరిమూక యీపనులచేయుచుండ ప్రజాసామాన్యము మరొకవైపున సభచేయుచుండిరి. నాయకులు శాంతినిగూర్చి చక్కగా బోధపరచుచుండిరి. ఈగుంపు చీలగానే యిచ్చట చనిపోయినవారి పీనుగులను దెబ్బలు తగిలినవారిని యీసభజరుగుచున్నచోటికి తీసికొనివచ్చుటచే యిచ్చట శాంతముగ నున్నవారికి యుద్రేకము హెచ్చి యందరును కలసి వెళ్ళి క్రైస్తవాలయమును, పోస్టాఫీసును, తాశీల్దార్కచ్చేరిని, న్యాయస్థానములను, రైలుస్టేషనును యికను మరికొన్నిచోట్లను తగులపెట్టిరి. పోలీసువారీవిరోధముల చూచుచుండిరి. ఇంతలో కర్నల్ ఓబ్రయన్ యిచ్చటికి పంపబడెను. ఇతడిచ్చటివ్యవహారమును జూడగానే గవర్నమెంటు సెక్రటరితో టెలిఫోన్ ద్వారా మాట్లాడి తా నేమిచేసినను అధికారులు ఆటంకపరచకూడదను యుత్తరవును పుచ్చుకొనెను. ఇచ్చటియధికారులు దూడనుచంపుట కొఱద

గుజరన్వాలానాయకులను సంకెళ్లతో వీథులలో నూరేగింపుట.



1 పండిత దివాన్ చందు.
2 లాలా రాల్యారామ్.
3 లాలా హకీం రాయి.
4 లాలా అమరనాథ్.
5 దివాన్ మంగళసేన్.
6 సైనికోద్యోగి.

లగు పనులవల్ల ప్రజ లెంతయుద్రేకించినను ప్రజలు కావించిన దుష్కృత్యముల ఖండించి తీరవలెను. ఈఓబ్రయర్ సహాయము కోరగా మొట్టమొదట ఒకవాయువిమానము పంపబడెను. ఈవిమానము పట్టణముపై తిరుగుచు యూరిమీద బాంబుల ప్రయోగించ ప్రారంభించెను. ఊరివెలుపలనుండి ప్రజలు లోనికి వెళ్లుచుండగా వారిని త్తిన బాంబులు కొట్టిరి. ఈవిషయమున హంటర్ సంఘమెదుట నీక్రిందిసంభాషణ జరిగెను.

ప్రశ్న:—నీవు య్యూరిమీద తుపాకుల కాల్చుటచే దెబ్బలు పైవారికే గాక యిండ్లలో నెమ్మదిగ యున్నవారికికూడ తగులునుకదా ?

త్త:—దోషులను నిర్దోషులను విభజించుటకు నాకు అవకాశముండలేదు. దుష్కృత్యముల గావించినవారిని కాల్చుటయే నాపని అనుకొంటిని.

ప్రశ్న:—బాంబులు ప్రయోగించగానే యిండ్లలోపలికి పరుగెత్తిరి కదా ?

త్త:—అవును.

ప్రశ్న:—అట్లు వారిండ్లలోకి వెళ్లినమీదట నీకోరిక నెఱవేరినదికాదా ? మరల పెద్దమగతుపాకీని యెందుకు ప్రయోగించినావు ?

త్త:—అల్లరులు చేసినవారిమీదనే ప్రయోగించినాను.— అచ్చటనుండి ఈవిమానము మరొకయూరికి వెళ్లి యచ్చట బాంబుల ప్రయోగించుటచే ననేకులుచనిపోయిరి. ఈవిమానమునుండి ప్రజల కాల్చుటకు నేలాటియవసర ముండియుండలేదని మాయభిప్రాయము. కాల్చుటకు మొదలిడుటకుపూర్వమే యల్లరు లణగియుండెను. కాల్చుటయందుకూడ అధికారులు మనుష్యులప్రాణముల సరకు చేయరైరి. ఈవిమానములనుండి ప్రజలను కాల్చవలెననెడి యూహ మొట్టమొదట ఓడ్వయరుకే పుట్టెను. విమానముల చూడగనే ప్రజలు భయపడి వరుగెత్తుచుండగా నిరపరాధులైన వీరిని కాల్చుట మిక్కిలి శోచనీయము. ఏప్రిలు 15 దీని నాయకులను పట్టుకొనప్రారంభించిరి. హంటర్ సంఘమెదుట నిచ్చినసాక్ష్య

మును బట్టిచూడ నూరిలో గొప్పవారిని నిష్కారణముగ బట్టుకొని వారిబట్టలను తొడుగుకొనుటకుకూడ నవకాశమివ్వక జతలుజతలుగా సంకెళ్లు తగిలించి రెండుమైళ్లయూరిలో మండుయెండలో నడిపించిరి. వీరిని కప్పులేని రైలుపెట్టెలో నెక్కించి యాహారము నీళ్లు యిప్పించక నాయెండలో లాహోరునకు తీసికొని వెళ్ళిరి. వీరిలో నొకరగు గురుకులాశ్రమాధిపతి 63 సంవత్సరముల వయస్సుగల రాల్యారాంగారు యిట్లుచెప్పిరి.—"మాలో నొకరు దొడ్డికి వెళ్లవలెనని చెప్పగా యున్నచోటనే యాపని పూర్తిచేసుకొమని చెప్పిరి. నేను వృద్ధుడనైనందున బండిలోనుండి దిగుటకు శక్తిలేకయున్నప్పుడు నన్ను లాగి క్రిందపడవేసిరి."

మార్చి 16 దీని సైనికప్రభుత్వము నెలకొల్పబడెను. ఈసైనికాధికారి కావించిన యుత్తరవులు మిక్కిలి విచిత్రమైనవి.

మార్షల్‌లా 7 నెం ప్రకటన:—తెల్లవారిని చూడగనే యేదేశీయుడైనను గుఱ్ఱముమీదయున్నను, బండిమీదయున్నను తత్క్షణమే దిగవలెను. గొడుగును మూసి వెంటనే మర్యాదసలాం పెట్టవలెను.

ఈవుత్తరవు మీఱినవారికి కొరడాదెబ్బలశిక్ష విధించిరి. ప్రజానాయకులందరు వీధులలోని కాలువల తుడిపించవలెనని యుత్తరవు చేయబడెను. ప్రజలలో నెవరును కత్తి లుంచుకొనకూడదనియు, యూరివారెవరును రైలున ప్రయాణము చేయకూడదనియు, ఒకచోట నిద్దరుముగ్గురికన్న నిలిచియుండకూడదనియు మొదలగు యుత్తరవుల చేసిరి. అటుమీద బూటకపువిచారణలు ప్రారంభమాయెను. ఈవిచారణలలో జరిగిన యన్యాయమునుగూర్చి ముచ్చటించుట అవసరము. దివాన్ మంగళ్‌సేన్ గారిని పెట్టినబాధలు, అమారనాథ్ గారింటనుండి వెడలగొట్టినదియు, ఏవిచారణలేక యే యనేకులపట్టుకొని ఖైదిన యుంచినదియు నాలోచించి చూడగా నీయాంగ్లేయప్రభుత్వమువారు ప్రజలవిషయమున కావలెనని చూపిన క్రౌర్యమును యెవరును మఱవచాలరని తోచుచున్నది.

7. వజీరాబాగ్.

వజీరాబాగు గుజరన్‌వాలాకు 20 మైళ్లదూరమున యుండు చిన్నపట్టణము. ఇందలి జనసంఖ్య 10 వేలు. సంవత్సరాదినాడు సంతజరుగును. కావున ప్రజలు విశేషముగ నిచ్చట యుండిరి. మార్చి 30 దీనిగాని ఏప్రిలు 6 దీనిగాని హరతాళ మిచ్చట జరుగలేదు. బైటియూళ్ళనుండి వచ్చిన ప్రజలు హరతాళము జరపనందుకు యూరివారిని యాక్షేపించుచు బహిష్కరించెదమని భయపెట్టిరి. అటుమీద యూరివారు సభగావించి 15 దీని హరతాళము జరప నిశ్చయించుకొనిరి. ప్రజలలో దుర్మార్గులు కొందరు హరతాళముతోఁ దృప్తిజెందక తంతెతీగలనుకోసి రైలుకమ్ముల పెఱికివేసిరి. అచ్చటనుండి పాదిరిబైలీయింటివద్దకు వెళ్ళి ఇంటిని తగులబెట్టిరిగాని ప్రాణాపాయము జరుగలేదు. వెంటనే కర్నల్ ఓబ్రయన్ కొంత సైన్యముతో యిచ్చటికివచ్చి ప్రజలలో కొందరిని పట్టుకొని గుజరన్‌వాలాలో గావించినకృత్యము లన్నిటిని ఇచ్చటను కావించెను. 18 దీని నాయకులను బిలిపించి యొకదర్బారుచేసెను. ఈతీరున వారితో చెప్పెను. "మీకందరికి వెఱ్ఱియెత్తినట్లున్నది. ఇందుకు మందు కనిపెట్టినాను. మాకు మీఆస్తిని నూడబెఱుకుటకును మీయిండ్ల నేలచదరము చేయుటకును తగులపెట్టుటకును అధికారము గలదు. ఈయధికారమువల్లనే మొట్టమొదట జమాల్‌సింగ్‌బగ్గా యాస్తిని స్వాధీనపరచుకొంటిని." మరునా డిచ్చట సైనికప్రభుత్వము నెలకొల్పిరి. ఆమీద జరిగిన దుర్ణయములగూర్చి చెప్పుట యనవసరము. ఈతీరుననే నైజమాబాద్, అకల్గర్, రామనగరు, హాపీజాబాదు, సాంగ్లా, మోమాన్, మనియన్‌వాలా, నవాన్‌పిండ్, చుహార్ఖానా, షెక్పుర, లైల్లాపూరు, గుజరాత్, జలాల్పూరుజటాన్, మలక్వాల్ మొదలగుయూళ్లలో సైనికప్రభుత్వమువారు కావించిన దుష్కృత్యములు యన్యాయపుతీర్పులు ప్రజల క్షోభబెట్టుట మొదలగువానిగూర్చి వ్రాయుట యనవసరము. అన్నిచోట్లలోను యెంతక్రూరముగ ప్రవర్తించవీలగునో నంతక్రూరముగ ప్రవర్తించిరి.

ఆఱవ ప్రకరణము.

కాంగ్రెస్‌కమిటీవారిసిద్ధాంతములు.

ఇదివఱకు మేము చెప్పినవిషయములన్నియు మిక్కిలి జాగ్రత్తతో మేము పుచ్చుకొన్న వాఙ్మూలములమీదను హంటరుకమిటీవారు పుచ్చుకొన్న వాఙ్మూలములమీదను ఆధారపడియున్నవి. కొన్ని పరుషవాక్యములను ప్రయోగించినను ఇందుకు అవసరము లేకపోలేదు. నూతనసంస్కరణముల జయప్రదము గావించవలెనన్న నధికారులు ప్రజలు పూర్వవృత్తాంతముల మఱచునట్లు చేయవలసినది విధియైయున్నది. కావున మేమిప్పుడు పొరబాట్లు కావించిన నధికారుల దండించవలెనని చెప్పుచున్నాము. శ్రీగాంధిగారిని పట్టుకొనక యున్నను కిచ్‌లూ, సత్యపాలుగార్లను దేశభ్రష్టుల కావించకయుండియున్నను పంజాబున నేలాటియల్లరి జరిగియుండదనియు ఐరోపియన్లను చంపియుండరనియు మాదృఢాభిప్రాయమైయున్నది. పంజాబధికారులచర్య మఱింతయుద్రేకము కలిగించెను.

ఇప్పటిదనక రాజప్రతినిధియగు వైసరాయి ఛంస్‌ఫర్డునుగూర్చి యేమియు చెప్పలేదు. సామ్రాజ్యప్రభుత్వమువారివిషయమున చూపిన అశ్రద్ధనుగూర్చి చెప్పకతప్పదు. రాజప్రతినిధి ప్రజాపక్షవాదము నాలోచించలేదు. దేశీయులలో ప్రముఖులును, ప్రజాసంఘములును పంపిన వార్తలను గూర్చిగాని సందేశములను గూర్చిగాని యాలోచించలేదు. ఏవిచారణచేయకనే పంజాబధికారులు చేసినదంతయు న్యాయమని భావించెను. అధికారులేమిచేసినను పరిహారము కావించెదనని మొదట సూచించెను. అన్నియంశములు తెలిసినమీదకూడ జలియన్‌వాలా ఘోరకృత్యములనుకూడ దాచెను. ఆండ్రూస్ అంతటి క్రైస్తవమహానీయుని పంజాబునకు వెళ్లకూడదని యుత్తరవుచేసెను. రాష్ట్రకార్యదర్శియగు తాంసన్ శ్రీ పండితమాళవ్యగారిని దూషించుచు అసత్యమాడినపుడుకూడ రాజప్రతినిధి యూరకుండెను. మరణదండన జెందినవారిశిక్షల అపీలు తీర్మానమగువఱకు ఆపమని యెంతప్రార్థించినను ఆపక తనక్రూరహృ-

దయమును వెల్లడించెను. పంజాబున జరిగిన క్రూరకృత్యముల నెల్లడించుటకై యెంతోకష్టముమీద శ్రీ మాళవ్యగారు సంవాదించి యడిగిన ప్రశ్నలకు బదులుచెప్పక నివి శాంతికి భంగము కల్పించుననెను.

దీనింబట్టిచూడ ఛంస్‌ఫర్డు కావలెనని ప్రజలపట్ల నిరాదరణజూపెనని చెప్పుటకు వీలులేకపోయినను రాజప్రతినిధిపదవిని అధిష్ఠించుట కనర్హుడని చెప్పకతప్పదు. గనుక తక్షణమే ఇతనిపనినుండి తొలగింపవలెనని మాతీర్మానము. ఇతరులవిషయమై మాతీర్పులక్రింద సంగ్రహించుచున్నాము.

1. ఓడ్వయర్ (పంజాబురాష్ట్రాధిపతి) విద్యాధికుల నగౌరవపరచుటవల్లను, యుద్ధసమయమున ద్రవ్యము మనుష్యుల పోగుచేయుటలో గావించిన దుష్ప్రవర్తనవల్లను, ప్రజాభిప్రాయమును పాటించనందువల్లను, యుతరరాష్ట్రజాతీయపత్రికల నిషేధించుటవల్లను పంజాబుప్రజల యాగ్రహమునకు పాత్రుడాయెను. 2. రౌలటుశాసనము ప్రజాశాంతికి భంగము కావించెను. ఓడ్వయరు పంజాబున ప్రజలయుద్యమముల నణగద్రొక్కుటకు దేశసంరక్షణశాసనము నుపయోగించుటచే పంజాబున మఱింతయల్లరి ప్రారంభమాయెను. 3. సత్యాగ్రహయుద్యమము, హరతాళములను దేశీయులదేశభక్తిని వృద్ధిజేసినను ప్రజల దురాగ్రహమును చాలవఱకు తగ్గించి యల్లరులులేక చేయుటకు కారణభూతమాయెను. 4. రౌలట్టు ఆందోళనము ఆంగ్లేయులయెడ ద్వేషభావముతో ప్రారంభించలేదు. 5. పంజాబుప్రభుత్వమును తుదముట్టించుటకు కుట్రలేమియు జరగలేదు. 6. గాంధినిపట్టుకొనుట, కిచ్‌లూ సత్యపాల్గార్లను దేశమునుండి వెడలగొట్టుట యివి న్యాయమైనపనులు కావు. అల్లరికి యివియె ముఖ్యకారణములాయెను. 7. అమృతసరము అల్లరికి కారణము వంతెనవద్ద కాల్చుటయే. 8. అధికారు లెంతతప్పుచేసినను ప్రజలదుష్కృత్యములు ఖండించతగినవేను. 9. సైనికప్రభుత్వము నెలకొల్పుట కవసరమే యుండియుండలేదు. 10. ప్రతిచోటను సైనికప్రభుత్వమునకు ముందే యల్లరులు లేకయుండెను. 11. కారణాంతరములవల్ల సైనికప్రభుత్వమున కవసరమున్నదని యనుకొన్నను, అంతకాలము అమలున యుంచు అవసర

ము కనబడదు. 12. సైనికప్రభుత్వమువారి కృత్యములు అనవసరమును క్రూరమును ప్రజల క్షోభపెట్టునవియై యుండెను. 13. లాహూరు, అకల్ఘర్, రాంనగర్, గుజరాత్, జలాల్‌పూరు జట్టాం, షైలపూరు, షేకూర్‌పురాపట్టణములలో యల్లరి యంతగలేదు. 14. జలియన్‌వాలాబాగున జరిగిన హత్యలు రాక్షసకృత్యములు. ఆంగ్లప్రభుత్వమున యిట్టిదెన్నడు జరగలేదు 15. సైనికప్రభుత్వము న్యాయస్థానములలో న్యాయ మెంత మాత్రము జరగలేదు. 16. మనుష్యుల ప్రాకించుట మొదలగు శిక్షలు యీనాగరికప్రభుత్వమున జరగతగినవి కావు. 17. అనేకచోట్ల బలవంతముగ భటుల నిర్మించుట, జరిమానాలు వేయుట మిక్కిలి యన్యాయమైన పనులని మాయభిప్రాయము. 18. ఈసైనికప్రభుత్వమున నధికారులు విశేషముగ లంచముపుచ్చుకొనిరి. 19. చేసినతప్పుల నవరించుటకును యికముం దిట్టిఘోరకృత్యముల జరగకయుండుటకును యీక్రిందిపనులు చేసికావలెను.

౧. రౌలట్ చట్టము రద్దుకావలెను. ౨. ఓడ్వయరును తక్షణమే పదభ్రష్టుని చేయవలెను. 3. డయరుసేనానిని, కర్నల్ జాన్‌సన్‌నును, ఓబ్రయన్ను, బాస్‌వర్తుస్మిత్తును, శ్రీరాంసుద్దును, మలీకుసాహేబుఖానును అధికారములనుండి వెళ్లగొట్టవలెను. ౪. చిల్లరయుద్యోగస్థుల దుష్కృత్యముల విచారించి రుజువైనప్పుడు పనులనుండి తొలగించవలెను ౫ రాజప్రతినిధిగారిని పదవినివదలి సీనుకురమ్మని యాజ్ఞాపించవలెను. ౬. సైనికప్రభుత్వమువారి న్యాయస్థానములు విధించిన జరీమానాలు ప్రజల కిప్పించవలెను.

పై జెప్పినయధికారులు న్యాయస్థానములలో శిక్షింపబడవలెనని మాయభిప్రాయమైనను యీహక్కును వదలివేసినచో దేశమునకు గౌరవమని తలచి వారిని పదవులలోనుండి తొలగించిన చాలునని తలచితిమి

యం. కే. గాంధి,
సీ. ఆర్. దాస్,
అబ్బాస్. యస్. తయాబ్జీ,
యం. ఆర్. జయాకర్.

దేశీయ మహాసభ.

హిందూదేశములోనిస్థితిగతులను, ఇండియాప్రభుత్వవిషయమై ప్రజల అభిప్రాయములను, ఇండియాప్రభుత్వమువారికిని ఇంగ్లాండులోని పార్లమెంటుసభవారికిని దెలియఁజేయుట ఆవశ్యకమని సుమారు ౩౫ సంవత్సరములనాఁడు మననాయకులు కొందఱు గ్రహించి ఈ హిందూదేశీయమహాసభను నిర్మించిరి. దీనిని నిర్మించినవారిలో శ్రీ ఏ. ఓ. హ్యూమ్, శ్రీ దాదాభాయినౌరోజీ, సుప్రసిద్ధన్యాయమూర్తి పదవి నలంకరించియుండిన శ్రీ యస్. సుబ్రహ్మణ్యఅయ్యర్, శ్రీ పి. రంగయ్యనాయుడుగారు, శ్రీ పనప్పాకం. అనంతాచార్యులు, శ్రీ సేలము విజయరాఘవాచార్యులు, శ్రీ లోకమాన్య బాలగంగాధరతిలక్ గారు, శ్రీ పండిత మదనమోహన మాలవ్యాగారు, హిందూపత్రికాధిపతులైయుండిన శ్రీ జి. సుబ్రహ్మణ్య అయ్యర్ మొదలగువారు ప్రముఖులని తెలియవలయును.

ఈసభను నిర్మించినపుడు సర్కారుద్యోగస్థులలో ననేకులును, నాంగ్లేయులలోఁ గొందఱును కొంత ఆదరణఁ జూపిరి. పిదప కొంతకాలమునకు ప్రజాభిప్రాయములకును ఇండియాప్రభుత్వవర్గమువారి యభిప్రాయములకును, భేదములుగలిగి హిందూదేశీయమహాసభవిషయమున నిచ్చటి ఇండియాప్రభుత్వవర్గమును ఆంగ్లేయపత్రికలును నిరాదరణను జూపుటకు ప్రారంభించినవి. ప్రజలు రానురాను వారిమనోభీష్టములను జంకక వెలిఁబుచ్చుటకుఁ బ్రారంభించిరి. ప్రతిసంవత్సరమును డిసంబరునెలాఖరున ఈమహాసభ ఏదియో యొక గొప్పపట్టణమున గూడుచున్నది. అన్ని ప్రదేశములనుండి ప్రజలచే నెన్నుకోఁబడిన ప్రముఖులగు ప్రతినిధులు ప్రజలు ఈసభకువచ్చి వారివారియభిప్రాయములను సంప్రతించుకొని దేశాభ్యుదయమునకు వలయువిషయములఁ గూర్చి తీర్మానములను గావించుచు వచ్చుచున్నారు.

మొదట మహమ్మదీయు లీసభలో విశేషము చేరకపోయినను ఇటీవల వారు తాము పొరబడినామని గ్రహించి హిందువులతోగలిసి పాటు

పడుచున్నారు. ప్రారంభదశలోకూడా శ్రీ ధయాబ్జీవంటి మహనీయులు అధ్యక్షపదవినిసైతము వహించియున్నారు.

దేశీయమహాసభతరఫున ఇంగ్లాండున బ్రిటిష్‌కాంగ్రెస్ కమిటీ యొకటి ఏర్పడి పనిచేయుచున్నది. ఈమహాసభవారి యుద్దేశములను ఇంగ్లాండున ప్రచురింపఁజేయుటకై "ఇండియా" యనుపత్రిక ప్రకటన గావింపఁబడుచున్నది. ఈకమిటీద్వారా మనదేశమునకు హ్యూమ్, వెడ్డర్‌బరన్ మొదలగువా రనేకులు నిరంతరకృషిచే మహోపకారము గావించియున్నారు.

ఈమహాసభ ఇప్పటికి చెన్నపురిలో 5 మార్లు సమావేశమైయున్నది. 1906-వ సంవత్సరమువరకు ఈమహాసభ, భూమిమీఁదపన్ను, ఉప్పుమీఁదిపన్ను, అడవులపై పన్నులు; భారతీయులకు దొరతనపు ఉద్యోగీయవర్గములో గొప్పఅధికారముల నియ్యవలయుననియు, భారతీయులను ఐరోపీయనులతో సమానముగఁ జూడవలయుననియు మొదలగు ననేకవిషయములనుగూర్చి తీర్మానములనుగావించి ఇండియాగవర్నమెంటువారికిని, పార్లమెంటువారికిని తెలియఁజేసియున్నారు. దేశీయమహాసభ గావించిన ఈకృషివలన మనవారికి కొన్ని గొప్పపదవులు లభించినవి. రాజ్యాంగసంస్కరణము లప్పుడప్పుడు గావింపఁబడి శ్రీ సిన్హాప్రభువుగారికీమధ్య గవర్నరుద్యోగముకూడా లభించినది. ఇందుకు దేశీయమహాసభవారికృషియే ముఖ్యకారణము. దేశమంతట పాఠశాల లేర్పడుట, తాలూకా జిల్లాబోర్డులలో మనవారు (ప్రజలు) ప్రతినిధులగుట, ఈబోర్డులకు ప్రజలలో ముఖ్యులే ప్రెసిడెంట్లుఅగుట, అన్నిటికిని దేశీయమహాసభవారి ప్రయత్నమే ప్రధానకారణము.

బహుకాలముగ నేటేట గూడుచుండు ఈమహాసభకు ఇంతకన్న గొప్ప ఆదర్శములుండవలయునని శ్రీ బాలగంగాధరతిలకు, శ్రీ లాలాలజపతిరాయి, శ్రీ విపినచంద్రపాలు మొదలగు జాతీయవాదులకుఁ దోఁచినది. అందుచే 1906-వ సం॥న కలకత్తాలో జరిగిన దేశీయసభకు శ్రీ దాదాభాయినౌరోజీగారు అగ్రాసనాధిపత్యమును వహించి, స్వదేశి, ఇతరదేశ

వస్తువుల బహిష్కారము, స్వరాజ్యము, జాతీయవిద్య, ఇవియే ఆదర్శములుగ నుండవలయునని తీర్మానింపఁబడినది.

పై తీర్మానములను ఆచరణకు తెచ్చువారు జాతీయవాదులని తేలినది. వీనిని ఆమోదించనివారు మితవాదులని ఏర్పడినది. మితవాదులు జాతీయవాదుల ప్రయత్నములకు విఘాతము కల్పించినందున 1907-వ సం॥ మొదలు 1915-వ సం॥ వరకు దేశీయమహాసభ దొరతనపువారికి అర్జీలు పెట్టుకొనుటతప్ప నింకేమియుఁ జేయలేకపోయెను. 1908-వ సంవత్సరమున శ్రీ తిలక్ మహారాజాగారు కారాగృహమున కంపఁబడిరి. వీరేగాక జాతీయవాదు లనేకులు అధికారవర్గమువారిచే ననేకకష్టములకు పాత్రులైరి. దేశక్షేమార్థము జాతీయవాదులుపడిన శ్రమ వ్యర్థముకాలేదు.

1916సం॥న లక్నోకాంగ్రెస్సులో మితవాదులును జాతీయవాదులును ఒకటైరి. 1918-వసం॥ రాజ్యాంగసంస్కరణప్రయత్నములు ప్రారంభముకాఁగానే దేశీయమహాసభయందు మరల కక్షలు ప్రబలినవి. మాంటాగ్యూ యిచ్చటికివచ్చినపుడు మితవాదులు దేశీయమహాసభనువదలి తాము ప్రత్యేకముగ మితవాదులసంఘము నొకదానిని నిర్మించుకొనిరి. ఇది జరిగినపిదప దేశీయమహాసభకు వేలసంఖ్యలుగా ప్రతినిధులు వచ్చుటకు ప్రారంభించి, రానురాను ఈమహాసభ వృద్ధియగుచున్నది.

1919-వ సంవత్సరాంతమున ఈమహాసభ అమృతసరమున సమావేశమాయెను. అప్పటికి పంజాబున అల్లరులు అణగినవి. సైనికప్రభుత్వమున శిక్షలుచెందిన దేశీయనాయకులను అప్పుడే వదలిపెట్టుటచే వారు దేశీయమహాసభకు వచ్చుటకు అవకాశము కలిగెను. ఇందుకుతోడు సంస్కరణప్రణాళికను యింగ్లాండున పార్లమెంటువారు ప్రకటించుటచే చక్రవర్తిగారు సంస్కరణము లములునపెట్టుసందర్భమున ఒకసందేశమును పంపిరి. పంజాబున ఘోరకృత్యములు జరిగియున్నను పై రెండుకారణములచే నీమహాసభకు వచ్చినప్రతినిధు లనేకులు ఆంగ్లేయులప్రభుత్వమున గౌరవమును వదలక పంజాబున దుర్నయములు గావించిన యధికారులను తగునట్లు శిక్షింతురని యభిప్రాయపడిరి. సంస్కరణచట్టమును సయితము

అసంతృప్తికరమనియు యాశాభంగము కలిగించెననియు ననేకులు యభిప్రాయపడినను సంస్కరణముల నమలులోనికి తెచ్చుట కందరును సహాయపడవలసినదిగా తీర్మానములు కావింపబడెను. శ్రీ గాంధిగారుకూడా యీ యభిప్రాయమునే వెలిబుచ్చిరి. అమృతసరవుతీర్మానము లెవ్వియనిన:—

1. భారతీయులు బాధ్యతాయుత (జబాబుదారీ) ప్రభుత్వమునకు యిప్పుడే అర్హులని డిల్లీకాంగ్రెసులో కావించినప్రకటనను మఱల ప్రకటించుచున్నాము. ఇందుకు విరుద్ధమైనవాదమును యీమహాసభవా రంగీకరింపరు.

2. రాజకీయసంస్కరణలవిషయమై డిల్లీకాంగ్రెసుతీర్మానమునే యీసభవా రామోదించుచున్నారు. సంస్కరణచట్టము ప్రజలయాశయముల దృప్తిపొందింపజాలదనియు యాశాభంగకరముగ నున్నదనియు యసంపూర్తిగ నున్నదనియు యీమహాసభవారభిప్రాయపడుచున్నారు.

3. స్వయంనిర్ణయసూత్రము ననుసరించి భారతీయులకు వెంటనే బాధ్యతాయుతప్రభుత్వ మొసంగవలెనని యీసభవారు కోరుచున్నారు.

4. సాధ్యమైనంతమట్టుకు యీసంస్కరణములు జయవంతముగా కొనసాగుటకు ప్రజలు కృషిసలుపుదురని యీసభవారు నమ్ముచున్నారు. వీనికై కృషిచేసిన శ్రీమాంటాగ్యూగారికి (ఇండియామంత్రి) సభవారు వందనము లాచరించుచున్నారు.

పై తీర్మానములను శిరసావహించువారే కాంగ్రెసకక్షివారని ఎఱుంగవలయును. వినోదార్థము కాంగ్రెస్సునకు వచ్చుమితవాదులు కాంగ్రెస్సుకక్షివారని తలచుట పొరబాటు. వీరు హెచ్చుసంఖ్యాకులయభిప్రాయమునకు బద్ధులుగాక స్వార్థమునకై పాటుబడువారు. ఈమధ్య శ్రీ తెజ్ బహదర్ సప్రూ, శ్రీ. బి. యన్. శర్మ మొదలగువారికి గొప్పయుద్యోగములు లభించుట యిందుకు నిదర్శనము. మితవాదులలో చాలమందికి పదవులపై దృష్టియున్నది. మనుష్యులసామాన్యహక్కుల స్థిరపరచుచట్టము నేర్పాటుచేయుమని జాతీయవాదులు కోరినపుడు మితవాదు లక్కరలేదనిరి. సక్రమాందోళనమునకై సమావేశమైన వందలకొలది ప్రజలను పం

జాబున నధికారవర్గమువారు నిష్కారణముగ జంపించి సైనికప్రభుత్వమును నిర్మించినసంగతి తెలిసియేయున్నది. మనరాష్ట్రమునకూడా నిట్టిదిజరగవచ్చును. ఇట్లు జరగకుండుటకు కాంగ్రెస్‌సభవారు ప్రయత్నము చేయుచున్నప్పుడు మితవాదులు తోడ్పడినవారు కారు.

సహాయనిరాకరణము.

కలకత్తా, నాగపూర్ దేశీయమహాసభలు.

అమృతసరవుమహాసభ తర్వాత క్రమక్రమముగా దేశమున ప్రజల యభిప్రాయములును నాయకులయభిప్రాయములును మార్పుచెందుచు వచ్చెను. దీనికి ముఖ్యకారణము లెవ్వియనిన:—1. కిలాఫత్ విషయమున ఇండియాప్రభుత్వమువారును పార్లమెంటువారును తమధర్మమును నెరవేర్పక యుండినందునను ప్రధానమంత్రి తనమాటప్రకారము ప్రవర్తించకపోవుటచేతను మహమ్మదీయసోదరులకు కలిగిన ధర్మలోపమును దొలగించుటకు మహమ్మదీయేతరులందరును తోడ్పడవలసినవిధియే మొదటికారణము. కడచినసంవత్సరము నిరపరాధులగు పంజాబుప్రజలను సంరక్షించుటయందును క్రౌర్యకృత్యములఁ జేసినవారిని శిక్షించుటయందును ఇండియాప్రభుత్వమువారును బ్రిటిష్‌ప్రభుత్వమువారును తమకర్తవ్యము నిర్వహింపక ప్రజల దుర్గతికి కారకుడైన ఓడ్వయరును శిక్షింపకపోవుటచేతను ప్రజలకు నధికారులయెడ భక్తివిశ్వాసములు సంపూర్ణముగ నశించెను. ఇందుకుతోడు పార్లమెంటున జరిగిన చర్చలో భారతీయులపై దయచూపకపోవుటయేగాక పంజాబున కావింపబడ్డ దౌర్జన్యపద్ధతుల నామోదించిరి. మఱియు కిలాఫత్ పంజాబువ్యవహారములగూర్చి (వైసరాయి) రాజప్రతినిధి యిటీవల కావించినయుపన్యాసమున యెట్టిసానుభూతియు చూపలేదు. ఈయక్రమములవిషయమై న్యాయము జరగనిది భరతఖండమున సంతృప్తిగాని శాంతిగాని యుండదని ప్రజలు పూర్ణముగ నమ్మి యిట్టి దురాగతములు ముందు జరగకుండుటకును దేశగౌరవమును కాపాడుటకు

స్వరాజ్యస్థాపనమే ఫలప్రదమైన సాధనమని ప్రజలందరును తలచిరి. ఈగమ్యస్థానము చేరుటకు ప్రాతమార్గములన్నియు నిష్ఫలములగుటను చూచి క్రొత్తమార్గము నేదియైనఁ ద్రొక్కుటకు నుద్యుక్తులైరి. ఇట్టితరుణమున శ్రీగాంధిగారు తనసహాయనిరాకరణోద్యమమునుఁ బైకితెచ్చెను.

లోకమునందు నేప్రభుత్వమైనను ప్రజలసమ్మతిపై యాధారపడవలసియున్నది. ఎట్టిపశుబలపూరితమైన యధికారవర్గముగాని విశేషకాలము ప్రజల నణచిపెట్టచాలదు. ప్రభుత్వమునకు ప్రజలు సహాయమొనర్చువఱకే యది సక్రమముగ జరుగును. ప్రభుత్వమువారు ధర్మమార్గము ననుసరించి ప్రభుత్వము జరుపునంతవఱకు ప్రజలు వారికి తోడ్పడుట ధర్మమై యున్నది. కాని ప్రభుత్వమువారు ధర్మమార్గమును వదలినపుడు ప్రజలుకూడా తోడ్పడుటకు మానవలెను. అట్లు మానకుండిన అధర్మమున తామును పాల్గొన్నవారగుదురు. తోడ్పాటు మానినయెడల కొంతకాలమునకైనను ప్రభుత్వమువారు వారి తప్పిదమును గ్రహించి మరల ధర్మమార్గము నవలంబించుటకు యవకాశముండును. ఇదియే సహాయనిరాకరణము. దీని జయప్రదముగ నడపవలెనన్న శాంతియే తగినమార్గమని గాంధిమహాత్ము డుద్ఘోషించుచున్నాడు. పశుబలము నెదుర్కొనుటకు పశుబలము నుపయోగించకూడదని వారివాదము. పశుబలము నాత్మబలమువలనను, అధర్మము సుధర్మమువల్లను, అసత్యమును సత్యమువల్లను జయింపవలెను. ఈపద్ధతిని జయమొందుటకు భారతభూమియే తగినప్రదేశమని వీరు తలచుచున్నారు. ప్రభుత్వముపై పశుబలము నుపయోగించుటకు సంసిద్ధులై యుండిన షౌకతాలీప్రభృతులనుకూడ తనసాత్త్వికమార్గమునకుఁ ద్రిప్పగల్గెను. ప్రజలలో నాత్మబలము, త్యాగము ధర్మచింత వృద్ధికావలెను. దేశమునకై సర్వస్వమును దారపోయునంతటి స్వార్థత్యాగులు బయలువెడలవలెను. అధికారులతో నేలాటిసంబంధములేక ప్రజలందరును ప్రతికార్యమును తమంతట తామె నిర్వర్తించుకొనవలెను. ఇప్పుడన్ననో మనము ప్రతివిషయమునను సర్కారునకు తోడ్పడుచున్నారము. వారు సా

పించిన పాఠశాలలకు మనబాలుర నంపి వారివిద్యను గడించుచున్నాము. వారిన్యాయస్థానములలో మనము న్యాయవాదులుగా పనుల చేయుచున్నాము, మనవాదముల పరిష్కరించుకొనుచున్నాము. మనము పన్నుల నిచ్చి వారియధికారము సాగుట కుపకారములు కలిగించుచున్నాము. ఇట్టితోడ్పాటు మన మొసంగనియెడల ప్రభుత్వము జరగగలదా? ఈతోడ్పాటు మానుటయే సహాయనిరాకరణమార్గము నవలంబించుట యగును.

ఒక్కమారే ప్రజలందరును యన్నివిధములైన తోడ్పాటు మానుట యసంభవము. ఈవిషయమును గాంధిగారు గ్రహించియే పూర్ణముగ సహాయనిరాకరణ మవలంబించుటకు కొన్ని సోపానముల నేర్పరచిరి. మొదటిసోపానమున ప్రజలు శాంతియుతముగను జయప్రదముగను నిర్వహించి ముందంజవేయుటకు పూర్తిగ సిద్ధపడియున్నగాని అట్లు చేయకూడదని హెచ్చరించియున్నారు. మొదటి దేమన:—

సర్కారువారుయిచ్చిన బిరుదములను, గౌరవోద్యోగములను తక్షణమే వదలవలెను. న్యాయవాదులు సర్కారున్యాయస్థానముల వదలిపెట్టి దేశసేవకైనను లేక పంచాయితీకోర్టుల స్థాపనకైనను పాటుబడవలెను. మనబాలురను సర్కారుసంబంధమున్న పాఠశాలలలోనుండి తొలగించి జాతీయపాఠశాలలనెలకొల్పి యందు వీరినిచేర్పవలెను. సంస్కరణచట్టమనుసరించి నెలకొల్పబడబోవు శాసనసభలకున్నభ్యంతరములుగా యుండకూడదు. ప్రజలు (ఓట్లు) సమ్మతుల నివ్వకూడదు.

రెండవదేమన:—సర్కారునౌకరులు తమయుద్యోగముల వదలవలెను. మూడవదేమన:—పోలీసువారును సైనికోద్యోగులును వారి వృత్తుల మానవలెను. నాల్గవదేమన:—ప్రజలందరును పన్నులనిచ్చుట మానవలెను. ఈయుద్యమము సర్వోత్కృష్టమైనదని జాతీయవాదులందరు యొప్పుకొన్నను ఈసోపానములు సరియైనవి కావని యనేకులు వాదించిరి. మితవాదులు కార్యక్రమము కొనసాగదనియు దేశమున నల్లరి పుట్టుననియు యుద్యమమే న్యాయవిరుద్ధమైనదనికూడా వాదించిరి. ఉద్యమము మంచిదైనను ప్రజలు సంసిద్ధులుకారనిమఱికొందరియభిప్రాయము.

ఇఁగ్లండులో యెన్నియోవిధముల వాదించినను గాంధిగారు వారిసంకల్పమును మానక దేశమును దరిజేర్చుటకు మఱొకమార్గము లేదని ఘంటాపథముగ వాదించెను. క్రమక్రమముగా ఈమహోద్యమతత్వము ప్రజల మనంబుల నాకర్షింపఁజొచ్చెను. దేశమందంతటను బహిరంగసభలు కావింపబడి ఈయుద్యమమును పెంపొందించవలెననెడి తీర్మానములు చేయబడెను. దేశమునందలి యన్నిరాష్ట్రములవారి యభిప్రాయముల కేంద్రీకరించుటకై అవసరదేశీయమహాసభ కలకత్తాలో సెప్టెంబరు 4 దీని సమావేశమాయెను. ఈమహాసభకు సుప్రసిద్ధదేశభక్తులగు శ్రీలాలాలజపతిరాయి యధ్యక్షతవహించిరి. ఈమహాసభయందు సహాయనిరాకరణవిషయమై విశేషముగ వాదప్రతివాదములు జరగెను. తుదకు గాంధిగారి యభిప్రాయానుసారముగ దేశమంతట సహాయనిరాకరణ మవలంబించునట్లే యధికసంఖ్యాకులచే తీర్మానింపబడెను. గాంధిగారి సోపానములకును మహాసభవారి తీర్మానములకును కొంతిభేదమున్నందుచే తీర్మానములలోని ముఖ్యాంశముల నిం దుదాహరించుచున్నాను.

"పంజాబు, కిలాఫత్ అక్రమముల నివారించుటకును స్వరాజ్యమును స్థాపించుటకును దౌర్జన్యరహితమై క్రమానుగతమైన సహాయనిరాకరణము పూనుకొనుట తప్ప భారతీయులకు మరొకమార్గము లేదని దేశీయమహాసభవా రభిప్రాయపడుచున్నారు.

ఇంతవరకు ప్రజాభిప్రాయమును తెలియబరచుచున్నది. పైతరగతులవారగుటచేతను ప్రభుత్వమువారు తమ అధికారమును బలపరచుకొనుటకు బిరుదములను పాఠశాలలను, శాసనసభలను ఉపయోగించుటచేతను ఈయుద్యమమును నిర్వహించుటలో నష్టములను సాధ్యమైనంత తగ్గించుటకును, కోరినదానిపొందుటకు కొంతత్యాగమునైన చేయుట అవసరమగుటంజేసి ఈక్రిందిపద్ధతుల నవలంబించవలసినదని మనఃపూర్వకముగ నివేదించుచున్నారు.

1. బిరుదములను, గౌరవోద్యోగములను వదలుదు; మునిసిపాలటీలలోను తాలూకాజిల్లాబోర్డులలోను ప్రభుత్వమువారు నియమించిన స్థానములను వదలివేయుదు.

2. ప్రభుత్వమువారిదర్బారులకును, విందులకును ఉద్యోగస్థులేర్పరచునట్టిగాని వారిగౌరవార్థము జరుగునట్టిగాని సత్కారములలో సంబంధము కల్గించుకొనకూడదు.

3. ప్రభుత్వమువారి పాఠశాలలనుండిగాని వారిసహాయమును చెందు బడులలోనుండిగాని విద్యార్థులను క్రమముగ మరల్పవలెను. వీని స్థానమున జాతీయకళాశాలల నిర్మింపుదు.

4. న్యాయవాదులును, కక్షిదారులును క్రమేణ కోర్టులను బహిష్కరించవలెను. ప్రజలు వివాదముల తీర్మానించుకొనుటకు పంచాయతీకోర్టులను స్థాపింపుదు.

5. సైనికులుగాని గుమాస్తాలుగాని కూలివాండ్రుగాని మెసపటోమియాలో పనికి ఒప్పుకొనగూడదు.

6. నూతనశాసనసభల కెవరును ప్రతినిధులుగా నిలువకూడదు. ఈనిర్ణయమునకు వ్యతిరేకముగ ప్రవర్తించువారికి ఓటర్లు సమ్మతుల నివ్వకూడదు.

7. విదేశవస్తువులను బహిష్కరింపుఁడు.

త్యాగము అభ్యాసముకానియెడల అభివృద్ధి చెందజాలము; కావున బహిష్కారము త్యాగమును వృద్ధిచెందుటకై తలపెట్టబడినది. ఇందు మొదట ప్రతిపురుషుడును, స్త్రీయు, శిశువును అట్టిశిక్షను త్యాగమును అలవరచుట కవకాశమునిచ్చుటకై ముఖ్యముగ వస్త్రములలో స్వదేశవ్రత మవలంబించవలెను. ఇచ్చట తగినంతనూలు, బట్టలు తయారుకానందున చేతిరాటములతో నూలును వడకవలెను. తగుప్రోత్సాహములే వారివృత్తులువదలివేసిన సాలెలు మరల నేతపరిశ్రమకు పూనునట్లుల వా కుద్బోధింపవలెను.

ఈమహాసభ జరగగానే దేశీయనాయకు లనేకులు మహాసభలో శాసనసభల బహిష్కరించువిషయమున భిన్నాభిప్రాయులై యున్నను మహాసభ తీర్మానమును తిరస్కరించుట కిష్టములేక వారియభిప్రాయము గూర్చుకొని యభ్యర్థులుగా నిలువరైరి. వారిలో ప్రముఖు లెవ్వరనిన:—

1. సేలం విజయరాఘవాచార్యులు, 2. దివాన్ వి. పి. మాధవరావు, 3. సీ. ఆర్. దాసు, 4. బీ. చక్రవర్తి, 5. కేల్కార్. 6. బాప్టిస్థ, 7. టంగుటూరు ప్రకాశము, 8. కొండా వెంకటప్పయ్య, 9. టీ. ఆర్. వెంకట్రామఅయ్యర్, 10. డాక్టర్ మూంజీ.

ఈ పై తీర్మానము నామోదింపబడినతర్వాత నప్పటికే సన్నగిల్లుచుండిన మితవాదులు దేశీయమహాసభను వదలిపెట్టిరి. ఈసభాంతరమున గాంధిగారును అలీసోదరులును దేశమంతట తిరిగి ఈయుద్యమతత్వమును ప్రజలకు జక్కగ బోధించిరి. క్రమేణ భేదాభిప్రాయములు నశించెను. ఈసంవత్సరాంతమున మామూలుమహాసభ నాగపురమున సమావేశమాయెను. భరతఖండమునందలి వివిధప్రాంతములనుండి వేనవేలు ప్రతినిధులు భక్తియుత్సాహపూరితులై నాగపురమునకు విచ్చేసిరి. ఈమహాసభకు శ్రీయుత యరవిందఘోషు రాచాలమిచే శ్రీయుత సేలం విజయరాఘవాచారిగారు అధ్యక్షత వహించిరి. ఈమహాసభయం దామోదింపబడ్డ తీర్మానములలో ముఖ్యమైన రెంటిని నిం దుదాహరించుచున్నాము.

దేశీయమహాసభ ప్రధానయుద్దేశము.

సవ్యమైనట్టియు శాంతియుతమైనట్టియు పద్ధతులవలన హిందూదేశప్రజలు స్వరాజ్యము సంపాదించుట ఈసభముఖ్యోద్దేశమై యున్నది. ఈతీర్మానమునుగూర్చి విశేషచర్చ జరిగెను. ఈసభ జరుగువఱకు యుండిన ముఖ్యోద్దేశ మేమన—"బ్రిటిష్‌సామ్రాజ్యమునందుండి స్వపరిపాలన మనుభవించుచున్న దేశములలోని పరిపాలనావిధానమువంటి విధానము హిందూదేశప్రముఖులు సంపాదించుటయు, సామ్రాజ్యములోని హక్కుబాధ్యతలను యట్టిదేశములతోపాటు వారును సమానముగ పాల్గొనుటయు యీమహాసభోద్దేశ్యము."

ఇప్పటిస్థితిగతులబట్టి ఆంగ్లసామ్రాజ్యమున ఎల్లప్పు డుండుట యసంభవమనియు సామ్రాజ్యమునుండి వీడి ప్రత్యేక స్వతంత్రరాష్ట్రముగా

నుండుటయే మనగమ్యస్థానమని యనేకులు వాదించిరి. సామ్రాజ్యమునం దుండుటయే మనకు శ్రేయోదాయకమని మఱికొందరు సూచించిరి. దీర్ఘమైనచర్చ జరిగిన పిదప పై నుదహరించినతీర్మానమే యామోదింపబడెను. ఇందువలన గాంధిగారు ఉపన్యాసమున సూచించినట్లు బ్రిటిష్‌సామ్రాజ్యమం దుండుటకుగాని వీడిపోవుటకుగాని యేలాటిప్రతిబంధక ముండదు.

రెండవతీర్మాన మేమనిన:—కాంగ్రెస్‌సభవారి యభిప్రాయములో హిందూదేశమును పాలించుచున్న ప్రస్తుత ప్రభుత్వమువారు, ప్రజలయొక్క విశ్వాసమును కోల్పోవుటచేతను; ఇప్పుడు హిందూదేశప్రజలు స్వరాజ్యమును స్థాపించుటకు నిశ్చయించుకొని యుండుటచేతను; తమహక్కులను స్వాతంత్ర్యములను ప్రభుత్వమువారు సరిగా అంగీకరించునట్లు చేయుటకును, తమకు సంభవించిన హింసాకరములగు అనేకవిపత్తులను అందు ముఖ్యము కిలాఫతు, పంజాబులకు సంబంధించినవాటిని నివారణ చేసుకొనుటకును, కలకత్తాఅవసరమహాసభకుపూర్వము హిందూదేశప్రజలు అవలంబించిన పద్ధతులన్నియు విఫలము లగుటచేతను; ఇప్పుడు ఈకాంగ్రెసుసభ కలకత్తా అవసరసభయందు ఆమోదింపబడిన దౌర్జన్యరహితమగు సహాయనిరాకరణ తీర్మానమును తిరిగి స్థిరపరుచుచు; ప్రస్తుత ప్రభుత్వమునకు సహాయమును నిరాకరించుట మొదలుచేసుకొని, పన్నులను చెల్లింపకుండుటవరకుగల సహాయనిరాకరణ విధానము నంతనుగాని, అందులో ఒకభాగముగాని, లేక కొన్నిభాగములుగాని, దేశీయమహాసభవారైనను, యావద్భారత కాంగ్రెసుసంఘమువారైనను నిర్ణయించెడి సమయమున అమలులో పెట్టవలెననియు, ఈలోపుగ దేశమును ఇందుకుసంసిద్ధపరుపవలెననియు; అందుకొరకై గట్టిప్రయత్నములను ఇంకను ఈక్రిందివిధముగ అవలంబించుచుండవలెననియు, ప్రకటించుచున్నది.

(1) 16 సంవత్సరముల లోపు వయస్సుగల విద్యార్థుల తల్లిదండ్రులను, సంరక్షకులను (విద్యార్థులను స్వయముగ కాదు) ప్రభుత్వమువారి యాజమాన్యమున ఉన్నట్టిగాని, వారిసహాయమును పొందుచున్నట్టిగాని,

వారివశమునం దున్నట్టిగాని పాఠశాలలనుండి తమపిల్లలను తొలగించుటకు ఎక్కువ ప్రయత్నములు చేయవలయునని కోరవలెను. అందుతో పాటు, విద్యార్థులు జాతీయపాఠశాలల మూలమునగాని, అట్టివిలేనియెడల తమశక్తిననుసరించి ఇతరసాధనముల మూలమునగాని శిక్షను బడయుట కేర్పాటులు కావింపవలెను.

(2) భారతజాతి హృదయపూర్వకముగ తుదముట్టింపనిశ్చయించిన పరిపాలనవిధానమునకు లోబడియున్న పాఠశాలలలో ఇంకను చదువుచుండుట తమ యంతరాత్మకు విరుద్ధముగా తోచినయెడల 16 సంవత్సరముల వయస్సుకలిగినట్టియు, అంతకుపై బడినట్టియు విద్యార్థులు పర్యవసానమును లెక్కింపక, కాలవిలంబనము లేకుండ ప్రభుత్వమువారి సహాయమును పొందుచున్నట్టి గాని, వారిఅధికారమునకు లోబడినట్టిగాని పాఠశాలలనుండి లేచిరావలెనని కోరవలెను. అట్టివిద్యార్థులు సహాయనిరాకరణోద్యమమునకు సంబంధించిన సేవలో నిమగ్నులై యుండవలెననియు లేనియెడల జాతీయవిద్యాలయములలో చదువుకొనుచుండవలెననియు, సలహానీయవలయును.

(3) ప్రభుత్వమువారి అంగీకారమును పొందినట్టిగాని వారిసహాయము పొందుచున్నట్టిగాని పాఠశాలలను జాతీయపాఠశాలలుగ మార్చుటకై వానిపోషకులను, ఉపాధ్యాయులను, మ్యునిసిపల్ లోకలుబోర్డులను కోరవలయును.

(4) న్యాయవాదులు తమవృత్తిని మానుటకు ఎక్కుడు ప్రయత్నములు కలుపవలెననియు, ఇతరన్యాయవాదులును, కక్షిదారులును, కోర్టులను బహిష్కరించునటులచేయుచు, మధ్యవర్తులద్వారా తగాదాలు పరిష్కారమగునట్లు చేయుచు, జాతీయసేవయందు తమకాలమును వినియోగించునట్లు కోరవలయును.

(5) హిందూదేశము ఆర్థికముగా స్వతంత్రముగ నుండుటకును, సర్వపరిశ్రమసంకలితముగ నుండుటకును, వర్తకులు విదేశవ్యాపారసంబంధమును క్రమక్రమముగ వదలుకొనవలెననియు, నూలువడకుటకు నేతనే

యుటకు ప్రోత్సాహము కలిగింపవలెననియు కోరవలెను. ఆర్థికసంబంధమగు బహిష్కారవిధానమును తయారుచేయుటకు యావద్భారత కాంగ్రెసు సంఘమువారు నిపుణులను కొందరిని నియమింపవలెను.

(6) సహాయ నిరాకరణోద్యమ విజయమునకు స్వార్థత్యాగ మత్యవసరము కావున, దేశములోని ప్రతిపురుషుడును, ప్రతిస్త్రీయును జాతీయోద్యమముకొరకు శక్తివంచనలేకుండ త్యాగము చూపవలెననియు కోరవలెను.

(7) సహాయనిరాకరణోద్యమము సత్వరాభివృద్ధిగాంచుటకు, ప్రతి గ్రామమునందును, సంఘములను నెలకొల్పవలెను. ప్రధాన పట్టణములలో కేంద్రసంఘములను నెలకొల్పవలెను.

(8) జాతీయ సేవకాసంఘ మను పేరుతో జాతీయసేవకులను సిద్ధపరుపవలెను.

(9) 'జాతీయసేవ'కును, సహాయ నిరాకరణోద్యమమునకును, అవసరమగు జాతీయనిధిని నెలకొల్పుటకు గట్టిప్రయత్నములు సలుపవలెను. ఈనిధికి 'అఖిలభారతీయ తిలకుస్మారక స్వరాజ్యనిధి' అనునామమిడవలెను.

సహాయనిరాకరణకార్యక్రమమును ఆచరణలో పెట్టుటయందును, అందు ముఖ్యముగా వోటర్లు శాసనసభలను బహిష్కరించుటయందును దేశీయులు ఇంతవరకు చూపిన అభివృద్ధికి వారిని ఈకాంగ్రెసు అభినందించుచున్నది. శాసనసభలు ఏర్పడిన స్థితిగతులనుబట్టి అవి దేశీయులప్రతినిధిసభలు కావని కాంగ్రెసు నిశ్చయించుచున్నది. వోటర్లలో ఎక్కువమంది తమవోట్లను ఈయకున్నను శాసనసభలకు పోవనిష్టపడినవారు ఇప్పుడైనను తమ సభ్యత్వమును వదలుకొనవలసినదని కాంగ్రెసు కోరుచున్నది. వోటర్లసమూహము వెల్లడించిన అభిప్రాయమునకు విరుద్ధముగను; ప్రజాస్వామికధర్మమునకు వ్యతిరేకముగను సంచరించి వారు తమ సభ్యత్వము వదలనియెడల వోటర్లు వారివద్దనుండి రాజకీయముగ ఎట్టిసహాయము అపేక్షింపగూడదు.

ప్రజలకును పోలీసు మిలిటరీవారికిని వృద్ధిపొందుచున్న స్నేహభావమును కాంగ్రెసు సంతసముతో గమనించుచున్నది. పోలీసువారు తమ దేశక్షేమమునకును విశ్వాసములకును భంగకరములుగ నుండెడి అధికారుల ఆజ్ఞలను నిరాకరించెదరని కాంగ్రెసుసభ నమ్ముచున్నది. ప్రజలయెడ పోలీసువారు సౌమ్యముగ ప్రవర్తించి, ప్రజలభావములను వారేమాత్రము గుర్తించుటలేదను నిందను బాపుకొనెదరని తలచుచున్నది.

ప్రభుత్వోద్యోగములయం దున్నవారెల్లరును ఉద్యోగములను విసర్జింపుడని తమ్ము కాంగ్రెసు కోరులోపల ప్రజలయందు ఎక్కుడు దయతోడను నిష్పక్షపాతబుద్ధితోడను ప్రవర్తింపవలెననియు ప్రజాసమావేశములన్నిటిలో వారు పాల్గొనకపోయినను వానికన్నిటికిని నిర్భయముగను బహిరంగముగను హాజరుకావలెననియు జాతీయోద్యమమునకు బహిరంగముగ సహాయము చేయుచుండవలెననియు కాంగ్రెసుసభ విన్నవించుచున్నది.

కిలాఫత్తు, పంజాబు అన్యాయములు తొలగుటకును స్వరాజ్యము ఒకసంవత్సరములో స్థాపితమగుటకును కాంగ్రెసునకు చేరినట్టిగాని చేరక పోయినట్టిగాని సంఘములన్నియు దౌర్జన్యరహిత సహాయనిరాకరణోద్యమాభివృద్ధికొరకు తమయావచ్ఛక్తిని వినియోగింపవలెనని కాంగ్రెసు సభకోరుచున్నది. సహాయనిరాకరణోద్యమము విజయముగాంచుటకు ప్రజలలో అన్యోన్యసహాయము పెరుగుట ఆవశ్యకము. అందుచే హిందూమహమ్మదీయ ఐక్యతకు పెంపొందింపవలెనని ప్రజాసంఘము లన్నిటిని కాంగ్రెసుసభ కోరుచున్నది. బ్రాహ్మణులకును బ్రాహ్మణేతరులకును పోరాటము లున్నచోటులలోనెల్ల హిందూప్రముఖులు ఆపోరాటముల పరిష్కరింపవలెననియు, అంటరానితనమును హిందూమతమునుండి తొలగించుటకు ప్రత్యేకప్రయత్నములను సలుపవలెననియు, నిమ్నజాతుల ఉద్ధరణవిషయమై హిందూమతమును సంస్కరించుటకు జరుగుచున్న యత్నములకు మతాధిపతులను ఈకాంగ్రెసులో సమావేశమైన హిం ప్రతినిధులును ముఖ్యముగా ఎక్కువకృషి సలుపవలెనని కాంగ్రెసుశానించుచున్నది.

కలకత్తా అవసరసభలో కావింపబడిన తీర్మానమునకన్న, ఈతీర్మానము విపులముగను, స్పష్టముగను ఉన్నది. కలకత్తాసభనాటికి జాతీయవాద ప్రముఖులలో, సహాయనిరాకరణము పట్ల విశేషభేదాభిప్రాయము లుండెను. కాని మహాత్మా గాంధిగారి రాజనీతికౌశలము వలనను, ప్రజాభిప్రాయ ప్రాబల్యము వలనను, క్రమముగ జాతీయవాద నాయకులందరును సమాధానమునకువచ్చి నాగపురసభలో సహాయ నిరాకరణ తీర్మానమును అత్యుత్సాహముతో నామోదించిరి.

ఈమహాసభానంతరము సహాయనిరాకరణోద్యమము దేశమంతట వ్యాపించెను. దేశీయమహాసభ తీర్మానప్రకారము ననేకులు తమవృత్తులను మానుకొని దేశమున ప్రచారము జేయుచున్నారు. ఏగ్రామమున జూచినను యతురాన్యులు కానివారుసహితము నీయుద్యమమునకు మిక్కిలి తోడ్పడుచున్నారు. యుద్యమాభివృద్ధికై తిలకు స్వరాజ్యనిధికి యొకకోటికన్న హెచ్చుమొత్తముసమకూరినది. స్వదేశోద్యమము, మద్యపాననిషేధోద్యమము విరివిగ సాగుచున్నవి. అధికారులపట్ల ప్రజలకు భయవిశ్వాసములు పోయినవి. దీనిజూచి యధికారులు తల్లడిల్లుచున్నారు. ప్రథమమున యుద్యమము తనంతట నశించునని రాజప్రతినిధి ఛంస్ఫర్డు చెప్పియుండెను. అట్లు నశించదనితలచి క్రొత్తగవచ్చిన రాజప్రతినిధి తన పశుబలమును ప్రజలపై జూపుచున్నాడు. ఎటుచూచినను దేశీయనాయకులను, ప్రచారనాయకులను కారాగారములయం దుంచుచున్నారు. ఎచ్చటనో ఒకటి రెండు చోట్లలో తప్ప తక్కినచోట్లయం దంతటను ప్రజలు శాంతమును వదలక యుంటున్నారు. ఆయొకటిరెండుచోట్లలో యల్లరులకు కారణము యధికారులే యని తేలుచున్నది. ఇట్టిసందిగ్ధసమయమున ప్రజలకర్తవ్యమునుగూర్చి గాంధిమహాశయుడు అప్పుడప్పుడు హెచ్చరించుతీరున ప్రజలు నడచుకొన్నయెడల స్వరాజ్యము శీఘ్రకాలమున లభించుట కేలాటిసంశయమును లేదు.

చెన్నపురి: 'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1922.

END OF
TITLE